# అంబేద్కరిజం

(అంబేద్కరు సాంఘిక రాజకీయ కార్యప్రణాళికపై సిద్ధాంత గ్రంథం)

బోయి భీమన్న

ప్రచురణ: భీమన్న సాహితీ పీఠం

ప్రచురణ: 1985

ప్రతులు : 2,000

హక్కులు : రచయితవి

వెల రూ. 15/-

ముద్రణ :
యశోధరా ఆర్ట్ ప్రింటర్స్
చింతలబస్తీ, హైదరాబాద్.

ప్రతులకు :
ఐ.సి. 85,
ఇరం మంజిల్ కాలనీ,
హైదరాబాదు - 500 482

అది యొక మాలపేట ; గత

మం దెపు డెవ్వరు చేసి రెట్టి త

ప్పిదము ? ఎరుంగరాదు ; తమ

వెట్టికి, వేధకు హేతు వేమి ? తె

ల్వదు ; మరి సాటి వారు కల

వా రెటులైరొ శ్రమించకుండ నే ?

అది అట నున్న దెప్పటిదో

హైందవ నీతికి దిష్టి బొమ్మయై !

("జన్మాంతర వైరమ్" కావ్యం నుండి)

# భావ స్రవంతి

నిన్ను మించిపోవాలన్నది నా కోరిక
కనీసం నిన్ను అందుకోగలనా అన్నది నా సందేహం,
కోరిక నీకే మార్గదర్శకమై ముందుకు దూకుతుంటే
సందేహం నన్ను నన్నే వెనక్కి గుంజేస్తున్నది.

ఎవరైనా కొందరు మేధావులు, ముఖ్యంగా దళిత కులాలకు చెందిన మేధావులు, ఒక కమిటీగా ఏర్పడి, "అంబేడ్కరిజం" గురించి ఒక సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించవలసి వున్నదని నేను నా "అంబేడ్కర సుప్రభాతం" కావ్యపీఠికలో ఒక సూచన చేసివున్నాను. అందరూ ఔనన్న సూచన అది.

లోగడ జరిగిన ఒక సభా సన్నివేశం కారణంగా ఇప్పుడు నేనే అంబేడ్కరిజం గురించి నా ఉద్దేశాలను వెల్లడించవలసి వచ్చింది. అంబేడ్కరు గురించి, ఆయన సిద్ధాంతాలను గురించి నేను అవగాహన చేసుకొన్న పద్ధతిలో అంబేడ్కరిజానికి ఈ రూపకల్పన చేశాను. ఎవరికైనా ఈ నా సిద్ధాంతీకరణ నచ్చినా నచ్చకపోయినా, ముందుగా క్షుణ్ణంగా చదివి, అర్థం చేసుకొని, సర్వజనీన దృక్పథంతో అందరూ ఆలోచిస్తారనే విశ్వసిస్తున్నాను.

**1984** అక్టోబరు **14** సాయంకాలం, హైదరాబాదులోని వీర్‌నగర్‌లో అంబేడ్కరు లైబ్రరీకి నేను ప్రారంభోత్సవం చేశాను. అక్కడి అంబేడ్కర యువజన సంఘం యువకులు ఆ లైబ్రరీని నెలకొల్పుకొన్నారు. ఇలాంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి గునుమల జ్ఞానేశ్వర్ తన మిత్రులైన పి.బి.సురేష్, జె.నరసింహులు మొదలైన యువకులతో వచ్చి నన్ను ఆ ఉత్సవంలో పాల్గొనజేశాడు.

ప్రారంభోత్సవం మొదట్లో నేను రిబ్బను కత్తిరించి హాలులోకి ప్రవేశించి అంబేడ్కరు పటం ముందు నిలబడినప్పుడు, ఇద్దరు బౌద్ధ భిక్షువులచే త్రిశరణాలూ, బుద్ధ వందనమూ గానం చెయ్యబడ్డాయి.

''నమో తస్స భగవతో అరహతో సమ్మా సంబుద్ధస్స'' అంటూ ప్రారంభ మైన ఆ వందనాన్ని భిక్షువులు ఒక్కొక్క మాటనే అంటూ వుంటే, అక్కడ చేరిన జనం దానిని రిపీట్ చేస్తూ వచ్చారు.

అంబేడ్కరుకు సంబంధించిన కొన్ని రకాల సమావేశాలలో, బౌద్ధ భిక్షువులు అందుబాటులో వున్నప్పుడు, బుద్ధ వందనమూ, త్రిశరణ గానమూ జరపడం ఈ మధ్య ఒక ఆచారమయింది. అందులో మన నాయకుడైన అంబేడ్కరు ప్రస్తావన అసలు వుండడమే లేదు. ఇది నేను సహించలేని సంగతి.

వందనం ముగిసి జనం కదలబోతున్న సమయంలో నేను వారిని ఆపి, నా త్రిశరణాలు చెప్పాను. వాటిని కూడా భిక్షువులతో పాటు జనం రిపీట్ చేశారు. నా త్రిశరణాలలో బుద్ధం అనే పదానికి బదులు భీమం అనే పదం వుంచాను. అది అనుకోని సంఘటన. అందరూ ఆమోదించిన సవరణ.

బుద్ధం అనే పదానికి బదులు అంబేడ్కర్ అనే మొదట అన్నాను. అయితే, బుద్ధం అనే రెండక్షరాల స్థానంలో అంబేడ్కర్ అనే మూడక్షరాలు ఇమడవు. అందుకే భీమం అనవలసి వచ్చింది. భీమం అంటే భీమారావు అంబేడ్కరు. జై భీమ్ వంటి ప్రయోగాల ద్వారా భీమ్, భీమం పదాలు సర్వత్రా ప్రచారంలో వున్నట్టివే.

భీమం అంటే భయంకరుడైన వాడు అని అర్థం. అంబేడ్కరు భయంకరుడూ, భయ రహితుడూ, Fierce and Fearless. దుష్ట శిక్షకుడూ, శత్రు భయంకరుడూ అయిన అంబేడ్కరు యొక్క ఉదాత్త వ్యక్తిత్వానికి భీమం అనే పదమే సరైనట్టిది.

ఆ విధంగా, అనుకోని ఒక మార్పుతో ప్రారంభమైన ఆ ఉత్సవంలో నా ప్రసంగం కూడ కొంత విప్లవ ధోరణిలోనే కొనసాగింది.

మానవ చరిత్రను పరిశీలించి చూస్తే, అనాది నుంచీ మనకు తెలియకుండానే కొన్ని కొన్ని అపచారాలూ, అపోహలూ మనల్ని అంటుకొని వస్తూ వుండడం కనిపిస్తుంది. ఎప్పుడో ఒకప్పుడు ఎక్కడో ఒక చోట ఆగి, సింహావలోకనం చేసుకొని, పునఃపరిశీలన జరిపి, అవసరమైన ఆచారాలను వుంచుకొని, పనికిరాని వాటినీ,

కాలదోషం పట్టిన వాటినీ విసర్జించి పారవేస్తూ వుండాలి. లేకపోతే మానవజీవితం ఒక శవ పేటికగానో, ఒక మురికి గుంటగానో, ఒక కీకారణ్యంగానో తయారైపో తుంది. దుర్భరమై పోతుంది.

## ఏ నీతి సూత్రమైనా

ఆనాటి సభలో నాకు ఆ విధంగా తట్టిన భావాలను స్వేచ్ఛగా వెల్లడించి వున్నాను. అందులో కొన్ని ఇవి–

(1) శాంతి, సత్యం, అహింస అనేవి వట్టి నినాదాలు మాత్రమే. మానవ చరిత్రలో ఎప్పుడూ ఎక్కడా అమలు జరిగినట్టివి కావు.

(2) సందర్భోచితమైన శక్తి యుక్తులను ప్రదర్శించడం ద్వారానే మానవ సమాజం ప్రగతిని సాధించగల్గింది. అంతేగాని, సత్యాహింసల ద్వారా మాత్రం కాదు.

(3) అహింస సహజమైనట్టిది కాదు. హింస చెయ్యకుండా వుండడం సాధ్యం కాదని కృతయుగంలోనే ధర్మవ్యాధుడు హేతుబద్ధంగా పేర్కొని వున్నాడు. అహింసా సిద్ధాంతం అసహజమంటూ దానిని వ్యతిరేకించిన తొలి విప్లవకారుడు ధర్మవ్యాధుడే.

(4) "అహింసే పరమ ధర్మం" అనే సూక్తి యొక్క విలువ చెప్పడం వరకే. చెయ్యడానికి పనికిరాదు. బలంకలవాళ్లు, అగ్రకులాల వాళ్లు సాధువులైన ప్రజలను మోసగించి కూడబెట్టుకొన్న సంపదను రక్షించుకోవడానికీ, ప్రజలు తిరగబడకుండా నిరోధించడానికీ కల్పించిన సూత్రమే ఏ నీతి సూత్రమైనా.

(5) బౌద్ధ మతం పాతిక వందల సంవత్సరాల క్రితం నుంచీ వుంది. బుద్ధుడు గాని, ఆయన నిర్మించిన సంఘంగాని, ఆయన ప్రతిపాదించిన ధర్మం గాని ఇంతవరకూ దళిత జనోద్ధరణ కోసం, అస్పృశ్యతా నివారణకోసం, కుల భేదాల రద్దుకోసం, దారిద్ర్య నిర్మూలన కోసం ఎట్టి కార్యక్రమాలనూ చేబట్ట లేదు. అందుకు నిజంగా కృషిచేసినవాడు అంబేడ్కరు ఒక్కడే.

(6) అంబేడ్కరు మతం కోసం బౌద్ధ మతంలో చేరలేదు. ఏ లక్ష్య సాధన కోసం తన జీవితమంతా శ్రమించాడో ఆ లక్ష్యాన్ని సాధించడానికి మతం మార్పిడిని ఒక సాధనంగా మాత్రమే ఆయన వినియోగించుకొన్నాడు.

(7) బుద్ధుడి కంటె అంబేడ్కరు ఎన్నో విధాల ఆధునికుడు, అధికుడు. సాంఘిక రాజకీయ వైజ్ఞానిక స్పృహ నూటికి నూరుపాళ్ళు కలది అంబేడ్కరిజం. ఇది ఒక మతం కాదు. అంబేడ్కరిజంలో మతానికి ప్రాధాన్యం వుండకూడదు. ఏ మతం వాడైనా అంబేడ్కరిస్టు కావచ్చు.

(8) అన్ని రంగాలలోనూ సమాన హక్కుల కోసం, సమాన అవకాశాల కోసం సమాన సుఖశాంతుల కోసం మానవుడు జరిపే పోరాటమే అంబేడ్కరిజం.

(9) అంబేడ్కరు విగ్రహాలు ప్రతి గ్రామంలోనూ నెలకొల్పబడాలి. విగ్రహం వుండే ప్రతిచోటా ఒక లైబ్రరీ వుండాలి. అందులో అన్ని కులాలకూ అన్ని సంస్కృతులకూ చెందిన సాహిత్య గ్రంథాలుండాలి. పరిశోధనలు జరగాలి. సంగీత సాహిత్యాది కళలలో శిక్షణ ఇవ్వబడాలి. దళిత వర్గాలు ఏ రంగంలోనూ ఎవరికీ తీసిపోనంతటి ప్రజ్ఞా ప్రాభవాలను గడించుకోవడానికి నిరంతరం కృషి చెయ్యాలి.

(10) అన్యాయాలను, అవమానాలను, దారిద్ర్యాన్ని, దళితత్వాన్నీ ధైర్య సాహసాలతో ఎదిరించి నిలవగల దిట్టలుగా ప్రజలను తయారుచెయ్యాలి. "బానిసగా బ్రతకలేవా? బలం సంపాదించుకో" అనే సూత్రాన్ని పటిష్ఠంగా అమలుపరచాలి.

ఈ విధంగా సాగిన నా ఉపన్యాసానికి అక్కడి యువకులంతా ఎంతో ఉత్తేజితులయ్యారు. ఉత్సాహం పెల్లుబికింది. ఆ ఉత్సాహంలో అందులో కొందరు నన్ను కోరారు - అదే ధోరణిలో అంబేడ్కరిజం గురించి ఒక గ్రంథం వ్రాయమని.

ఆనాటి సమావేశంలో దళిత సమస్యలపట్ల నిరంతరం శ్రద్ధాళువులై ఎప్పటికప్పుడు వాటి పరిష్కారం కోసం కార్యరంగంలోకి దూకుతూ వుండే ఉత్తమశ్రేణి యువకులు చాల మందే పాల్గొన్నారు. శ్రీయుతులు సి.రాములు, బొజ్జా తారకం, జె.బి.రాజు, యమ్.ప్రేమ్ కుమార్, బి.రామస్వామి, బడుగు పురుషోత్తం, నాతి నారాయణమూర్తి, భూషి రామదాసు, టి.శ్రీనివాసరావు, మాష్టార్‌జీ, ఎస్.చెన్నయ్య వంటి స్ఫూర్తిమంతులైన వారెందరో అందులో వున్నారు. ఈ గ్రంథ రచనకు మూలం

ఆనాటి సభ. ఆ సభలో వెలువడిన నా భావాలు. వాటిని గ్రంథస్థం చెయ్యమని నన్నుకోరిన ఆ యువకులు.

నాకు సహజం కాని ఒక విలక్షణ ధోరణిలో, ఒక విపరీత శైలిలో వెలువడిన గ్రంథం ఇది. భావాలే కాదు, పదాలూ వాక్యాలూ కూడ ఎన్నెన్నో పునరుక్తాలైనై. ఒక చిత్రమైన భావ ప్రవంతి (Stream of Conscience) అనేది ఒక ప్రముఖ విధానం. భావాలు ఒక ప్రణాళిక ప్రకారం కాక, తరంగాలుగా పెల్లుబికి ప్రవహించే పద్ధతి ఇది. వచ్చిన భావాలు వచ్చినట్టే అక్షర బద్ధం చెయ్యబడతై. అంత స్వేచ్ఛగా కొనసాగింది ఈ రచన.

ఈ రచనకు మొదట్లో నేను పెట్టిన పేరు "నా దృష్టిలో అంబేద్కరిజం" అని. నా దృష్టిలో అనడం ఎందుకు? అంటూ ప్రశ్నించారు గనుమల జ్ఞానేశ్వర్, వారా వేణు వంటి కొందరు సన్నిహిత మిత్రులు. అనంతపురంలో ఈ శీర్షికను చూచిన చింతా శ్రీరామమూర్తి గారు నా దృష్టిలో అన్నమాట అక్కరలేదని నా చేత ఒప్పించగలిగారు. మునప్పగారు కూడా అందుకు తోడ్పడ్డారు.

"మీ రచనలన్నీ కూడ మీ దృష్టిలోవే కదా? మీ సొంత భావాలే కదా? ఈ ఒక్క గ్రంథానికి నా దృష్టిలో అని పేర్కొనడం ఎందుకు?" అదీ వారి వాదన. నిజమే కదా మరి?

ఈ గ్రంథాన్ని వ్రాసే సందర్భంలోనూ ముద్రణ జరిగే సమయంలోనూ నాకెంతో సహకారం అందించిన కొద్ది మంది మిత్రులకు నేను కృతజ్ఞతలు చెప్పవలసి వుంది. అందులో ఇద్దరు మరీ ముఖ్యులు. ఒకటి గనుమల జ్ఞానేశ్వర్, రెండు కుసుమ జవహర్‌లాల్.

పూర్వం అయితే నా రచనలన్నీ నేనే స్వహస్తంతో వ్రాసుకునే వాణ్ని. నిజానికి డిక్టేటు చేసే అలవాటు నాకు లేదు. ఈ మధ్య స్వయంగా వ్రాసుకోలేకపోతుండడంవల్ల, డిక్టేటు చెయ్యడం తప్పనిసరి అయింది. డిక్టేటు చేస్తే వ్రాసేవాళ్లుండాలి కదా! మా ఆవిడ హైమవతి, మా అమ్మాయిలు విజయపల్లవి, విజయేందిరా అప్పుడప్పుడూ వ్రాస్తుంటారు. కాని ఎప్పుడు బుద్ధిపుడితే అప్పుడు డిక్టేటు చేస్తే వ్రాయగల వాళ్ళు లేరు. అంబేద్కర సుప్రభాత కావ్యరచనా సందర్భంలో వలెనే, ఈ అంబేద్కరిజం గ్రంథ రచనా సందర్భంలో కూడ ఈ పనిని దృఢ దీక్షతో నిర్వహించిన వాడు కుసుమ జవహర్‌లాల్.

గనుమల జ్ఞానేశ్వర్ కూడా అలాంటివాడే. ఏదైనా పని పట్టుకుంటే అది పూర్తయ్యే వరకు నిద్రపోని కార్యసాధకుడూ, నిరంతర శ్రామికుడూ ఆయన.

## అద్దానికి ముందూ, వెనకా

నన్నెవరూ అపార్థం చేసుకోకూడదని నా ఆకాంక్ష. ఎందుకంటే-

(1) నాకు కుల మత భేదాలు లేవు. మానవుణ్ని, కనీసం భారతీయుణ్ని. కుల మత భేదాల నుంచి రక్షించడానికే ఈ గ్రంథంలో నేను కుల మత చర్చ చేశాను. విమర్శించాను.

(2) కులం, మతం, పదవీ రాజకీయం ఈ మూడే మానవ జాతిని తెలియకుండా తినేస్తున్న విషక్రిములు. వాటిని నిర్మూలించకుండా మానవ జాతి ముందుకు నడవజాలదనేది నా విశ్వాసం

(3) నేను నిరసించేది కుల బ్రాహ్మణ వ్యవస్థను. జ్ఞాన బ్రాహ్మణ తత్వాన్ని కాదు. జ్ఞాన బ్రాహ్మణులు అన్ని కులాలలోను, అన్ని మతాలలోను వున్నారు. వారికి నా నమస్కారాలు.

(4) జగమెరిగిన బ్రాహ్మణుడికి జందెం అక్కరలేదనేది లోక సత్యం. అది వైదిక ధర్మ సత్యం కూడా. సన్యాసికి జందెం నిషిద్ధం. సన్యాసి అంటే బ్రహ్మజ్ఞాన పారమ్యాన్ని అందుకొన్నవాడు. అట్టివాడికి జందెం, నామం వంటి కుల మత ప్రత్యేక చిహ్నాల ప్రమేయం వుండదు. ఉంటే అతడు బ్రహ్మజ్ఞాని కాదు. నేను మన్నించేదీ, ఆమోదించేదీ జ్ఞాన బ్రాహ్మణుణ్ని.

(5) బ్రహ్మజ్ఞానం అంటే బ్రహ్మం గురించిన జ్ఞానం. బ్రహ్మం అంటే ఏమిటో అనేకచోట్ల చర్చించి వున్నాను. ఒక అద్దం ఉన్నదనుకోండి, మనకు వుండే పని అంతా దాని ముందు భాగంతోనే. దాని వెనక భాగంతో మనకు పని లేదు. దానిని గురించిన ఆలోచనే మనకు వుండదు, వుండనక్కర లేదు కూడా. అయితే ముందు భాగానికి వెనక భాగం ఆధారమనేది సత్యం. ఈ సత్యం తెలియడమే జ్ఞానం. ఆ వెనక భాగమే బ్రహ్మం. మనం వాడుకునే ముందు భాగం ప్రకృతి, సృష్టి. ఇదీ నా దృష్టిలో వైదిక ధర్మ సూత్రం. నిజమైన బ్రహ్మజ్ఞాని ధరించవలసింది ఈ సూత్రాన్ని, నూలు దారాన్ని కాదు.

(6) కులాలకు, మతాలకు ఏ రంగంలోను కూడ ప్రత్యేక ప్రాతినిధ్యాలు, ప్రత్యేక సాంఘిక న్యాయాలు వుండకూడదనేది నా ప్రతిపాదన. అటువంటి ప్రత్యేకతలు ఏ జాతికైనా సరే పక్కలో ముళ్ళూ, నల్లులూ వలె బాధాకరం అవుతాయి. (అస్పృశ్యులది ప్రత్యేక పరిస్థితి.)

(7) నేను ప్రధానంగా కవిని. రాజకీయాలు నా కార్యరంగం కాదు. అగ్రశ్రేణి కవిగా కీర్తి ప్రతిష్టలూ, గౌరవ సన్మానాలూ అందుకొన్న వాణ్ని. దళితుడుగా పుట్టినా, దళితత్వం లేని విశ్వజనీన సాహిత్య సమారాధకుడుగా జీవిస్తున్న వాణ్ని. నేను అందరివాణ్నీ. కుల మత రాజకీయాల జోలికి పోవలసిన అవసరం నాకు లేదు.

## అయితే, ఇలాంటి గ్రంథాన్ని ఎందుకు వ్రాశాను?

నేను పుట్టిన పరిసరాలలోని దళితత్వాన్ని తొలగించడం కోసం వ్రాశాను. నేను పుట్టిన సమాజంలోని అవర్ణ సవర్ణ విషమ కాలుష్యాన్ని కడిగి వెయ్యడానికి వ్రాశాను. నేను పుట్టిన పేటలలోని దాస్యాన్నీ, దైన్యాన్నీ, దళితులమనే ఇన్ఫీరియారిటీనీ తొలగించి, యువకుల మనస్సులలో నాటుకొని వున్న తమస్సులను నా కందిన సాహిత్య దీపంతో నిర్మూలించడం కోసం వ్రాశాను. నా కృషి వృథా కాదనే విశ్వసిస్తున్నాను.

## మతాలన్నీ మార్క్సిజాలే

నేను ఈ పీఠిక వ్రాస్తున్న సమయంలో ఏదో ఆలోచిస్తూ టేబిలు మీద గల బైబిలును చేతికి తీసుకోగా, జేమ్స్ హితబోధ కనిపించింది. 5వ అధ్యాయంలోని 4వ వాక్యం మీద నా దృష్టి పడింది. అది ఇది.

Behold the hire of the labourers who have reaped down your fields, which is of you kept back by fraud' crieth: and the cries of them which have reaped are entered into the ears of the Lord of Sab'-a-oth.

(అదిగో చూడు, నీ పొలంలో పనిచేస్తున్న కూలీలను, నీ విచ్చే కూలి డబ్బుల కోసం వాళ్ళు రోజంతా పనిచేసి, నీ చేలలోని పంటను కోసి నీ ఇంటికి చేరుస్తున్నారు. ఆ సంపద అంతా ఆ కూలీల శ్రమ ఫలితమే. దానిని సృష్టించడానికి నువ్వు చేసిందేమీ లేదు. అయినా, దాని నంతా సొంతం చేసుకుంటున్నావు. అందుకు

తగిన ప్రతిఫలం నీవు ఆ కూలీలకు ఇవ్వడం లేదు. ఈ దగాకు వాళ్ళ ప్రాణాలు ఆక్రోశిస్తున్నాయి. ఆ ఆక్రోశపు కరుణ స్వరాలు భగవంతుని చెవులలో పడుతూ వున్నాయి.)

ఇది జేమ్స్ మహాశయుడు ఆనాడు చేసిన హితబోధ. పేదకూలీ జనాన్ని దగాచేసి దోచుకుంటూ సంపన్నులవుతున్న భూస్వాములకు ఆయన చేసిన హెచ్చరిక.

"మీరు చేస్తున్న దగాలను భగవంతుడు చూస్తున్నాడు. మీచేత దగాపడుతున్న పేద తమ్ముళ్ళ దీనాలాపాలను భగవంతుడు వింటున్నాడు. మీ పాపం పండేకాలం ఎంతో దూరంలో లేదు. మీ క్షణిక జీవిత భోగాల నిమిత్తం అనంతకాలం మీరు నరకయాతనలు అనుభవించబోతున్నారు" అంటూ జేమ్స్ మహాశయుడు హెచ్చరించాడు.

అయితే, ఈ హెచ్చరికను గుర్తించిన, గుర్తించి తమ స్వార్థ ప్రవర్తనను సరిదిద్దుకొన్న భూస్వాములెంత మంది?

క్రైస్తవ మతం పుట్టి **1900** సంవత్సరాలు దాటింది. దాని కంటె బౌద్ధ మతం మరొక **600** సంవత్సరాల పూర్వపుది. బౌద్ధ మతం కంటే ఉపనిషత్తులు, ఉపనిషత్తుల కంటే ఋగ్వేదం ఇంకా ఎన్నో వందల వేల సంవత్సరాల పూర్వపువి. మానవుడికి రాత్రింబగళ్ళు అర్థమై సూర్యోదయం అవగాహనలోకి వచ్చి అది హృదయాన్ని స్పందింపచేసి ఆనందం కలిగించిన నాటి నుంచే ఋగ్వేదం ప్రారంభమైందనవచ్చు. ఈ కోట్ల, లక్షల, వేల, వందల సంవత్సరాల వయస్సులు కల ఋగ్వైదిక, ఔపనిషదిక, బౌద్ధిక, క్రైస్తవ మొదలైన మతాలు ఆనాటి నుంచీ బోధించుకొంటూ వచ్చిన మానవ ధర్మ సూత్రాలు అన్నీ మొత్తం మీద ఒకే న్యాయాన్ని బోధిస్తున్నట్టివి. అది మానవులంతా ఒకటే అనే సాంఘిక న్యాయం.

ఇక్కడ నా ప్రశ్న ఒక్కటే. ఈ న్యాయాన్ని గుర్తించిన వాళ్లు, పాటించిన వాళ్లు, అమలు జరిపిన వాళ్లు ఏ మతంలోనైనా ఏ పది మందైనా వున్నారా? అనేది. (ఏ టాల్‌స్టాయో, ఏ గాంధీయో, ఏ అంబేడ్కరో తప్ప.)

అందుకే దేవుడితోనూ, పరలోకాలతోనూ ముడిపెట్టి మతాలు చెప్పే నీతి సూత్రాలు, మానవ ధర్మాలు, సమతా న్యాయాలు మానవుడి మీద పనిచెయ్యవని నేననడం. అందుకే మానవ సౌజన్యానికీ, సౌజన్య వికాసానికీ, సంపూర్ణ మానవ

—

శ్రేయస్సమాజం ఉద్భవించడానికి మత ప్రమేయం అక్కరలేదని నేననడం.

కారల్ మార్క్సు అంతటి విప్లవకరమైన కొత్త ఆర్థిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించడానికి తోడ్పడిన మూల బీజం ఈ జేమ్స్ మహాశయుడి బైబిలు వాక్యమే కావచ్చునని నాకు ఆ క్షణంలో స్ఫురించిన విచిత్ర భావం.

అందుకే చెబుతున్నాను. (1) మార్క్సిజం అంటే సమతా ధర్మం. (2) ప్రతి మతంలోని ప్రతి నీతీ మార్క్సిస్టు నీతే. (3) ఏ మతం ద్వారాను అట్టి మానవత్వ నీతి అమలు జరగలేదు. అట్టి నీతిని మతం నుంచి వేరుచేసి మార్క్సు మహాశయుడు దానిని రాజకీయం చేసి చెప్పినా కూడా, అది ఇంతవరకు తృప్తికరంగా అమలు జరగలేదు. (4) మార్క్సిస్టు దేశాలలో కూడ మార్క్సు లేదు.
(5) మానవ స్వభావాన్ని, వ్యక్తిత్వాన్ని, తనకు సొంతమైనదేదో వుండాలన్న సహజ వాంఛను, సృజనాత్మక మనస్తత్వాన్ని, కల్పనా శక్తిని అర్థం చేసుకోకుండా మానవుడి మీద కేవల భౌతికాలైన రాజకీయ వ్యావహారిక నియమ నిబంధనలను రుద్దడానికి ప్రయత్నించ కూడదు. అలా ప్రయత్నించిన ఏ మతమూ, ఏ రాజకీయ వాదమూ సఫలం కాలేదు. వాస్తవంగా అమలు జరగలేదు. నీతి నియమాలన్నీ ఇతరులకు బోధించడం వరకే పనికి వచ్చాయి. స్వతంత్ర భారత్‌లో గాంధీయిజంగా పిలవబడే ధర్మకర్తృత్వ విధానమూ, రామరాజ్యంగా పిలవబడే బ్రాహ్మణ మతాధిపత్య దార్ష్టికమూ కూడ విఫలమైపోయిన కారణం ఇదే.
(6) ప్రజాజీవితంలో క్రమ వికాసంతో కూడిన మార్పు నిజంగానే రావాలంటే, ఒక్క అంబేడ్కరిజం ద్వారానే రావలసి వుంది. అందుకు గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు నేనిందులో సూచించిన కార్యక్రమాలను నిజాయితీతో అమలు జరపవలసి వుంది.

ఆర్థిక, అధికార రంగాలలో కూడ బడుగు వర్గాల యువకులు తమ దీన దళితత్వాన్ని విదల్చుకొని తదితర అగ్రవర్గాల నిపుణులతోనూ, మేధావులతోనూ పోటీపడగల ఉన్నత స్థాయికి ఎదగవలసి వుంది. అందుకు రోజుకు 18 గంటలు చొప్పున ఏకదీక్షతో కృషి చేసిన అంబేడ్కరును ఆదర్శంగా ఎదుట నిలుపుకోవలసి వుంది.

శాంతి, సహజీవనం నా ధ్యేయం
మనిషికి మనిషి దాస్యం చెయ్యడం హేయం,

ముద్దకోసం ముద్దు బిడ్డను అమ్ముకోకు
అన్నం లేకపోయినా అక్షరాభ్యాసం మానకు.
నేను నిరసించేది దైవాన్ని కాదు, మతాన్ని
మతం నీతులు చెబుతుంది, దైవాన్ని చూపదు.

## రిజర్వేషనులు-పందెపు గుర్రాలు

"Equality means equality under equal circumstances". In order to provide real equality, the oppressed communities must be brought to the level of other communities, and for this reservations are necessary."

రిజర్వేషనులు ఎందుకు అవసరమో జస్టిస్ పతంజలి శాస్త్రి గారు వెలిబుచ్చిన అభిప్రాయమిది. సమానత్వం అంటే, సమాన పరిస్థితులలో సమానత్వం. పైన మేడమీది వాళ్ళను, క్రింద పెంటమీది వాళ్ళను ఎక్కడి వాళ్ళను అక్కడనే వుంచి, అందరూ సమానమే అంటే కుదరదు.

మేడమీది వాళ్ళను క్రిందకైనా దించాలి. క్రింది పెంటమీది వాళ్ళను మేడ మీదికైనా చేర్చాలి: లేక వాళ్ళనూ వీళ్ళనూ ఆ మధ్యలో ఒక సమప్రాంతంలోనైనా నిలపాలి. మొత్తం మీద పైవాళ్ళకూ క్రింది వాళ్ళకూ కలిపి ఒకే సమానస్థితి గతులను సమకూర్చకుండా సమానత్వం ఏర్పడదు.

శతాబ్దాలుగా అవిద్య, అవిజ్ఞానం, చీకటి, మురికి, దారిద్ర్యం, దాస్యం కూపాలలో కుళ్ళిచచ్చేలా చేయబడిన అస్పృశ్య దళిత కులాలను అగ్రకులాల స్థాయికి తేవాలంటే 35 సంవత్సరాలే కాదు, 300 సంవత్సరాలు పట్టినా మనం ఆశ్చర్య పడ నక్కరలేదు. మన సాంఘిక ప్రగతి అంత మందకొడిగా వుంది.

అందుకే నేనంటున్నాను దళిత కులాలకు సాంఘిక న్యాయం లభించే వరకు దళితులకు (అస్పృశ్యులకు) రిజర్వేషనులు తప్పవని.

ఇక్కడ నేనొక ఉదాహరణను పేర్కొంటున్నాను. గుర్రప్పందాలను గురించి తెలిసిన వాళ్ళకు ఇది బాగా అర్థం అవుతుంది.

హిందూ సమాజంలో పంచవర్ణాలున్నట్టే, గుర్రప్పందాలలో పాల్గొనే గుర్రాలలో ఐదు తరగతులున్నై. ఏ తరగతి పందెంలో అయినా ఆ తరగతి గుర్రాలే పాల్గొంటాయి.

ఒక రేసులో పది గుర్రాలు పాల్గొంటున్నాయనుకొందాం. ఆ పది గుర్రాల లోనూ కొన్ని గుర్రాలు శక్తివంతమైనవిగా వుంటై. మరికొన్ని శక్తిహీనంగా వుంటై. అధిక శక్తి కలవాటికి, శక్తి లోపించిన వాటికి కూడ పందెంలో గెలిచే అవకాశం సమానంగా కల్పించడానికి కొన్ని ([illegible]) ఏర్పాట్లు చెయ్యబడతై.

ఆ పది గుర్రాల శక్తి సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకొని అన్నిటికంటె శక్తిగల గుర్రాల మీద **60** కిలోల బరువు వేస్తే, అన్నిటి కంటె తక్కువ శక్తిగల గుర్రం మీద **40** కిలోల బరువు మాత్రమే వెయ్యబడుతుంది. శక్తిగల గుర్రం **60** కిలోల బరువుతో పరుగెడితే, శక్తి తక్కువ గుర్రం **40** కిలోల బరువుతో పరుగెడుతుంది. ఆ విధంగా ఆ పది గుర్రాలకు వాటి వాటికి తగిన బరువులను వేస్తూ వాటన్నిటికీ సమానంగా గెలిచే అవకాశం కల్పిస్తారు.

గుర్రాలకు కల్పించబడుతున్న ఈ సమతా న్యాయానికి మానవులు అర్హులు కారా? దరిద్రులుగా, దళితులుగా అణచి పెట్టబడివున్న వాళ్ళకు రిజర్వేషనులను కల్పించడం వెనకవున్న న్యాయం ఇదే. న్యాయం గురించి, ధర్మం గురించి, దేవుడి గురించి మాట్లాడేవాళ్లు రిజర్వేషనులను వ్యతిరేకించకూడదు. అలా వ్యతిరేకించే వాళ్లు మానవ మాత్రులుగా పరిగణించబడరు.

## పున్నయ్యగారి గురించి

ఈ అంబేడ్కరిజం గ్రంథాన్ని జస్టిస్ కొత్తపల్లి పున్నయ్యగారికి అంకితపి స్తున్నాను. నా గ్రంథాలన్నీ మొత్తం మీద ఎవరికో ఒకరికి అంకితం ఇవ్వబడినట్టివే. స్నేహానికీ, బాంధవ్యానికీ కావ్యాంకితాలు సంకేతాలని నా భావం.

పున్నయ్యగారు శ్రీకాకుళం జిల్లా, సోంపేట తాలూకా, బారువలో **1923** ఆగస్టు **19**న జన్మించారు. తల్లిదండ్రులు మంగమ్మ పాపయ్యగార్లు. **4**వ ఫారం నుంచి విజయనగరంలోని మహారాజావారి కళాశాలలో చదివారాయన.

బారువ పేరు వినగానే మనకు సర్దార్ గౌతు లచ్చన్నగారు జ్ఞాపకం వస్తారు. ఇద్దరు ఆంధ్ర మహాపురుషులకు జన్మస్థలమైన బారువా ఎంతటి గొప్ప పుణ్యస్థలమో ఊహించవచ్చు.

విజయనగరం మహారాజావారి కాలేజీలో పున్నయ్యగారు ఇంటర్ మీం యట్ చదువుతుండగా **1942**లో దేశం మీద క్విట్ ఇండియా ఉద్యమం విరుచు కుపడింది. రక్తంలో జాతీయత పెల్లుబికే భారతీయులంతా అందులో దూకారు.

దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ నిర్వహించిన జాతీయోద్యమంలో అది అంతిమ ఘట్టం. పున్నయ్యగారు చదువుకు స్వస్తి చెప్పి ఆ ఉద్యమంలోకి దూకి అరెస్టై కారాగారం పాలయ్యారు. బళ్లారిలో జైలు జీవితం రుచి చూశారు. ఆ విధంగా ఆయన విద్యార్థి దశలోనే స్వాతంత్ర యోధుడైనారు.

హరిజనుల అవస్థలు ఈనాడే ఇంత ఘోరంగా వున్నప్పుడు, **60** ఏళ్ల క్రితం ఎంత ఘోరాతి ఘోరంగా వుండేవో ఊహిస్తేనే భయంతో నెత్తురు గడ్డ గట్టుకు పోతుంది. అంతటి కాలాంధకారం నుంచి ఉదయించి ఈనాటికి మధ్యాహ్న ప్రభాకరుడిగా భాసించగల్గిన ప్రతిభా వంతుడు పున్నయ్యగారు.

జైలు నుంచి విడుదలై వచ్చిన తర్వాత, విద్యార్థి కాంగ్రెసును నెలకొల్పారాయన. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కార్యవర్గ సభ్యుడై జాతీయ స్వాతంత్ర్యోద్యమాన్ని హరిజన వాడలలోకి నడిపించిన వాడాయన. ఆయన మళ్ళీ చదువుకొనసాగించింది దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతనే.

పున్నయ్యగారిని నేను మొట్టమొదట చూసింది **1945, 46** ప్రాంతంలో విజయవాడలో, వేముల కూర్మయ్యగారింట్లో. ఆయన రాష్ట్ర కాంగ్రెసు కార్యవర్గ సమావేశం కోసం అక్కడకు వచ్చారు. నేను రాష్ట్ర కాంగ్రెసు ఆర్గనైజరుగా జిల్లాలు తిరుగుతూ అక్కడికి వెళ్ళాను. మేమిద్దరం ఒకరి నొకరం పరిచయం చేసుకున్నది అప్పుడే.

సవర్ణ హిందువులతోపాటు హరిజనులకు సమానహక్కులూ, సౌకర్యాలూ కావాలంటూ పున్నయ్యగారు నడిపిన ఉద్యమంలో దేశాన్ని ఆకర్షించిన ముఖ్య సంఘటన **1948**లో పలాసాలో జరిగింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర కాంగ్రెసు ప్రభుత్వంలో కూర్మయ్యగారు హరిజన సంక్షేమ పౌర సంబంధాల శాఖల మంత్రిగా వున్న రోజులవి. కూర్మయ్యగారి సన్నిహిత మిత్రుడుగా నేను ఆయన సమీపంలోనే ఉంటూ వుండే వాడిని. కూర్మయ్యగారి అధికార నివాసమే కార్యస్థానంగా వ్యవసాయ కూలీ పత్రికను నెలకొల్పి నడుపుతూ వుండేవాడిని. ప్రతి నెల **30**వ తేదీని హరిజన దినోత్సవంగా జరపాలని కూర్మయ్యగారు ఉత్తర్వులు జారీ చేసిన రోజులవి.

సదరు ఉత్తర్వుల క్రింద ఆ రోజులలో **30**వ తేదీన హరిజనోద్ధరణ కార్యక్రమాలు ఎంతో ఉత్సాహంగా జరిగేవి. సవర్ణుల బావుల నుంచి హరిజనులు నీళ్ళు చేదుకోవడం, స్థానికంగా వుండే దేవాలయాలలోకి ప్రవేశించడం, హోటళ్ళలో అంద

రితోపాటు కూర్చొని కాఫీ ఫలహారాలు సేవించడం ఈ మూడూ ప్రధాన కార్యక్రమాలుగా వుండేవి. జాతీయ భావాలు గల యువకులు, పెద్దలు కుల మత భేదాలు లేకుండా ఈ కార్యక్రమాలలో పాల్గొనే వాళ్ళు. జిల్లా కలెక్టర్లు, తాసిల్దార్లు మొదలైన ప్రభుత్వాధికారుల ఆధ్వర్యంలో ఆ ఉత్సవాలు నిర్వహించబడేవి.

ఈ కార్యక్రమాలలో విద్యార్థి కాంగ్రెసు నాయకుడిగా పున్నయ్యగారు పాల్గొంటూ ఉద్యమాలకు ఉద్యమాలనే నడిపించారు. అందులో **1948**లో పలాసా సంఘటన ఒకటి, **1950**లో సోంపేట సంఘటన మరొకటి. ఈ రెండూ కూడ సవర్ణుల బావుల నుంచి హరిజనులు నీళ్లు తోడుకునే హక్కులకు సంబంధించినట్టివే.

**1948** ఉద్యమంలో మంత్రి కూర్మయ్యగారినే అక్కడకు తీసుకువెళ్ళి విజయం సాధించగా, **1950**లో నాలుగు రోజులపాటు నిరాహార దీక్షపూని విజయం సాధించారాయన. ఈ సోంపేట ఉద్యమానికి పత్రికలలో ప్రధానంగా ఆంధ్రప్రభలో విశేషమైన ప్రచారం జరిగింది. అప్పుడు నేను ఆంధ్రప్రభ సంపాదక వర్గంలో వుండడం ఒక యాదృచ్ఛికం.

హరిజనాభ్యుదయం కోసం ఆనాడు నిర్వహించబడిన ఆ కార్యక్రమాలు గాని, ఆ ఉత్సవాలుగాని, ఆ సేవా దీక్షగాని ఈనాడు కనిపించడం లేదంటారు పున్నయ్యగారు. నిజమే. ఎక్కడైనా హరిజనులపై దౌర్జన్యాలు జరిగినప్పుడు ఏదో ఒక మీటింగు పెట్టి మరేదో ఒక నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి విన్నవించుకోవడం తప్పితే ఈనాడు హరిజన సంఘాలుగాని, హరిజన సేవా సంఘాలుగాని చేస్తున్నది ఏదీ లేదు. అఘాయిత్యాలు జరగకుండా నివారించగలిగే కార్యక్రమాలు చేపట్టబడడం లేదు.

ప్రతి గ్రామంలోనూ హరిజనులకూ, హరిజనేతర వర్గాలకూ మధ్య వుండే సంబంధాలను గురించి పరిశీలన జరగాలి. వాళ్ళ వాళ్ళ సమస్యలేమిటో గుర్తించబడాలి. వాటి పరిష్కారానికి వెంట వెంటనే చర్యలు తీసుకోబడాలి. అట్టి కార్యక్రమాలు నిర్వహించబడినప్పుడే అన్యాయాలూ, అఘాయిత్యాలూ అరికట్టబడతాయి. గత జల సేతు బంధనాల వల్ల, చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడంవల్ల ప్రయోజనం వుండదు. ఈ సత్యాన్ని ఈనాటి దళిత సంఘాల వాళ్ళు గుర్తించడం లేదు. పున్నయ్యగారు గాని, నాలాంటి వాళ్లుగాని బాధపడేది ఈ దుస్థితి పట్లనే.

# అంబేడ్కరిజం

## 1. భీమం శరణం గచ్ఛామి

*ధర్మం శరణం గచ్ఛామి*
*సంఘం శరణం గచ్ఛామి*
*భీమం శరణం గచ్ఛామి*

దళితులకు, బడుగు వర్గాలకు సంబంధించిన సభలను, సమావేశాలను, తదితర అన్ని కార్యక్రమాలను ఈ త్రిశరణ వందనంతో ప్రారంభించాలి. వక్తలు, గాయకులు మొదలైన వాళ్లు కూడ తమ ప్రసంగాలను, ప్రదర్శనాలను "భీమం శరణం గచ్ఛామి" అంటూనే ప్రారంభించాలి. అంబేడ్కరిజం ఒక శాస్త్రీయ సిద్ధాంతంగా స్థిరపడాలంటే, క్రమబద్ధమైన కార్యప్రణాళిక ద్వారా అంబేడ్కరు లక్ష్యాలను సాధించాలంటే ఇట్టి పద్ధతి చాలా అవసరం.

"ధర్మం" అంటే ప్రకృతి సిద్ధమైన జీవలక్షణం. మామిడి చెట్టుకు మామిడి కాయే కాస్తుంది. పులికి పులిపిల్లే పుడుతుంది. మానవుడికి మానవుడే జన్మిస్తాడు. మానవులంతా ఒక్కటే అనేది ఇక్కడ మనం గుర్తించవలసిన ధర్మం. గుణకర్మలు వేరుకావచ్చు. జీవలక్షణం ఒక్కటే.

"సంఘం" అంటే కొంత మంది మానవులు ఒక చోట చేరి, ఒకే లక్ష్యంతో కలిసి సాగించే ఉమ్మడి బ్రతుకు. ఏక భాష, ఏక సంస్కృతి, ఏక లక్ష్యం, ఏక దేశం ఈ నాలుగూ ఏ సంఘానికైనా మూలస్తంభాలు.

"భీమం" అంటే డాక్టరు భీమారావు అంబేద్కరు. ఏక సంఘంలో, ఏక ధర్మంతో కలిసి బ్రతకపలసిన మానవుడు స్వార్థపరుడై అధికార భోగాల కోసం తోటి మానవులను హింసించే, దోచుకొనే, అణగద్రొక్కే చెడు పనికి పూనుకొన్నప్పుడు, అట్టి అన్యాయ అమానుష అక్రమ చర్యను ప్రతిఘటించి, ధర్మం కోసం పోరాటం జరపవలసిన కర్తవ్యాన్ని బాధితులకు నిరూపించి చూపినవాడు డాక్టరు భీమారావు అంబేద్కరు. మానవజాతి చరిత్రలో అట్టి సామాజిక విప్లవ మార్గంలో, అంత విజయవంతంగా పురోగమనం సాగించిన వాస్తవ మానవతా ప్రవక్త భీమారావు అంబేద్కరు ఒక్కడే. "భీమం శరణం గచ్ఛామి" అనడం అందుకే.

ధర్మం కోసం సంఘంలోని పైశాచికత్వంపై నిరంతరం పోరాటం జరపవలసే వుంది. ధర్మం నిరాటంకంగా వికసించాలి. సంఘం సర్వసమత్వంతో పురోగమించాలి. అందుకు అంబేద్కరు స్వయంగా చెప్పి, చేసి, చూపిన పద్ధతిలో పోరాటం సాగించాలి. అదే అంబేద్కరిజం. మానవాభ్యుదయ పురోగమనంలో అదొక నిరంతర పోరాటం.

## ౨. త్రి నినాదాలు

త్రి శరణాల తర్వాత అంబేద్కరిజానికి ప్రధానమైనట్టివి త్రి నినాదాలు.

చైతన్యవంతులు కండి, సంఘటితులు కండి, సమరం సాగించండి అంటూ అంబేద్కరిచ్చిన నినాదాలను విశ్లేషించి, ఒక కార్య ప్రణాళికను సిద్ధం చేసుకొని, ఆయన ప్రతిపాదించిన లక్ష్యాన్ని సాధించడానికి పూనుకోవలసి వుంది.

చైతన్యవంతులు కండి అంటే ఏమిటి? ఎడ్యుకేట్ అన్నాడు అంబేద్కరు. ఆ మాటకు విద్యావంతులు కండి అనీ, విద్యావంతులుగా చెయ్యండి అనీ కూడా అర్థం. "మీరు విద్యావంతులు కండి, ప్రజలను విద్యావంతులుగా చెయ్యండి." అంటూ మన ముందున్న జనాన్ని ఉద్బోధించాడన్న మాట.

విద్య అంటే ఏదో చదువుకోవడం మాత్రమే కాదు. పాఠ్య గ్రంథాలు చదివి పరీక్షలు పాసవడమూ కాదు. డిగ్రీలు సంపాదించి ఉద్యోగాలు చేసుకోవడం కూడ

కాదు. లోక జ్ఞానం, భాషా జ్ఞానం, సంస్కృతీ జ్ఞానం కలవాళ్లే నిజమైన విద్యావంతులు.

చదువుకొన్న వాళ్లలో మూర్ఖులు, స్వార్థపరులు అధికంగా వుండడమూ, చదువులేని జనంలో ఎక్కువ లోకజ్ఞానం, సాంస్కృతిక చైతన్యం ప్రకటితమవు తుండడమూ ఈనాడు మనం చూస్తూనే వున్నాం. బ్రతకడానికి పనికి వచ్చే అనేక సాధనాలలో చదువు ఒకటి మాత్రమే. మనిషికి ప్రధానమైంది మానవత్వం. అంటే దయా, ధర్మమూ, ఔదార్యమూ, పరోపకారబుద్ధీ.

"అట్టి మానవత్వాన్ని అవమానం పాలు చెయ్యరాదు. ఎవరైనా చేస్తుంటే సహించరాదు" అనే జ్ఞానాన్ని మానవులలో కలిగించవలసివుంది. అందుకే ఎడ్యుకేట్ అని అంబేద్కరు ఇంగ్లీషులో అన్న మాటను నేను తెలుగులో చైతన్యవంతులు కండి అంటున్నాను.

ప్రజలు చైతన్యవంతులయినప్పుడే సంఘటితులౌతారు. పూర్వ యుగాలలో వ్యక్తి బలమే బలం. బలవంతుడే రాజు. ఈనాడు సంఘబలమే బలం. సంఘ బలం కలవాడే రాజ్యాధినేత.

ఒకే బాధలు కలవాళ్లు, ఒకే లక్ష్యం కలవాళ్లు సులభంగా సంఘటితులవు తారు. స్వార్థరహితమూ, శక్తిసంపన్నమూ అయిన నాయకత్వం లభిస్తే, సంఘటితు లైన ప్రజలు సాధించలేని దేమీ వుండదు. అట్టి సంఘటితులు తమ హక్కుల కోసం సమరం సాగిస్తే విజయం లభించి తీరుతుంది.

సమాన ధర్మం కోసం, సాంఘిక న్యాయం కోసం, సమాన హక్కుల కోసం, చివరకు కనీస అవసరాల కోసం కూడ అడుగడుగునా పోరాడవలసిన దుస్థితి దళిత కులాలదీ, బడుగు వర్గాలదీ ఈనాడు.

అట్టి పోరాటాన్ని వాళ్లు తమ ఇరుగుపొరుగులైన సవర్ణకులాల మీదనే జరప వలసి వుంది కూడా. సమస్త సంపదలనూ తానే పోగేసుకొని సుష్టుగా తిని కూర్చున్న మొండి ముష్కర లోభి అన్నపై, సర్వం దోచుకోబడి ఆకలితో అలమటిస్తున్న తమ్ముడు

జరిపే పోరాటం ఇది. చాల సున్నితమైన రాజకీయం. పీడితులైన అట్టి తమ్ముళ్ళంతా సంఘటితులైతే తప్ప అన్న లొంగిరాడు, పోరాటం విజయవంతం కాదు.

ఎన్నో శతాబ్దాలుగా ఈ దళితులూ, దరిద్రులూ, తాడితులూ, పీడితులూ అంతా ఈ సాంఘిక దురన్యాయ దుర్గంధ దాస్య కూపాలలో పడి వున్నారంటే, అందుకు కారణం తమకు దారిచూపే దిక్కులేకనే. తమకు జ్ఞానం కలిగించి, వెలుగు చూపి, సంఘటిత పరిచి, సముద్ధరించే నాయకత్వం లేకనే. అట్టి నాయకత్వాన్ని అంబేద్కరు ఇవ్వగలిగాడు. దళిత జనానికి పునర్జన్మనే ప్రసాదించగలిగాడు. (పునర్జన్మ అంటే గొంగళి పురుగు నుంచి సీతాకోకచిలుక పుట్టడం లాంటిది).

అందుకే చైతన్యవంతులు కండి, సంఘటితులు కండి, మీ హక్కులకై పోరాటం సాగించండి అనే నినాదాలు మూడూ అంబేద్కరిజానికి త్రి నాడుల వంటి వని అంటున్నాను.

## 3. పంచ ముఖ లక్ష్యం

**కులం వద్దు, మతం వద్దు, రాజకీయం వద్దు;**
**మాకు కావలసిం దొక్కటే, బ్రతుకు తెరువు !**
**కడుపు నిండిన తర్వాతనే ఏ కమ్మని కథలైనా,**
**నిశ్చింతగా కూర్చున్నప్పుడే నీతి బోధ లెన్నైనా.**

అంబేద్కరు తన జీవిత సర్వస్వాన్నీ, తన బుద్ధి జ్ఞాన వైరాగ్యాలన్నిటినీ ఏ లక్ష్యసాధనకోసం వినియోగించాడో, ఆ లక్ష్యసాధనకు అవలంబించ వలసిన విధానమే అంబేద్కరిజం.

అంబేద్కరిజాన్నే అంబేద్కరీయమని అనవచ్చు. అంబేద్కరత్వమనీ, అంబేద్కర తత్వమనీ కూడ అనవచ్చు. ఈ పదాలన్నిటికీ మొత్తం మీద అర్థం ఒక్కటే. అంబేద్కర మతం అనకూడదు. మతం మూర్ఖత్వానికి పర్యాయపదం.

అంబేద్కరు లక్ష్యం ఏమిటి?

అంబేద్కరు ప్రధానలక్ష్యం హైందవసమాజం నుంచి అంటరానితనాన్ని

తొలగించడం. ఆయన ఏ పని చేసినా అందుకోసమే.

ఆయన అంటరాని కులంలో పుట్టాడు. అంటరాని తనంలో పెరిగాడు. సమాజంలోనూ, పాఠశాలలోనూ, ఉద్యోగిగాను, అడ్వకేటుగాను, మంచినీటి చెరువు దగ్గర, దేవాలయం చుట్టు ప్రక్కల, ప్రయాణం చేసే బండ్లలో, కడకు స్నేహితుల ఇండ్లలో కూడ ఆయన అంటరాని వాడుగానే చూడబడ్డాడు, అవమానించబడ్డాడు, అవస్థలుపడ్డాడు.

అప్పుడే, ఎంత త్యాగమైనా చేసి అంటరానితనాన్ని నిర్మూలించాలి అనే పట్టుదల ఆయన కేర్పడింది. అదే జీవిత లక్ష్యమైంది. దాన్ని సాధించడానికి ఏకాగ్రతతో ఆనాడే ఆయన కృషి ప్రారంభించాడు.

ఏది మాట్లాడినా. ఏ రచనలు సాగించినా, ఏ సభలో ప్రసంగించినా, ఏ ఉద్యమాలు నడిపినా, ఏ సత్యాగ్రహాలు చేసినా, ఏ పోరాటాలకు నడుంకట్టినా, చివరకు మతం మారినా ఆయన లక్ష్యం ఒక్కటే, హైందవ సమాజం నుంచి అస్పృఃశ్యతను రూపుమాపడం.

అంబేడ్కరిజాన్ని మనం ఈ ప్రధాన లక్ష్యం కేంద్రంగా దాని చుట్టూ నిర్మించుకోవలసి ఉంది.

అయితే, అంబేడ్కరిజం లక్ష్యం అస్పృశ్యతా నిర్మూలనం మాత్రమే కాదు ఒక దురాచారాన్ని తొలగించే సంస్కరణోద్యమం మాత్రమే కాదు. ఒక నిజానికి ఆ ఒక్క అంశమూ చాలదు. అంబేడ్కరు కేవలం ఒక సంస్కరణోద్యమ కర్త మాత్రమే కాదు. అంతకుమించిన ఉన్నతాశయుడు, బహువిధ కార్యసాధకుడు, సర్వతోముఖ వికాసభాస్కరుడాయన.

ఆధునిక యుగంలో అనాధులకు ఒక ఆశారేఖగా అవతరించిన కరుణామయుడు, నిస్సహాయుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన అసహాయ శూరుడు ఆయన.

అంబేద్కరు చేపట్టిన మరొక లక్ష్యం హిందూ సమాజం నుంచి కుల

వ్యవస్థను నిర్మూలించడం. అందుకు ఆయన ఒక గ్రంథాన్నే వ్రాశాడు. అనేక సూచనలు చేశాడు. కులాంతర వివాహం ద్వారా కుల నిర్మూలనను స్వయంగా ఆచరించి చూపాడు.

అస్పృశ్యత నిర్మూలించబడడంతో, కుల వ్యవస్థ రద్దు చేయబడడంతో అంబేద్కరిజం ఆగిపోదు. అంబేద్కరు సూక్తులను, సుభాషితాలను, ఉద్బోధలను, ఉద్ఘాటనలను, హెచ్చరికలను, సవాళ్లను, బెదరింపులను, తిరస్కారాలను, వాస్తవ ముష్టా ముష్టి పోరాటాలను మనం నిశితంగా పరిశీలించి చూస్తే ఆయన లక్ష్యం మరింత విశాలమైందీ, దీర్ఘకాలికమైందీగా కనిపిస్తుంది. అది సమ సమాజ స్థాపనంగానూ, సర్వజన శ్రేయస్సాధనంగానూ, సమగ్ర భారత జాతీయతా సమైశ్వర్యంగానూ మన ఎదుట సాక్షాత్కరిస్తుంది.

అస్పృశ్యతా నివారణ, కులవ్యవస్థా నిర్మూలన, సమసమాజ స్థాపన, సర్వజన శ్రేయస్సాధన, సమైక్య, సంబుద్ధ భారత జాత్యవతరణ ఈ పంచలక్ష్య సమగ్ర స్వరూపమే అంబేద్కరిజం. నేను అంబేద్కరిజాన్ని దర్శించిన తీరు ఇది. అంబేద్కర దర్శనం ఇది. అంబేద్కర దర్శనం ఇది.

అంబేద్కరీయుడైన వాడు ఈ పవిత్ర లక్ష్యాలను కార్యరూపంలో సాధించడం కోసం ఏ కార్యక్రమాన్ని అనుసరించినా, ఏ ఉద్యమాలు నడిపినా అంబేద్కరీయ దృక్పథంతోనే చేయవలసి వుంది. అప్పుడే ఈ యుగంలో ఉద్భవించిన ఒక సాంఘిక విప్లవ ప్రవక్త యొక్క లక్ష్యసిద్ధికి ఏకాగ్రతతో, బుద్ధదీక్షతో, త్యాగపారమితితో కృషి చేసి నట్లవుతుంది.

అంబేద్కరిజాన్ని మనం పూర్తిగా అవగాహన చేసుకొన్న తర్వాత అంబేద్కరు ఉపన్యాసాల నుంచీ, రచనల నుంచీ విధి నిషేధ రూపమైన నియమ నిబంధనలను క్రోడీకరించుకోవలసి వుంది. వాటిని అమలుపరచడం కోసం ఆయన చేసిన పనులను, నిర్వహించిన కార్యక్రమాలను, నడిపించిన ఉద్యమాలను మార్గదర్శకాలుగా తీసుకోవలసి వుంది.

ఆ విధంగా ఆదర్శాన్నీ, సిద్ధాంతాన్నీ, కార్యక్రమాల్నీ శాస్త్రీయపద్ధతిలో రూపొందించుకొని రంగంలోకి దూకినప్పుడే ఒక క్రమబద్ధమైన ఉద్యమం ముందుకు నడిచి విజయాలు చేకూర్చి పెడుతుంది.

కార్యక్రమ పద్ధతులు దేశకాల పరిస్థితులకు అనుగుణమై వుండాలి. దళితులకు సంబంధించి వివాదాలూ, ఘర్షణలూ ఏర్పడినప్పుడు (1) అందులో అధిక భాగం ఉభయులకూ నచ్చజెప్పడంతో పరిష్కారమవుతై. (2) కొన్ని చోట్ల బల ప్రదర్శన అవసరమవుతుంది. (3) మొదటి రెండూ విఫలమైనప్పుడు పోరాటమే జరుగవలసి వుంటుంది.

విజ్ఞతగల నాయకత్వంలో సాధారణంగా ఈ మూడో పరిస్థితి ఏర్పడదు. సవర్ణులందరూ అన్యాయాన్ని అవలంబించే వాళ్లే కాదు. న్యాయానికి కట్టుబడే వాళ్లు అన్ని కులాలలోను వుంటారు. మంచి వాళ్లెవరో, చెడ్డ వాళ్లెవరో గుర్తించి కులాతీత స్థాయిలో ప్రయత్నించినప్పుడు ఏ సమస్య అయినా శాంతియుతంగానే పరిష్కారమవుద్ది. ఎక్కడైనా, ఏ సందర్భంలోనైనా, ఏ కులం వాళ్లైనా మూర్ఖంగా వ్యవహరిస్తున్నప్పుడు, బలప్రదర్శన తప్పదు. అందుకు అంబేడ్కరీయులు సర్వ సమర్థులై, బల ప్రదర్శనకు సిద్ధపడవలసి ఉంది.

అంటరానితనానికీ, కులవ్యవస్థకూ మూలకారణాలేమిటో పరిశోధనలు చేసి చారిత్రకంగా అంబేడ్కరు స్పష్టపరిచి వున్నాడు. సాహిత్యపరంగా వేదపురాణాలను శోధించి నేను చెప్పి వున్నాను. ఎవరు ఏది చెప్పినప్పటికీ, స్పృశ్యులైనా అస్పృశ్యులైనా జాతి పరంగా అందరూ ఒకే రక్తసంబంధీకులనడంలో విభేదాలు లేవు.

అయితే, అందరమూ ఒక్కటే అనే జ్ఞానం అటు సవర్ణకులాలలోనూ లేదు, ఇటు దళిత కులాలలోనూ లేదు. ఉభయులూ వేరు వేరు అనే కృత్రిమ భావం తరతరాలుగా ప్రచారం చేయబడుతూ వచ్చింది. అట్టి అపోహను ఇప్పుడు మనం తొలగించ వలసి వుంది. అందరమూ ఒకే జాతి వాళ్లమనే జ్ఞానాన్ని కలిగించవలసి ఉంది. అప్పుడే అందరిలోనూ హృదయ పరివర్తన కలిగి, వాస్తవ దృష్టి ఏర్పడి, కులరహిత భారతజాతి ఏర్పడుతుంది.

# 4. మూడు రకాల ప్రవక్తలు

మానవ చరిత్రలో ఎందరో మహనీయులు ఉద్భవించారు. మానవ జీవిత ప్రగతి మార్గంలో ఒక్కొక్క మహనీయుడు ఒక్కొక్క మలుపుకు మూల పురుషుడుగా నిలబడ్డాడు.

అట్టి మూల పురుషులలో, చరిత్ర కందినంత గతంలోకి దృష్టిని సారించి చూచినప్పుడు ధర్మవ్యాధుడు, వాల్మీకి, వేదవ్యాసుడు, చార్వాకుడు, మహావీరుడు, గౌతమబుద్ధుడు, శంకరుడు, రామానుజుడు, ఏసుక్రీస్తు, మహమ్మదు, నానక్, కారల్ మార్క్స్, రామమోహనరాయ్, బ్రహ్మంగారు, వేమనయోగి, వివేకానందుడు, దయానంద సరస్వతి, గాంధి, అంబేద్కరు వంటి వారెందరో చరిత్ర నిండా సూర్య చంద్ర తారా సదృశులై ప్రకాశిస్తూ కనిపిస్తారు.

ఈ పెద్ద చిన్న మార్గ దర్శకులలో అంబేద్కరు ఒక మానవతా సూర్యుడు. అఖండ విప్లవ జ్యోతి.

నా దృష్టిలో ఈ మహాప్రవక్త లంతా ఒక ఎత్తు, అంబేద్కరు ఒక్కడూ ఒక ఎత్తు. ఎందరో విఫలమైన చోట తానొక్కడే సఫలీకృతుడైన మహాసత్త్వుడాయన.

తక్కిన ప్రవక్తలందరూ మొత్తం మీద అగ్రకులాలకు చెందిన వాళ్లే. అంటరాని కులానికి చెందిన వాడు అంబేద్కరొక్కడే.

అగ్ర కులాలకు చెందిన ప్రవక్తలు, వాళ్లెంత విశాల హృదయులు, దయా సముద్రులు, పరమ భాగవతులు అయినప్పటికీ, దళిత కులాల వాళ్ళ కష్టాలు తమ స్వానుభవంలో లేనివి కనుక, అస్పృశ్యతా నివారణకుగాని, దళిత జనోద్ధరణకు గాని, ఒక ఉద్యమస్థాయిలో వాళ్లు పూనుకోలేదు.

పాప పుణ్యాలు, స్వర్గ నరకాలు మొదలైన ఆధ్యాత్మిక విషయాల వైపుకే ప్రజల దృష్టిని మరల్చి; దైవభీతి ద్వారా మానవ ప్రవర్తనను కంట్రోలు చెయ్యడానికి చూశారు వాళ్ళంతా. మరణానంతర జీవితం మీదనే దృష్టిని ఎక్కువగా కేంద్రీకరించడం వల్ల వాళ్ళంతా మత ప్రవక్తలైనారు. వాళ్లు ప్రతిపాదించిన మార్గాలన్నీ మతాలైనాయి.

నీతులనూ, దైవభీతినీ, ఊహా మాత్రమైన యమగోలనూ ప్రక్కకు పెట్టి, సమాజంలో అట్టడుగున పడివున్న బడుగు వర్గాల బ్రతుకుల్ని మెరుగుపరచడం ప్రధాన కర్తవ్యమనే ఆలోచన చేసిన మొదటి ప్రవక్త కారల్ మార్క్స్.

మానవ సంస్కర్తల ఆలోచనా సరళిలోనే ఒక విప్లవాన్ని తెచ్చిన వాడు మార్క్స్. ఆర్థిక ప్రతిపత్తికి ప్రాధాన్యం ఇచ్చినవాడూ. కార్మికులు సంఘటితులై, కార్మిక ప్రభుత్వం ఏర్పడితేనే తప్ప ఆర్థిక సమానత్వం రాదని నమ్మిన వాడూ ఆయన. అందుకే ఆయనను రాజకీయ ప్రవక్త అంటున్నాను.

ప్రవక్తలలో ఏకైక సాంఘిక ప్రవక్త అంబేద్కరు.

ప్రవక్తలను ఆ విధంగా మూడు తరహాలుగా విభజించాను నేను : మత ప్రవక్తలు, రాజకీయ ప్రవక్తలు, సాంఘిక ప్రవక్తలు అని.

మత ప్రవక్తలు చాల మందే వున్నారు. భగవంతుణ్ని గురించీ, మరణానంతర జీవితం గురించీ తమ తమ ఊహలే పరమ సత్యాలని నమ్మి, వాటిని ప్రజలంతా నమ్మాలని వత్తిడి చేసి, తమ తమ పరిధులలో నాయకత్వం సంపాదించుకోగలిగిన అద్భుత చారిష్మా వ్యక్తులు సదరు మత ప్రవక్తలంతా.

ఎవరి విశ్వాసం వారి దైవం అనేది వ్యక్తిగతంగా వుండవలసి నట్టిది. ఒకరి విశ్వాసాన్ని మరొకరిపై బలవంతంగా రుద్దడానికి ప్రయత్నం జరిగినప్పుడే మత విద్వేషాలూ, మత యుద్ధాలూ పెచ్చరిల్లే ప్రమాదం ఏర్పడుతుంది. వ్యక్తిగత విశ్వాసాలు పరస్పర సంఘర్షణలకు దిగడం ద్వారా ఏర్పడినట్టివే చరిత్రలో జరిగిన మత యుద్ధాలన్నీ.

మత ఘర్షణలు, మత యుద్ధాలు అన్నీ దేవుడి పేరు మీద జరిగేవేకాని, వాటితో దేవుడికి మాత్రం ఎట్టి ప్రమేయమూ వుండదనే సత్యా న్ని మనం గుర్తించ వలసి వుంది.

మతాలు మానవ సమాజాన్ని ముక్కచెక్కలు చేశాయి. రెండు మతాల వాళ్లు కలిసి బ్రతకాలంటే, వాళ్ళ బలాబలాలను బట్టి ఒక మతం వాళ్లు మరొక మతం వాళ్ళకు లోబడి బ్రతక వలసి వస్తున్నది. అంతటి దుస్థితికి మానవ జాతిని దిగద్రోశాయి మతాలు.

"దేవుడొక్కడే జగత్ పిత" అంటూ అన్ని మతాలూ బోధిస్తే. కాని, తా నూహించిన దేవుడే నిజమైన దేవుడంటూ ప్రతి మతమూ బల్ల గ్రుద్దుతుంది, కాదన్న వాడి రొమ్ము గ్రుద్దుతుంది వాస్తవంగా.

ఒక్కొక్క మతం ఒక్కొక రంగు సీసా. అన్ని సీసాలలోదీ ఒకే మధురసం : పైకి కనిపించే రంగుల తేడాలన్నీ సీసాలవే. వాటిలోని మధురసానివి కాదు. ఇంత స్పష్టమైన వాస్తవాన్ని కూడ ఏ మతమూ గుర్తించదు. ఎందుకు గుర్తించదు? స్వార్థం వల్ల.

దేవుడి పేరుతో తమ తమ సాంఘిక ఆర్థిక రాజకీయ పెత్తందారీతనాన్ని చెలాయించుకొంటున్న సామూహిక స్వార్థమే ప్రతిమతమూ.

## 5. సమతా మార్గదర్శి మార్క్సు

*కుక్కంటే దొరగారి ఆల్సేషియన్ కుక్కేనా?*
*ఊర కుక్క కూడా కుక్కేరా, బ్రదర్!*
*కట్టేసి పెంచితే ఇది కూడా కుర్చీ లెక్క గలదు,*
*రాజసాలు చూపగలదు, రాజ్యాలు పాలించగలదు.*

మానవ సమాజాన్ని రెండు వర్గాలుగా విభజించాడు మార్క్సు, ధనిక వర్గం, కార్మిక వర్గం అంటూ.

ధనిక వర్గానికి భోగభాగ్యాలు, సౌకర్యాలు, పదవులూ, పెత్తనాలూ, అహంకారాలూ, అధికారాలూ అన్నీ సంపాదించి పెట్టేది కార్మిక వర్గమే. సంపద అనే దానిని సృష్టించేదే కార్మిక వర్గం. ధనికుల్ని అందలా లెక్కించి, తాము మోస్తున్నట్టిది కార్మిక వర్గం.

అందుకే, అందలా లెక్కే ఉన్నత స్థితి కార్మికులకు అందకుండా జాగ్రత్త పడుతున్నారు ధనికులు. "అందరూ అందలా లెక్కితే మోసే వాళ్లెవరు" అనేది వాళ్ళనీతి. కాగా కార్మికులను, బడుగు వర్గాలను అంతంత మాత్రంగా అర్ధాకలితో బ్రతక నిస్తారే తప్ప, తమతో సమాన స్థితికి రానివ్వరు.

అధికారం ధనవంతుల చేతిలో వున్నంతకాలం ఈ దుస్థితి తొలగదంటాడు మార్క్సు. సర్వ మానవ సమానత్వం ఏర్పడాలంటే, మానవులందరూ సమానంగా సుఖపడాలంటే, అధికారం కార్మికుల చేతులలోకి రావాలంటాడు. ధనికులు తమంతట తాము అధికారాన్ని వదులుకోరు కనుక, కార్మికులు బలవంతంగా దానిని చేజిక్కించుకోవలసి వున్నది కనుక, కార్మికుల తిరుగుబాటు జరగక తప్పదంటాడు.

మార్క్సు చెప్పిన ఈ సిద్ధాంతాన్నే మార్క్సిజం అన్నాం. రాజ్యాధికారం కార్మిక వర్గం చేతుల్లోకి రావడం దాని ప్రధాన లక్ష్యం. అందుకు ఏ పద్ధతుల నైనా అవలంబించవచ్చు. లక్ష్యం మీద మాత్రమే దృష్టి. అదే మార్క్సిష్టు దృక్పథం.

ఇతర దేశాలలోని సామాజిక వ్యవస్థలలో ధనిక కార్మిక వర్గాలు రెండే వుంటై. సంపద మీద పెత్తనం వున్నవాళ్ళంతా ధనికులు. సంపదను సృష్టించడం కోసం శ్రమ పడే కార్మికులూ, చేతి వృత్తుల వాళ్లూ, రైతులూ, కూలీలు, కళాకారులూ, తదితర పేదలూ, అంతా కార్మికవర్గం. సంపదను సృష్టించే వాళ్లు సంపదపై పెత్తనం కోరడం న్యాయమే. తమ సంపదను దోచుకుంటూ, తమను శాశ్వతంగా పేదరికంలో వుంచుతూ, తమపై పెత్తనం చెలాయించే సోమరిపోతు వర్గాన్ని కార్మిక వర్గం ఎందుకు సహించాలి?

అందుకే కార్మిక వర్గం చైతన్యవంతమై, సంఘటితమై సమరం సాగించిన ప్రతి దేశంలోనూ విజయం సాధించగలిగింది.

పరిస్థితిని గుర్తించిన మిగతా దేశాలలోని ధనిక వర్గం కూడా కొంత వరకు బుద్ధి తెచ్చుకొని, చాల వరకు దిగివచ్చి, కార్మిక వర్గం హక్కులను గుర్తించి, సర్వజన సమానత్వానికి బాటలు వెయ్యడం జరిగింది. ఇంకా జరుగుతూ వుంది. అట్టి మార్పు ఆయా దేశాలలో జరగడానికి కారణం అక్కడ ధనిక కార్మిక భేదం తప్ప మానవుల మధ్య మరే విధమైన ఇతర భేదమూ లేకపోవడం.

అక్కడ దరిద్రుడు ధనికుడు కావచ్చు, కార్మికుడు యజమాని కావచ్చు. భారత దేశంలో అలాకాదు. ఇతర దేశాలలోని సాంఘిక వ్యవస్థకంటే, భారత్‌లోని సాంఘిక వ్యవస్థ చాల భిన్నమైనట్టిదీ, అమానుషమైనట్టిదీ, క్రూరమైనట్టిదీ.

అందుకే ఈ దేశానికీ మార్క్సు పనికి రాలేదు, అంబేద్కరు అవసరమైనాడు.

## 6. శ్రేయోమూర్తి అంబేడ్కరు

**సింహాలూ నక్కలూ రాజ్యమేలే సమాజంలో**
**మీరు క్షేమంగా బ్రతక దలుస్తున్నారా?**
**అయితే ఓ ఎద్దుల్లారా, మొద్దుల్లారా,**
**పంచతంత్రం చదువుకోండి!**

తనకు తెలిసిన అన్ని దేశాలలో వలెనే, భారతదేశంలో కూడ ధనికులూ పేదలూ అనే రెండు వర్గాలు మాత్రమే వుంటాయని మార్క్సు భావించి వుండవచ్చు. ఈ దేశంలో వర్గవ్యవస్థ లేదనీ, వర్ణ(కుల) వ్యవస్థ మాత్రమే వున్నదనీ మార్క్సుకి తెలిసి వుండదు.

ఇక్కడ ఈ దేశంలో వర్గాలు లేవు. వర్ణాలు (కులాలు) మాత్రమే వున్నై. వర్గ పోరాటాలు లేవు. కుల కలహాలు మాత్రమే వున్నై. ఇక్కడ కార్మికులంతా ఒక వర్గం కాదు. ఒక కులం కార్మికుణ్ని మరొక కులం కార్మికుడు ద్వేషిస్తూ పనిచేస్తాడు. ఏ కులం కార్మికులు ఆ కులం నాయకులనే బలపరుస్తారు.

ఇక్కడ ధనవంతులు కూడ అందరూ ఒక వర్గం కాదు. ఒక కులం ధనికుణ్ని రూపుమాపడానికి మరో కులం ధనికుడు కుట్రపన్నుతూనే వుంటాడు.

ఇక ఈ దేశాన్ని ఉద్ధరించే దెవరు? ఈ అమానుష కుల క్రూర వ్యవస్థను వినాశం చెయ్యడానికి ఏ భగవంతుడు అవతరించవలసి వుంది?

దుష్టుల్ని వినాశం చెయ్యడానికి, శిష్టుల్ని రక్షించడానికి యుగే యుగే అవతరిస్తూ వుంటానని హైందవ భగవంతుడు చెప్పాడు. అలా కొన్ని అవతారాలు వచ్చాయని కూడ ఆ భగవద్భక్తులు చెబుతున్నారు. అయితే, ఆ భగవదవతారాలు చేసిన నిర్వాకం మాత్రం ఏమీ లేదు.

ఎవడో ఒక బలవంతుడైన శత్రురాజును దుష్టుడనే పేరు పెట్టి చంపివెయ్యడం తప్ప, ఏ అవతారమూర్తి మాత్రం సమాజాన్ని సంస్కరించిందేముంది? రఘురాముడు లాంటి వాడైతే, తపస్సు చేసుకుంటున్న శూద్రుణ్నే చంపిపోయాడు కదా! ఇక దళితుల్ని ఉద్ధరించిన దేవుడెవడు?

ప్రపంచ కార్మికుల్ని, ప్రపంచ దరిద్రుల్ని ఉద్ధరించే మార్గం చూపిన వాడు మార్క్సు. భారతదేశ దళితుల్ని, బడుగు కులాలను, కుల సర్ప దష్టుల్ని కాపాడే కరుణాళువుగా పుట్టుకొచ్చినవాడు అంబేద్కరు.

అస్పృశ్యతా నివారణ ద్వారా, కుల నిర్మూలన ద్వారా, హైందవ సమాజాన్ని సంస్కరించి భారత జాతికి ఉత్తేజం కలిగించడానికి అంబేద్కరు అవతరించవలసి వచ్చింది. తన లక్ష్యసాధనకు ఆయన మన కిచ్చిన సిద్ధాంతమే అంబేద్కరిజం. దానిని అమలు జరిపే విధానమే అంబేద్కరీయ దృక్పథం.

అంటరానితనపు కరుకు కోరల మధ్య విలవిలలాడుతూ పెరిగిన అంబేద్కరు దాని కోరలను పెరికి వేసి, దాని మత్తులో కాట్ల కుక్కగా మారిపోయిన హిందూ సమాజాన్ని సంస్కరించి, సముద్ధరించాలనే నిశ్చయాలనికి వచ్చాడు. అందుకు అడ్డం వచ్చిన స్వార్థ కుల మత పండితులతోనూ, రాజకీయ పార్టీలతోనూ, చివరకు బ్రిటిషు ప్రభుత్వంతో కూడ పోరాటాలు జరిపాడు.

అంబేద్కరు హిందూమతంలో పుట్టాడు. అంటరాని తనమూ, కుల వ్యవస్థా ఒక్క హిందూ మతంలోనే వున్నట్టివి. ప్రపంచంలో ఎక్కడా లేనివి ఇక్కడ మాత్రమే ఎందుకున్నై? పోనీ, హిందూమతం అంత అనాగరిక మతమా అంటే, అదీ కాదు. మొత్తం లోకానికే ఉత్తమ వేదాంత భిక్ష పెట్టిన అత్యంత గభీరతాత్త్విక మతం ఇది. మరి, సాంఘికంగా ఇంత అధమస్థితిలో ఎందుకుంది?

పరిశోధనలు జరిపాడు అంబేద్కరు.

క్షణక్షణమూ హింసించబడుతూ, అడుగడుగునా అవమానించబడుతూ కూడ, చదువే పరమార్థంగా సమస్త గ్రంథాలూ చదివాడు. నిషేధించబడ్డ సంస్కృతాన్ని ఛేదించుకొని వెళ్లి, సనాతన శాస్త్రాలన్నిటినీ శోధించాడు. ఉద్గ్రంథాలు వ్రాశాడు. ఉపన్యాసాలు చెప్పాడు, ఉద్యమాలు నడిపాడు. ఇదంతా ఎందుకు చేశాడు? తాను పుట్టిన హిందూ మతానికీ, హైందవ సమాజానికీ, భారత దేశానికీ పట్టిన చీడలనూ, పీడలనూ నిర్మూలించి పారెయ్యాలనే కదా!

ఆనాడు (ఈనాటికీ కూడ) అంతటి ఉన్నత విద్యావంతుడు దళితులలో

లేదు కదా! కేవలం అడిగితేనే ఒక ఉన్నతోద్యోగం ప్రభుత్వంలో దొరికేది కదా! అడగకుండా కూడ ప్రభుత్వం పిలిచి ఉద్యోగాలిచ్చిన కాలమది.

దర్జాగా ఒక ఉద్యోగంగో చేరి, సిటిలో ఒక మేడ కట్టుకొని, ఒక కారు కొనుక్కొని, పిల్లల్ని కాన్వెంట్లలో చదివించుకొని, విదేశాలకు పంపించుకొని, అఖిల భారత సర్వీసులలో చేర్పించుకొని సుఖంగా బ్రతికి వుండేవాడు కాదా?

ఈనాడు మన దళిత నాయకులు అధికారులుగా, శాసన సభ్యులుగా, మంత్రులుగా చేస్తున్న పనేమిటి? ఆ మాత్రం కూడ చేతకాకనేనా అంబేద్కరు అన్ని త్యాగాలు చేసి, అన్ని ఇబ్బందులు పడ్డాడు?

ప్రతీ దళిత విద్యావంతుడినీ అంబేద్కరు ధ్యేయమే ధ్యేయంగా, లక్ష్యమే లక్ష్యంగా, మార్గమే మార్గంగా నడిపించవలసి వుంది. అదే అంబేద్కరిజం. అందుకే ఈ అంబేద్కరిజం.

## 7. వేదమతమూ – హిందూ మతమూ

**పేరు తెలియకుండా ఏవంటైనా తినేస్తారు**
**కులం తెలియకుండా ఏ జంటైనా కనేస్తారు**
**అగస్త్యుల్నీ, వశిష్టుల్నీ, విశ్వామిత్రుల్నీ, పరాశరుల్నీ**
**ఆదర్శ రుషులుగా ఆరాధిస్తూ కూడ**
**ఎందుకురా, బ్రదర్, ఇంకా కులం కులం అంటావు?**

భారత దేశంలో భారతీయత అని పిలవబడుతున్న సంస్కృతికి మూలాధారం వేదం. "అనంతాః వేదాః" అన్నారు పూర్వ రుషులు. అంటే, వేదాలకు పరిమితి లేదు, అవి అసంఖ్యాకంగా వున్నై అని.

ఆహారం సులభంగా సమృద్ధిగా లభించిన ఆ కాలంలో అందరూ రుషులే. అన్నీ రుషి వాటికలే. ఆలోచించగల ప్రతివాడూ, ప్రకృతి ధర్మాలను పరిశీలించగల ప్రతి భావుకుడూ ఏవేవో రుక్కుల్ని పలికిన వాళ్లే. జననం, మరణం, అగ్ని, వాయువు, సుఖం, దుఃఖం, ఉదయం, సాయంత్రం, ఎండా, వాన, వెలుగూ, చీకటి మొదలైన

వన్నీ కూడ వాళ్ళతో ఎన్నో రుక్కుల్ని పలికించినై. అవన్నీ అనంతంగా తయారయినై.

ఒకానొక కాలంలో అవన్నీ కలగా పులగమైపోయి, సమయ సందర్భాలు తెలుసుకోలేనంత అయోమయస్థితి ఏర్పడినప్పుడు, వాటి నన్నిటినీ సేకరించి, నాలుగు ప్రధాన భాగాలుగా విభజించి, ఒక క్రమంలో పెట్టినవాడు వేదవ్యాసుడు.

ఎవరీ వేదవ్యాసుడు? మాతంగియైన అరుంధతికి ముని మనమడు, మాలెత అధృశ్యంతికి మనుమడు, బెస్తపిల్ల మత్స్య గంధికి కొడుకు. అదీ అతని జన్మచరిత్ర. అంటే, మాల మాదిగ బెస్త కులం వాడన్న మాట.

బ్రహ్మజ్ఞానం కలవాడు కనుక బ్రాహ్మడన్నారే కాని, ఈనాటి కుల వ్యవస్థను బట్టి చూస్తే ఆనాడు వేదవ్యాసుడు అరుంధతీయుడే, హరిజనుడే.

పైగా అతడు వివాహితులైన దంపతులకు, పుట్టిన వాడు కాదు. ఒక అవివాహిత కన్యకు పుట్టిన కానీనుడు.

ఒక్క వేదవ్యాసుడే కాదు, ఆనాటి వైదిక సమాజంలోని మహర్షులూ, మహావీరులూ, మహా నైతికులూ కూడ మొత్తం మీద అలా పుట్టిన వాళ్లే, అందువల్ల వేదకాలపు సమాజంలో ఈనాడు కనిపించే కులవర్ణ భేదాలు లేవు.

జాతో వ్యాసస్తుకై వర్త్యాః
శ్వ పాక్యాస్తు పరాశరః
బహవో న్యేపి విప్రత్వం
ప్రాప్తాయే పూర్వ మద్విజాః
వేశ్యసుతుడు వసిష్ఠుండు విప్రుడయ్యె c
దపముచే, సంస్కృతియె యందు ధర్మమగును !
జాలరికి వ్యాసుడును, బరాశరుడు మాలె
తకు సుతులు, ద్విజులైరి; లెక్కకిది మించె.

ఇట్లు పూర్వము అద్విజులై, పిమ్మట సంస్కారము ననుసరించి ఎందరో బ్రాహ్మణులైరి. (పూర్వగాధా లహరి - వశిష్ఠుడు).

వేద వ్యాసుడు ఆ విధంగా హరిజనుడైనప్పుడు, ఆయన కొడుకులైన ధృతరాష్ట్రుడూ, పాండురాజూ, ఆయన మనుమలైన పాండవులూ, కౌరవులూ క్షత్రియ లెలా అయ్యారు?

గుణ కర్మల ద్వారా అయ్యారు.

క్షాత్రగుణం ద్వారాను, క్షాత్ర వృత్తి ద్వారాను వాళ్లంతా క్షత్రియులైనారు. ఈ వాస్తవాన్ని వేదవ్యాసుడే భగవద్గీతలోనూ, భారతంలో కుమారుల అస్త్ర విద్యా ప్రదర్శన ఘట్టంలోనూ, వరాహ పురాణంలోనూ, ఇంకా అనేక చోట్ల సమయ సందర్భాలు కుదిరినప్పుడెల్లా స్పష్టం చేస్తూనే వచ్చాడు.

ఇటీవలి స్మృతి కర్తలూ, మతాచార్యులూ, పండితులూ అపార్థాలు కల్పిస్తే, సొంత శ్లోకాలు చేరిస్తే, ఆ దోషం వేదాలదీ కాదు, వేదవ్యాసుడిదీ కాదు.

వేద వేదాంత పురాణ యుగాలు గతించిన తర్వాత, అట్టి గతం నుంచి మళ్లీ ఒక క్రమ బద్ధమైన సమాజం ఏర్పడడానికి చాలా కాలమే పట్టి వుంటుంది. ఈ మధ్యకాలంలో, వేద సంస్కృతిని పునరుద్ధరించే సందర్భంలో, అప్పటి పండితులు ఎవరికి జ్ఞాపకం వున్న వేద రుక్కులను వాళ్లు ఏకరువు పెట్టి, స్మృతులను కల్పించారు.

ఆయా రాజుల అభిమతాలను అనుసరించి, సొంత శ్లోకాలతో సొంత న్యాయాలను సృష్టించి, ఆయా స్మృతులలో చొప్పించడం కూడా జరిగింది. అవే మూల వేదాలుగా ప్రచారంలో పెట్టబడినై.

రాజు కొడుకు రాజు, మంత్రి కొడుకు మంత్రి, పురోహితుడి కొడుకు పురోహితుడు, బ్రాహ్మడి కొడుకు బ్రాహ్మడు, శూద్రుడి కొడుకు శూద్రుడు అనే పుట్టుకులం స్మృతుల కాలం నుంచే వచ్చింది. వేదకాలంలో లేదు.

ఈ వాస్తవాలను మనం గమనించి చూస్తే, మనుస్మృతిలాంటి స్మృతులను కల్పించిన పండితులు మూల వేదాలకు ఎంతటి ద్రోహం చేశారో, భారత జాతి విచ్ఛిత్తికి ఎంతగా దోహదం చేశారో స్పష్టపడుతుంది.

ఇక్కడ మరొక విశేషాన్ని గమనించాలి.

వేద కాలంలో ప్రకృతి శక్తుల పరిశీలనమే తప్ప, దైవ భావన లేదు. దేవుడొక డున్నాడన్న, అతడెక్కడో కూర్చుని లోకాన్ని సృష్టించి పాలిస్తున్నాడన్న భావమే ఆనాడు లేదు. వేదాలలోని వేద రుక్కులన్నీ ప్రకృతి శక్తులను ఆరాధించినట్టివి. ఈనాటి విజ్ఞానం (సైన్సు) తో సరితూగు తున్నట్టివి. కవితతో నిండి వున్నట్టివి. క్రమంగా కాలం గడిచే కొలది అట్టి ప్రకృతి శక్తులకే రూప కల్పన చేయబడి, వివిధ దేవతామూర్తులుగా కీర్తించబడడం జరిగింది. చివరగా ప్రకృతి శక్తులన్నీ ఒకే ఒక మహాశక్తి నుంచి పుడుతున్నవే అనే ఏకేశ్వర భావన ఏర్పడడమూ జరిగింది.

వేద సమాజం వాస్తవ పరిజ్ఞానంతో హేతుబద్ధంగా కొనసాగిన ఒక సోషలిస్టు సమాజం మాత్రమే. అదొక మత సమాజం కాదు.

శంకరాచార్యుడికి పరమ వేదాంత తత్త్వాన్ని బోధించిన చండాలుణ్ని చండాలుడుగా గుర్తించక, శివుడి మారువేషంగా ప్రచారం చేసుకోవలసినంత ఆత్మవంచనకు ఈ అద్వైత వేదాంత జాతి ఎందుకు పాల్పడవలసి వచ్చింది? అలాంటి ఆత్మవంచన, జాతి ద్రోహం వేదకాలంలో జరగలేదే !

వేద మతం వేరు, హిందూ మతం వేరు అంటున్నాను అందుకే.

ఇప్పుడు మన ముంటున్నది హిందూ మతం కనుక, దీనిలో చొరబడిన కాలుష్యాన్ని తొలగించి, పరిశుభ్రపరిచి, పునరుద్ధరించడానికి ఒక అంబేద్కరు లాంటి మహామనీషి అవసరమైనా దని అంటున్నానందుకే.

ఈనాటి అస్పృశ్యత, కులవ్యవస్థ వేదసమ్మతం కావు. వేద విరుద్ధాలు. ఈ రెండు దురాచారాలను హైందవ సమాజం నుంచి నిర్మూలించి పారవెయ్యడమే నిజమైన వేద మార్గం. అంబేద్కరిజంలోని ప్రధాన నిర్దేశం ఇదే.

## 8. ఏక మతం, ఏక జాతి

సవర్ణులూ, హరిజనులూ ప్రక్క ప్రక్కగా
ఒకే వీధిలో నివసించ గల్గి నప్పుడే
ఈ దేశానికి స్వరాజ్యం వచ్చినట్టు,
ఈ జాతికి మానవత్వం అబ్బినట్టు.

తాను హిందువుగా మరణించ నన్నాడు అంబేద్కరు.

అలా ఎందుకన్నాడు ?

అస్పృశ్యత పోవడమో, హిందూ మతం చావడమో జరగక తప్పదన్నాడు గాంధీ.

అలా ఎందు కన్నాడు?

భారతదేశ చరిత్రలో, అత్యంత ప్రధానమైన స్వాతంత్ర్యసమర ఘట్టంలో ప్రధాన నాయకులుగా తేలిన వాళ్లు ఈ ఇద్దరూ. ఇద్దరూ కూడ ఒకే మాట చెప్పారు. అస్పృశ్యత కావాలో, హిందూ మతం కావాలో తేల్చుకోమని భారత జాతిని కోరారు. హిందూ మతం పైన, భారత జాతిపైన ప్రేమ వాత్సల్యాలు కలవాళ్లే ఇద్దరూ.

గాంధీ సవర్ణ హిందువులలో మార్పు తేలేకపోయాడు. హిందూ సమాజం మారలేని ఎండు శవమే అయితే, దానిని పూడ్చిపెట్టి పోతా నన్నాడు అంబేద్కరు. తానన్నట్టే చేశాడు కళ్ళొత్తుకొంటూ.

మనం ఎంతో నిశితంగా పరిశీలించవలసి నట్టిది ఈ ఘట్టం.

హిందూ మతాన్ని, హైందవ సమాజాన్ని, భారత జాతిని సముద్ధరించడానికి పుట్టినవాడు అంబేద్కరు. అంటరానితనమూ, కులవ్యవస్థా నిర్మూలించబడితే తప్ప, అట్టి సముద్ధరణ జరగదు. అందుకే ఆ రెండు పిశాచాల మీద యుద్ధం ప్రకటించాడు.

హైందవ మత శాస్త్ర వేదాంత గ్రంథాలన్నిటినీ పరిశీలించాడు. దేశంలోని అన్ని కులాల వాళ్లు, దళిత కులాలతో సహా ఒకే రక్తసంబంధం గల జాతి అన్నాడు. ప్రధాన జాతి నుంచి విడిపోయిన వాళ్లే తప్ప, అస్పృశ్యులు తదన్యులు కాదన్నాడు. శూద్రులెవరు, అస్పృశ్యులెవరు, కులనిర్మూలన మొదలైన గ్రంథాలు వ్రాసి. తన సిద్ధాంతాన్ని నిరూపించి చూపాడు. ఇంత చేసి కూడా సవర్ణ హిందూ మూర్ఖత్వాన్ని తొలగించలేకపోతే, ఇక ఏ దేవుడైనా ఏం చేయగలడు ?

## 9. స్వరాజ్యం రాగానే

బానిస తనకు తానుగా బ్రతకడు,

యజమాని కోసం బ్రతికించి వుంచ బడతాడు,

**కుక్కలు, కోళ్ళు, గొర్రెలు, గాడిదలు, గుర్రాలు**
**పెరటి తోటలతో పాటు పెంచ బడతాడు !**

**ఎంత కాలంగా బ్రతుకుతున్నా మనేది కాదు ముఖ్యం**
**ఎలా బ్రతుకుతున్నామనేది :**

స్వరాజ్యం రాగానే, తొలి పంచవర్ష ప్రణాళిక అస్పృశ్యతా నివారణకు, కులతత్వ నిర్మూలనకు, బడుగువర్గాల సముద్ధరణకు వుద్దేశించి రూపొందించబడి వుంటే, ఈనాడు దేశాన్ని పట్టి పీడిస్తున్న అనేక సమస్యలు  అసలు తలెత్తి వుండేవి కావు.

హిందూ సమాజం చాల పెద్దది. ప్రపంచజాతులలో అదొక ప్రముఖ జాతి. దానిని పట్టి నెత్తురు పీల్చేస్తున్న చీడపురుగులు అంటరాని తనమూ, కులవ్యవస్థానూ. ఆ రెండింటినీ నిర్మూలించివేస్తే, హైందవ జాతి ఎంతో గొప్ప జాతి అవుద్ది. భారత దేశం అగ్రరాజ్యాలకే అగ్రరాజ్య మవుద్ది.

ఇంత ఆశ పెట్టుకొన్న ఒక నాయకుడు, తాను ఆశించినంత త్వరితగమనంతో అట్టి మార్పు జరగనపుడు, ధీర శాంతుడైనా కోపం రాక మానదు. అంబేద్కరుకు కోపం వచ్చింది.

కులాల లుకలుకలతో పరస్పరం కొట్టుకు చస్తున్న హైందవ సమాజాన్ని దాని కర్మకు దాన్ని వదిలేసి, అంటరాని తనం అనే అధః కూపంలో కట్టు బానిసలుగా పడివున్న జనానికైనా విమోచనం కలిగించాలనుకున్నా డాయన.

తాను పుట్టిన వాళ్లు తన మాట వినడం లేదు. తాను పుట్టిన కులం వాళ్ల నైనా సముద్ధరించలేక పోతే, ఇకతన పుట్టుకకు సార్ధకత ఏమిటి ?

అదీ అంబేద్కరు ఆలోచన.

అందుకే, ముస్లిములు వేరే జాతి అంటూ జిన్నా రెండు జాతుల సిద్ధాంతాన్ని ప్రతిపాదించినప్పుడు, దళితులు కూడా వేరే జాతి అంటూ అంబేద్కరు మూడు జాతుల సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.

ముస్లిములకు అంటరాని తనం లేదు. వాళ్లే వేరే జాతి అయినప్పుడు, అంటరాని తనంతో చస్తూ, హిందూ దేవుళ్లను కూడ దర్శించే హక్కులేని దళితులు హిందువు లెలా అవుతారు ?

ముస్లిములు బల ప్రదర్శన ద్వారా తమ భాగాన్ని తాము పంచుకుపోతున్నప్పుడు, మేము బలహీనులమైనప్పటికీ మా భాగాన్ని మేం ఎలా వదులుకుంటాం?

న్యాయమైన వాదం ఇది. ఎవరూ కాదనటానికి వీలులేని ధర్మ వాదం.

అయితే, హరిజనులు వీడిపోతే హిందూ సమాజం ఏమైపోతుంది? క్రమంగా మైనారిటీగా మారిపోతుంది. ఆ తర్వాత అంతరించి పోతుంది.

పూర్వపు రోజులు కావివి, బానిసలుగా బ్రతికి వుండడానికి.

ఏ దేశంలో అయినా మెజారిటీ విజృంభిస్తే, మైనారిటీకి బ్రతుకుతెరువే వుండదు.

ఈ సత్యాన్ని గుర్తించిన గాంధీ, అంబేద్కరు ప్రతిపాదనకు ఎదురు తిరిగాడు. ముస్లిములు పోతేపోయేరు. హరిజనులు మాత్రం పోవడానికి వీలు లేదన్నాడు. ఈ విషయంలో రాజీయే లేదన్నాడు. చివరకు, చస్తానన్నాడు.

కడకు అంబేద్కరు తన ప్రత్యేక జాతి సిద్ధాంతాన్ని వదులుకోవలసి వచ్చింది.

అంబేద్కరు అలా ఎందు చేశాడు ?

అలా చేశాడు కనుకనే అంబేద్కరు ప్రవక్త అయినాడు. మొత్తం దేశానికే నవ భారత జాతి పిత అయినాడు.

దేశానికి స్వాతంత్ర్యం రాగానే అస్పృశ్యతా నిర్మూలనకు, దళిత కులాల సముద్ధరణకు భారత ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందనీ, కఠిన శాసనాల ద్వారా మొత్తం సమాజ స్వరూపాన్నే మార్చివేస్తుందనీ అంబేద్కరు ఆశించాడు. సవర్ణ హిందూ నాయకుల నుంచి, రాజకీయ ప్రభువుల నుంచి అట్టి వాగ్దానం పొందిన మీదటనే, పూనా ఒడంబడికపై సంతకం చేశాడాయన.

నిజంగానే అలా జరిగి వుంటే, అంబేద్కరు మతం మార్పిడి ప్రతిజ్ఞ అప్పుడేమయ్యేది ? అమలు జరిగేది కాదు. అది ఒక ఉద్రేకంలో చేసిన సవాలుగానే మిగిలిపోయేది.

పూనా ఒడంబడిక అమలు జరగలేదు కనుకనే, సవర్ణ హిందూ నాయకులు మాట తప్పారు కనుకనే, అంబేద్కరు తన ప్రతిజ్ఞను ఒక తుది మహాస్త్రంగా ప్రయోగించవలసి వచ్చింది.

అంబేద్కరు మతం మార్పిడి మతం కోసం కాదు. అన్ని మతాలూ నిద్రమాత్రలే. మానవుణ్ని ఉద్ధరించిన మతం ఏదీ లేదు. ఈ వాస్తవం ఎరిగిన అంబేద్కరు మతం మార్చాడంటే, అది హిందూ మతానికి ఒక షాక్ ట్రీట్ మెంటు ఇవ్వడం కోసమే అనేది సుస్పష్టం.

అందుకే అంబేద్కరిజంలో మత ప్రమేయం వద్దంటున్నాను. ఏ మతానికి, ఏ వర్గానికి చెందిన వాళ్లైనా సరే, అంబేద్కరు లక్ష్య సాధన కోసం పోరాడడానికి సిద్ధమైనావాళ్ళంతా అంబేద్కరీయులే అంటున్నాను.

దెయ్యం పట్టిన వాళ్ళకు వొళ్లు చితక బాదడం ఎలాంటి చికిత్సో, అస్పృశ్యతా పిశాచం పట్టిన వాళ్ళకు మతం మారడం అలాంటి చికిత్సే.

హిందూ సమాజం మైనారిటీగా మారిపోయినా హిందూ కుల వాదులకు బాధలేదు. శతాబ్దాలపాటు పర దేశీయులకు, పర మతీయులకు దాస్యంచేస్తూ బ్రతికిన జాతికి తాము మైనారిటీగా మారిపోతా మేమో నన్న భయమూ, అందువల్ల కలిగే దుఃఖమూ కూడ వుండవు.

అలా భయపడి దుఃఖపడ్డవారు ఒక్క గాంధియే. తన చర్య వల్ల హైందవ జాతికి తీరని నష్టం కలిగించ కూడదన్న విశాల దృష్టితో, తనపట్టుదలను సడలించుకొన్న నిజమైన హైందవోద్ధారకుడు అంబేద్కరు.

హిందూ కులతంత్ర వాదులు ఎంతటి అహంకార మూఢులైనా కావచ్చు, దళిత కులాలపట్ల ఎంతటి అమానుష క్రూరులైనా కావచ్చు. కానీ, తాను మాత్రం తాను పుట్టిన సమాజానికి తీరని అపకారం చేయలేదు. అట్టి ఉదారమైన, ఉదాత్తమైన, దివ్యమైన మహా వ్యక్తిత్వం అంబేద్కరుది. అందుకే ఆయన ఈ దేశంలో పట్టిన, ఈజాతి సంస్కృతి నుంచి వెలసిన బౌద్ధమతాన్ని మాత్రమే స్వీకరించాడు.

అంబేద్కరు బౌద్ధమత స్వీకారం పూర్తిగా అన్యమత స్వీకారం కాదు. అది హిందూ కులోన్మాదానికి ఒక చెంప పెట్టు చికిత్స మాత్రం.

ఒక్క దళిత కులాల వాళ్లే కాక మొత్తం హిందువులంతా, భారతీయులంతా, బౌద్ధులుగా మారవలసిందిగా అంబేద్కరు తాను మతం మారిన సందర్భంలో ఉద్బోధించి వుండడం గమనార్హం.

# 10. అంబేడ్కరు ఆంతర్యం

సత్యం, అహింస, పరోపకారం, స్వార్థ త్యాగం
ప్రతి మత నీతీ ఒక ప్రగతి ప్రణాళికే ;
ప్రణాళికలు లేకనా ప్రజలు చస్తున్నది ?
వాటి అమలును పులులు చేపట్టడం వల్ల !

దళితులకు, సవర్ణ హిందువులకు, భారతీయ ప్రజలకు, బ్రిటీషు ప్రభుత్వానికి కూడ ఎన్నో ప్రబోధాలు, హెచ్చరికలు చేసి వున్నాడు అంబేద్కరు. వాటి గురించి ఎంతో సాహిత్యం వివిధ భాషలలోనూ వెలువడి వుంది. తెలుగులోకి కూడా చాలానే వచ్చింది. ఇక్కడ నేను ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.

ఇప్పుడీ గ్రంధాన్ని అంబేద్కరిజం గురించి వివరించడానికే ఉద్దేశించాను కనుక, అందుకు సంబంధించిన విషయాలను, వాటి అంతర్యాలను కొన్నింటిని మాత్రమే ఇక్కడ పేర్కొంటున్నాను.

1) అంబేద్కరు భయ రహితుడు, భయంకరుడు. సవర్ణ హైందవ కులతత్వ మౌఢ్యంపై నిర్విరామంగా పోరాడినవాడు. మేకల్లా కాకుండా సింహాల్లా బ్రతకం డంటూ దళితులకు బోధించిన వాడు. స్వాతంత్ర్యం అనేది భిక్షమెత్తితే లభించే వస్తువు కాదని, పోరాడి సాధించుకోవలసి నట్టిదని ఉద్బోధించినవాడు.

2) దళితుల విమోచనం వాళ్ళ రాజకీయ శక్తిమీద ఆధారపడి వున్నదన్నాడు అంబేద్కరు. రాజకీయ శక్తికోసం సంఘటితులు కావాలన్నాడు. అందరూ కలిసి కట్టుగా పోరాడాలన్నాడు. అట్టి పోరాటం ధనం కోసమో, పదవుల కోసమో కారా దన్నాడు. సాంఘిక న్యాయం కోసమూ, సమానత్వం కోసమూ పోరాడాలన్నాడు. మనకు కావలసింది పదవి కాదు, అధికారం కావాలన్నాడు. **(Not position but Power)**

3) దళితులు తమ బానిసత్వాన్ని తామే తొలగించుకోవాలి. తమ సంకెళ్ళను తామే విదలించుకోవాలి. ప్రవక్తలనూ, దేవుళ్ళనూ నమ్మవద్దు. మత గ్రంథాలలో దళితుల్ని రక్షించగల దేదీ లేదు. స్వశక్తి మాత్రమే మోక్ష సాధకము.

4) తాను ఏ అంటరాని జాతిలో పుట్టి పెరిగి జీవిస్తున్నాడో, ఆ జాతి సేవలోనే మరణిస్తా నన్నాడు అంబేద్కరు. ప్రతి మానవుడూ ఏదో ఒక రోజున చావవలసిందే నని, మనం బానిసలం కామని, మనం యుద్ధ వీరులమని ఆయన జ్ఞాపకం చేశాడు. అగౌరవంగా బ్రతికే కంటే అవమానకరమైనదేదీ లేదన్నాడు.

5) హిందువులు తనను శత్రువుగా భావిస్తే అది వాళ్ళ దురదృష్టం అన్నాడు. తనను వాళ్లు అపార్థం చేసుకొంటున్నా రన్నాడు. తాను వ్యక్తి కంటే దేశాన్నే అధికంగా ప్రేమిస్తాననీ, ఏ దేశభక్తుడికీ తాను తీసిపోననీ స్పష్టంచేశాడు. అయితే, దేశ ప్రజలలో ఒక ప్రధాన వర్గాన్ని అస్పృశ్యులుగా చేసి అవమానించడాన్ని మాత్రం సహించేది లేదన్నాడు.

ఈ విధంగా ఆయన చెప్పిన దెంతో అనంతంగా వుంది.

ఇక్కడ మనం ఒక్క విషయంలో జాగ్రత్త తీసుకోవాలి.

ఏ మానవుడు ఎంత గొప్పవాడైనా కావచ్చు. ప్రతి మానవుడిలోనూ వెలుగు నీడల వలె గుణదోషాలు రెండూ వుంటై. సమాజంలోని మంచి చెడ్డలకు అనుగుణంగా అతడిలో రాగద్వేషాలు ప్రజ్వరిల్లుతూ వుంటై. ఒక లక్ష్యానికి కట్టుబడిన ప్రజ్ఞాని వాటన్నిటినీ అధిగమించి పైకి తేలగలడు. అలా తేలే వరకు లోక వ్యవహార తరంగ ఘట్టనలను అతను అనుభవిస్తూనే వుంటాడు.

అంబేద్కరు కూడ ఒక మానవుడే. పైగా తక్కిన ప్రవక్తలవలే అగ్రవర్గంలో పుట్టినవాడు కాదు. అట్టడుగున పుట్టి ఎన్నో అవరోధాలను ఎదుర్కొంటూ పైకి వచ్చినవాడు. సంఘ దురాచారాలను నిర్మూలించడానికి కంకణం కట్టుకొన్నవాడు. అటువంటివాడు, ఎంతటి నిగ్రహవంతుడైనా, తన పోరాట మార్గంలో ఆవేశాలకు, ఆవేగాలకు, ఉక్రోషాలకు తాత్కాలికంగా అయినా వశంకాక తప్పదు.

అలాంటి సందర్భాలెన్నో అంబేద్కరు పోరాట మార్గంలో వున్నై. వాటన్నిటినీ గమనించి, జల్లెడ పట్టి, ఏది సిద్ధాంతమో, ఏది ఉద్రేకమో నిర్ణయించి, అంబేద్కరు వ్యక్తిత్వానికి అనుగుణమైనట్టి ప్రబోధాలను మాత్రమే స్వీకరించవలసి వుంది. పరస్పర

విరుద్ధమైన హెచ్చరికలో, ఉద్బోధలో కనిపించినప్పుడు, వాటి నుంచి అంబేద్కరిష్టు దృక్పథంలో ఏకీభవించే వాటిని మాత్రమే ఎంచుకోవాలి. తద్విరుద్ధమైన వాటిని వదిలెయ్యాలి.

## 11. గొప్ప డాక్టరు

**ముద్దుగా వినకపోతే మొట్టి చెప్పాలి,**
**హేతువుకు నిలవకపోతే హేతినే ఝుళిపించాలి ;**
**తామస గుణం తామర గజ్జి లాంటిది**
**ఉడుకు నీళ్లు పోసి ఉద్రేక పరచడం కాదు,**
**మండినా మాన్పగల మందునే వాడాలి.**

అంబేద్కరు ఒక గొప్ప డాక్టరు. సాహిత్య డాక్టరే కాదు, సంస్కరణ డాక్టరు కూడ. అస్పృశ్యత అనబడే కేన్సరుపై కత్తిని, కుల వ్యవస్థ అనబడే కుష్టుకు విష గుళికలనూ ప్రయోగించి, భారత జాతిని వజ్ర శరీరంగా చెయ్యడానికి దీక్ష వహించిన డాక్టరు.

ఏవో గ్రంథాలు వ్రాసో, నీతి బోధలు చేసో వూరు కొన్న వాడు కాడాయన. స్వయంగా కార్య రంగంలో దూకి పోరాడిన వాడు. పోరాటం మధ్యలో సహజంగా ఉప్పతిల్లే దూషణ భూషణ తిరస్కారాలకు ఆయన సైతం అతీతుడు కాదు.

ఈ విధమైన విచక్షణతో అంబేద్కరు ఉద్బోధలనూ, ఉద్యమాలనూ పరిశీలించి నప్పుడు వాటిని రెండు భాగాలుగా విభజించవచ్చు.

(1) నిర్మాణాత్మకమైనవి, ఆచరణ సాధ్యమైనవి. సవర్ణులతో అవర్ణులు కలిసి పోవడానికి సహకరించేవి.

(2) తన లక్ష్య సాధనకు అంబేద్కరు జరిపిన పోరాటమార్గంలో ప్రతీ ఘాత శక్తులపై ఆయన వాడిన ఆయుధాలు, విసిరిన సవాళ్లు, రోష తిరస్కార భాషణలు.

పరిశీలించి చూస్తే ఈ రెండూ ఒక్కటే. సాధువాదంతో న్యాయ జరగనప్పుడు శస్త్రాస్త్రాలు పట్టడం తప్పనిసరి. సంధి రాయబారాలు విఫలమైనప్పుడు ఆయుధాలను విసర్జిస్తాం. పోరాట సమయంలోనే తప్ప ఆయుధాలు ఆ తర్వాత పనికిరావు, వాటి మాటే మరచి పోవలసి వుంటుంది.॰

అంబేద్కరు విషయంలో కూడ ఇదే పద్ధతిని అవలంబించవలసి వుంది. అంబేద్కరు ఒక విప్లవయోధుడు. తన వాళ్లలోని దురాచారాల మీదనే తాను కత్తి కట్టి పోరాడినవాడు. పోరాట సమయంలో సందర్భోచితమైన ఆగ్రహావేశాలను, కఠిన పద ప్రయోగాలను ఉపయోగించినవాడు. సార్వత్రికమైన కాంగ్రెసు పార్టీని, బలవంతుడైన గాంధీజీని, పరిపాలిస్తున్న బ్రిటీషు సామ్రాజ్యాన్ని కూడా "మా దురవస్థలను తొలగించడానికి మీరేం చేశారు ?" అంటూ నిలదీసి అడిగిన వాడు.

అట్టి మహానాయకుడి అడుగు జాడలలో పురోగమించడానికి, ఒక సైద్ధాంతిక దృక్పథాన్ని అంబేద్కరిజం పేర ఏర్పరచు కొంటున్నప్పుడు, మనం నిర్మాణాత్మక వైఖరినే అవలంబించవలసి వుంటుంది. తద్విరుద్ధమైన దాని నంతా పరిహరించవలసి వుంటుంది. సదస ద్వివేకం ఇక్కడెంతో అవసరం.

అత్మవత్ సర్వభూతాని అని, త్వమేవాహం అని, తత్త్వమసి అని, సర్వేజనా స్సుఖినో భవంతు అని, అంటరాని తనం పాపం అని, కులభేదాలు పనికిరావు అని, భగవంతుని దృష్టిలో అందరూ సమానులే అని సుభాషితాలు వల్లిస్తున్న వాళ్లే అందరూ. వేదికలమీదా, పత్రికలలోనూ, రేడియోల నుంచీ గొంతెత్తి చాటుతున్న వాళ్ళే, ఆచరిస్తున్న వాళ్ళు మాత్రం లేరు.

ఆచరణ కోసం పోరాడడం తప్పనప్పుడు, అంబేద్కరు పద్ధతిలోనే పోరాడ వలసి ఉంది. మేకల్లా తల వంచ కూడదు. సింహాల్లా గర్జించాలి.

అయితే, మనం కత్తిదూసింది మన స్వజాతీయుల మీదనే అనే సత్యాన్ని విస్మరించకూడదు. స్నేహ వాత్సల్య కారుణ్యాలనే ఖడ్గ తుల్యంగా వాడడం ఉత్తమం. అంబేద్కరు మనస్తత్వం అట్టిది. ఆయన బోధించింది సాయుధ పోరాటం కాదు. సత్య ధర్మ సాధు వాద మార్గం.

ఇప్పుడు ఈ దృక్పథంతో అంబేద్కరిష్టులు ఏం చేయాలి? కార్యక్రమం ఏమిటి? ఏ లక్ష్యాలను ఏ విధంగా సాధించాలి అనే దానిని క్లుప్తంగా వివరిస్తాను. ఇదంతా నా "ధర్మం కోసం పోరాటం"లో చెప్పినట్టిదే. వివరాలకోసం ఆ గ్రంథం చూడగలరు. ఆ గ్రంథం ఆధారంగానే కర్ణాటక "దళిత సంఘర్ష సమితి" దేశంలో ఒక ఉద్యమాన్ని నిర్వహిస్తున్నది కూడా.

# 12. కార్య ప్రణాళి

ప్రతి మానవుడూ అను కొంటాడు –

తాను రైటూ, తక్కిన అందరూ రాంగూ అని;

అయితే, మెజారిటీ గొర్రెలలో తానూ ఒకడు కనుక

నక్కల ముందు నోరెత్తడు,

పులుల ముందు తలెత్తడు !

అంబేద్కరిజాన్ని కార్యరూపంలో పెట్టడానికి మనం చేబట్టవలసిన సాధనాలు మూడు. ధర్మం, సంఘం, భీమం.

వీటిని గురించిన వివరణ లోగడనే చెప్పారు. ధర్మం అంటే మానవ ధర్మం. మానవులంతా ఒక్కటే అనేధర్మం. తిండీ, బట్టా, వసతీ మాత్రమే కాక, సృష్టిలో లభించే సమస్త సంపదలూ, సౌకర్యాలూ కూడ ప్రతి మనిషికీ అందాలి. ఎవరికి అవసరమైనంత, ఎవరికి సాధ్యమైనంత వారు అనుభవించగలిగే అవకాశం ఉండాలి. ఆటంకాలు ఉండకూడదు.

సంఘంలో ఎవరైనా, ఏ కుల మత వర్గాలకు చెందినవాళ్లైనా, ధర్మ ప్రవర్తనకు ఏవైనా అడ్డంకులు కలిగించి నప్పుడు, ప్రతిఘటించ వలసిన బాధ్యత అంబేద్కరిష్టుల మీద ఉంది.

సంఘం అంటే ఏక భాష, ఏక సంస్కృతి, ఏక దేశం కలిగిన ఒక మానవ సమూహం. క్రమబద్ధంగా సంఘటితమైన అట్టి మానవ సమూహాన్నే సంఘమనీ, జాతి అనీ, దేశమనీ అంటాం. ఉదాహరణ చెప్పాలంటే తెలుగు దేశాన్నే చెప్పుకోవచ్చు. తెలుగుభాష మాట్లాడే వాళ్లంతా ఒక సంఘం. సంఘంలోని ఆయా వ్యక్తులలో (గుణాలనుబట్టి, వృత్తులనుబట్టి) కుల మత వర్గభేదాలుంటే వుండవచ్చు. అవి సాధారణ మానవ హక్కులకు భంగం కలిగించేవిగా వుండకూడదు. ఎట్టి భంగమైనా కలిగితే, అట్టి దానిని అంబేద్కరిష్టులు ప్రతిఘటించవలసి ఉంది.

ధర్మాన్ని రక్షించడానికి, సంఘంలోని అసమానతలను తొలగించడానికి అను సరించ వలసిన మార్గమే భీమం. భీమం అంటే, అంబేడ్కరు మనకిచ్చిన అంబేడ్కరిజం. "భీమం శరణం గచ్ఛామి" అనడంలోని అంతర్యమిదే. ఈ నూతన

త్రి శరణాలను ముందుంచుకొని కార్యరంగంలో ప్రవేశించాలి.

ఈ కార్యక్రమంలోని కొన్ని ముఖ్యాంశాలను నా "ధర్మం కోసం పోరాటం" గ్రంథంలో ఇచ్చా నన్నాను కదా! సదరు కార్యక్రమాన్ని నిర్వహించడానికి అందులో "భీమసేన" అనే పేరుతో ఒక సేవాదళాన్ని కూడ నేను ప్రతిపాదించి వున్నాను. 1968లో నేను రాష్ట్రీయ భీమసేనను నెలకొల్పి నడిపాను. పత్రికలు కూడా దానికి గొప్ప ప్రచారాన్ని ఇచ్చాయి. నిజానికి ఆనాటి భీమసేనకు ఒక లక్ష్యాన్ని, కార్యక్రమాన్ని, ఇవ్వడంకోసమే నేను ధర్మం కోసం పోరాటం గ్రంధాన్ని వ్రాయటం జరిగింది. అయితే, అప్పటి కింకా అంబేద్కరిజానికి ఒక స్పష్టమైన రూపం ఏర్పడక పోవడం వల్ల, భీమసేన ముందుకు నడవలేక పోయింది.

భీమసేననే భీమ సేవాదళం అని కూడా అనవచ్చు. మరే పేరు తోనైనా పిలవవచ్చు. అంబేద్కరిజాన్ని ఆచరణలో పెట్టడానికి మాత్రం ఒక పటిష్ఠమైన యువ సేవాదళం అవసరమై వుంది.

ఈనాడు ఈ దేశంలో ఆర్థిక సాంఘిక రాజకీయ రంగాలలో దళిత ప్రజల బ్రతుకులు ఏ స్థితిలో వున్నాయో పరిశీలించిన మీదట, నాకు తోచిన కొన్ని కార్యక్రమాలను ఇక్కడ పేర్కొంటున్నాను. దేశ, రాష్ట్ర, జిల్లా గ్రామ స్థాయిలలో ఆయా సేవా దళ శాఖలు ఆయా సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, పరిష్కార మార్గాలను నిర్ణయిస్తూ, తగు చర్యలకు పూనుకోవలసి వుంటుంది.

(1) భూమి జాతీయం చెయ్యబడాలి. వ్యవసాయ భూమే కాక, తక్కిన అన్ని రకాల భూములూ కూడ జాతీయ సంపదగానే పరిగణించబడాలి. ఇళ్ల స్థలాలు, ఇళ్లు, ఇంటి తోటలు తప్ప వ్యక్తి పరమైన ప్రైవేటు భూములు వుండకూడదు.

గృహాలు, గృహ వనాలు, గృహాలంకరణ సామగ్రి, దుస్తులు, ఆభరణాలు మొదలైన వ్యక్తిగత సుఖానికి, సౌకర్యానికి, స్వేచ్ఛకు సంబంధించిన వస్తు వాహనాది సంపద సొంతానికి వుండవచ్చు. ఆ మాత్రం లేకపోతే మానవుడిలోని ప్రజ్ఞ వికసించదు. ప్రజ్ఞా వికాసమే మానవ సహజ ధర్మం.

అంటే, వ్యక్తిగత ఆస్తిని అనుమతిస్తూ, ఒక పరిమితికి దానిని లోబరచవలసి వున్నదన్నమాట.

సహజ సంపదలపై సాముహిక యాజమాన్యం తప్పని సరి.

(2) తిండీ, బట్టా మొదలైన అవసర సరఫరాలను ప్రభుత్వమే చేబట్టాలి, వాటికోసం వ్యక్తులు, కుటుంబాలు ఆందోళన పడడం, క్యూలలో నిలబడడం వుండ కూడదు. సరఫరాలన్నీ ఇండ్లకే అందజేయబడాలి. (హోమ్ డెలివరీ) పద్ధతి సర్వత్రా అమలు జరగాలి.

(3) అంటరాని తనమూ, కుల తారతమ్యాలూ గ్రామాలలోనే ఎక్కువగా వుంటున్నై. పట్టణాలలోనూ, నగరాలలోనూ ఇవి అంతగా కనిపించవు. అందువల్ల చిన్న చిన్న గ్రామాలను రద్దు చేసి, వాటిని దగ్గరలో వుండే పట్టణాలకు, నగరాలకు కలిపి వెయ్యాలి.

ఆ విధంగా చెయ్యడం వల్ల మంచి నీరు, విద్య, వైద్యం మొదలైన ఆధునిక కనీస సౌకర్యాల ఏర్పాటులోని ఇబ్బందులు తొలగి పోతై.

ఈనాడు చాల గ్రామాలకు వైద్య సౌకర్యాలు లేవు. కనీసం జూనియర్ కాలేజీలు కూడ లేవు. రక్షిత నీటి సదుపాయాలు లేవు. రోడ్లు లేవు. రవాణా సౌకర్యాలు లేవు. ఇట్టి దురవస్థ తొలగి పోవాలంటే అట్టి గ్రామాలను ఒక పద్ధతి ప్రకారం సమీప పట్టణాలతో కలిపి వేస్తూ పోవాలి.

(4) ఆ విధమైన పట్టణీకరణ (అర్బనైజేషన్) వల్ల ఆయా గ్రామాలకు ఖాళీ చేయించిన స్థలాలు కూడ వ్యవసాయ భూములలో కలిసి పోతై. అప్పుడు విశాలమైన క్షేత్రాలు ఏర్పడతై. యంత్రమూలక వ్యవసాయం సాధ్యమౌతుంది. వ్యవసాయోత్పత్తులు బాగా పెరుగుతై, అవసరమైన వాటిని గోదాములో నిల్వ చేసి ఏడాది పొడుగునా ప్రజలకు అందిస్తూ వుండవచ్చు. వ్యవసాయమూ, తదితర ఉత్పత్తి సాధనాలూ అన్నీ ప్రభుత్వ ఆధీనం క్రిందనే నిర్వహించబడాలి. సహకారోద్యమం ఇలాంటి కార్యక్రమాలలో ఎంతగానో సహకరించగలదు.

(5) మనిషి స్వార్థ పరుడూ, దుర్జనుడూ, దురాక్రమణ దారూ, వంచకుడూ, ధనాశా పరుడూ వగైరా కావడానికి కారణం జీవితానికి నిజమైన రక్షణ లేక పోవడమే. ఎలాంటి అక్రమ మార్గాల ద్వారా అయినా ఎక్కువ ధనం సంపాదించి నిలవ చేసుకోవాలనే తాపత్రయానికి కారణం భవిష్యత్తు భద్రంగా వుండాలనేది.

అవసరమైన అన్న వస్త్రాలూ, వైద్య సదుపాయాలూ, తన బిడ్డలకు విద్య, ఉద్యోగం, వృద్ధాప్యంలో అవసరమయ్యే ప్రత్యేక రక్షణలూ ప్రతి వ్యక్తికీ ప్రభుత్వం

అందించ గలిగితే, ధనం కూడ బెట్టుకోవడానికి ఏ వ్యక్తీ తాపత్రయపడడు: అవి నీతికి కారణం ఆత్మరక్షణ లేక పోవడమే. అవసర సౌకర్యాలు కలిగించ కుండా నీతులు చెప్పడం వల్లా, నిర్భంధాలు విధించడం వల్లా లాభం లేదు.

ఎంత మంది ప్రవక్తలైనా, ఎన్నెన్ని మతాలలోనైనా మనిషికి నీతి నియమాలు బోధించారే తప్ప, అతడికి కావలసిన జీవితావసరాలను అందించడానికి ప్రయత్నించలేక పోయారు. ఆకలితో చస్తున్న వాడికి నీతి బోధలేం రుచిస్తై?

అందువల్ల, నిల్వ నీటిలా నాచు గట్టి పోయిన సామాజిక వ్యవస్థను శుభ్రపరచి, నిజమైన మానవ విలువలు ముందుకు సాగేటట్టు అంబేద్కరిష్టులు చూడవలసి వుంది. సామాజిక వ్యవస్థనే పూర్తిగా మార్చాలి. అందుకు ఒక దీర్ఘకాలిక ప్రణాళికతో కృషి చెయ్యాలి.

(6) పేదరికాన్ని నిర్మూలించి, దోపిడీ విధానాన్ని రద్దు పరచి, సమాజంలోని ప్రతి ఒక్కడికీ ఆర్థిక పుష్టిని కలిగించడం కోసం మౌలిక చర్యలు తీసుకోవాలి. అట్టి చర్యలు స్థానిక పరిస్థితులకు అనుకూలమై వుండాలి. ఆయా ప్రాంతాలలో లభించే సహజ వనరులను, ముడి పదార్థాలను ఉపయోగించి అక్కడి ప్రజలకు వృత్తి సౌకర్యాలు కల్పించాలి.

ఏ మనిషీ పని లేకుండా వుండ కూడదు. గృహాలు, తోటలు, రోడ్లు, కాలువలు, చెరువులు, ఆనకట్టలు, పరిశ్రమలు, కార్ఖానాలు, ప్రాజెక్టులు, వంతెనలు మొదలైన ఎన్నో నిర్మాణ కార్యక్రమాలు దేశం నిండా జరగవలసి వున్నై.

చెయ్యవలసిన పనీ ఎంతో వుంది, పని కావలసిన జనమూ ఎంతో మంది వున్నారు. ఈ నిరుద్యోగ జనాన్ని కూడగట్టి, ఆ నిర్మాణ కార్యక్రమాలను నిర్వహించ గల నాయకత్వమే ఈనాడు కరువైంది. అట్టి నాయకత్వాన్ని అంబేద్కరిష్టులు స్వీకరించ వలసి వుంది.

సోమరి తనాన్ని సహించ కూడదు. నిరంతరం ఏదో పని చేస్తూనే వుండాలి. నిర్దిష్టమైన పనులు లేని, పనులు కావలసిన జనాన్ని సంఘటిత పరచి, వారికి గ్రామ పట్టణ నగరాభివృద్ధి కార్యక్రమాలతో సంబంధం కల్పించాలి. అట్టి పనిని ప్రభుత్వమే చెయ్యగలదు. అందుకు అంబేద్కరిష్టులు తమ సహకారాన్ని అందిస్తూ వుండాలి.

(7) ఫ్యాక్టరీలలోనూ, కర్మాగారాలలోనూ పని చేసే కార్మికులు సంఘటితులై వున్నారు. వాళ్లంతా కుల మత రాగద్వేషాలు లేకుండా, సమైక్యంగా వ్యవహరించేటట్టు కృషి చేయవలసి ఉంది.

(8) గ్రామీణ జనాభాలో అధిక సంఖ్యాకులు వ్యవసాయ కూలీలు. వీళ్ళంతా దళిత బడుగు కులాలకు చెందిన వాళ్లే. కేవల గ్రామ్యమైన మొరటు భూస్వామిక దౌర్జన్యానికి బలైపోతున్న వాళ్లే.

ఇంత వరకూ వ్యవసాయ కూలీలను సంఘటిత పరచే, వ్యవస్థీకరించే ప్రయత్న మేదీ జరగలేదు. కనీస వేతనాల చట్టాన్ని కూడ ఖచ్చితంగా అమలు పరచే నాయకత్వం కూడ రూపొందలేదు. ఈ లోపాన్ని తీర్చుడం అంబేద్కరీయుల తక్షణ కర్తవ్యం.

ప్రభుత్వం మీద వత్తిడి తెచ్చి, ప్రతి తాలూకాకు ఒక లేబరాఫీసరును నియమింప జేసి, వ్యవసాయ కూలీలను సంఘటిత పరిచే కృషికి పూనుకోవాలి. ప్రస్తుతం ఈ వ్యవసాయ కూలీలు దిక్కూ మొక్కూ లేని అవ్యవస్థలో వదలి వేయబడి వున్నారు. వాళ్ళకు క్రమ బద్ధమైన ఆదాయం వచ్చే ఏర్పాట్లు లేవు సరికదా, ఆరోగ్య భద్రతకు, ప్రసూతి వంటి అవసర పరిస్థితులలో తగు రక్షణకు, పనులుండని రోజులలో ప్రాణాలు నిలుపుకోడానికి కూడా తగు ఏర్పాట్లు లేవు. అంబేద్కరీయులు వెనువెంటనే చేబట్ట వలసిన కార్యక్రమం ఇది.

అంబేద్కరు చెప్పిన ఎడ్యుకేట్, ఆర్గనైజ్ అనే రెండు ఉద్బోధలను వెనువెంటనే ఆచరణలో పెట్టవలసిన రంగం వ్యవసాయ కూలీ రంగం.

## పదవుల కోసమే కులతత్వం

(9) అస్పృశ్యత నివారణకు తీవ్రచర్యలు తీసుకోవలసి వుంది. అస్పృశ్యతను ఎక్కడ ఎవరు పాటించినా శిక్షలువిధించాలని చట్టాలు చెబుతున్నై. అందుకు ప్రధానమైన పౌరహక్కుల చట్టం ఒకటి అమలులో వుంది. ఆ చట్టం ప్రతులను విరివిగా గ్రామీణ ప్రజలకు అందజేయవలసి వుంది. వీధులలో, హోటళ్ళలో, దేవాలయాలలో కులం పేరుతో అటంక పరచడాన్ని బలంగా ప్రతిఘటించవలసి వుంది.

దళితజనానికి దేవాలయాలు అంతగా అక్కరలేకపోవచ్చు. అయినా,

హక్కులను ఎందుకు వదులు కోవాలి? చట్ట బద్ధమైన ప్రాథమిక హక్కులను అమలు జరిపించుకొని తీరాలి.

(10) అంటరానితనం క్రమంగా తగ్గిపోతూ వుంది, నిజమే. అయితే కులతత్వం బహుఘోరంగా విజృంభిస్తూ వుంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవడం ప్రారంభమైన తర్వాత, కేవలం రాజ్యాధికార పదవులకోసం రాజకీయనాయకులు కులపక్షపాతాలను రెచ్చగొట్టడం ప్రారంభించారు. ఇది చాల ప్రమాదకరమైన దుస్థితి.

ఈ దుస్థితిని నివారించడానికి కుల వ్యవస్థనే నిర్మూలించాం.

"ప్రజా స్వామికమూ, మానవ సమానత్వమూ అలవాటు లేని మన ప్రజలకు వోట్లద్వారా ప్రతినిధులను ఎన్నుకొనే రాజరికాన్ని అందిస్తున్నాం. ప్రజలను చైతన్య వంతులను చేసి, కుల తత్వాలను నిర్మూలించి, ఏక జాతీయతను నెలకొల్పకపోతే ఇప్పుడు మనం నిర్మించిన రాజ్యాంగం చిన్నాభిన్నమై పోగలదు". అంటూ రాజ్యాంగ నిర్మాణ సభలో అంబేద్కరు హెచ్చరించి వున్నాడు. హెచ్చరిక బాగున్న దన్నవాళ్లే తప్ప, ఇంతవరకూ దానిని అమలుపరచడానికి ప్రయత్నించిన వాళ్లే లేకపోయారు.

పై పెచ్చు కులవైషమ్యాలను రెచ్చగొడుతున్నారు. జాతి సమైక్యం కావడానికి బదులుగా విచ్ఛిన్నంకావడం మొదలయింది.

కులనిర్మూలనకు, సమైక్య జాతి నిర్మాణానికి అంబేద్కరు చెప్పిన ఉపాయం ఒకటుంది. అది కులాంతర వివాహాలను ప్రోత్సహించడం.

నేను చేసిన సూచన ఒకటుంది, అది కులంమార్పిడిని అనుమతిస్తూ చట్టం చెయ్యడం.

ఇలాంటి విప్లవకరమైన సంస్కరణల విషయంలో అంబేద్కరీయులే చొరవ చూపవలసి ఉంది. వృత్తుల తేడాలు, ఆదాయాల తేడాలు ఎన్ని ఉన్నప్పటికీ, అన్ని కులాల మానవులూ సమానులేనని, ఒక కులం కంటే మరొక కులం గొప్పదేమీ కాదని ప్రజలకు నచ్చజెప్పవలసి వుంది.

## రిజర్వేషనులు తప్పని సరి

(11) హరిజనులకూ, గిరిజనులకూ రాజ్యాంగంలో రిజర్వేషనులు (ప్రత్యేక

రక్షణలు) కల్పించబడ్డాయి. హరిజనులు దళితులు, అంటరాని తనం అనే దీర్ఘవ్యాధికి క్రూరంగా బలిచేయబడ్డ వాళ్లు. వేల సంవత్సరాల అంటరానితనం వాళ్ళ రక్త మాంసాలను, జవ సత్వాలను పీల్చేసింది. వాళ్ళలోని ఉత్సాహాన్నీ, జీవితాశయాలనూ ఆర్పేసింది. అట్టి వాళ్ళకు రక్షణలు కల్పించడం, రిజర్వేషను లివ్వడం న్యాయమే. ధర్మమే. అవసరమే.

కుటుంబంలో ఏ యొక్క సభ్యుడైనా వ్యాధిగ్రస్తుడై మంచాన పడితే, అతడు తిరిగి అరోగ్యవంతుడయ్యేవరకూ ఆ కుటుంబమంతా రోగగ్రస్తమైనట్లే బాధపడు తుంది. ఎంత ఖర్చైనా పెట్టి, ప్రత్యేక చికిత్సలతో, ప్రత్యేక ఆహార విహారాలతో ఆ రోగిని త్వరత్వరగా బాగుచేసుకొనేందుకు ప్రయత్నిస్తుంది.

హిందూ సమాజం అనే కుటుంబంలో అంటరానితనం అలాంటి భయంకర రోగం. దానికి ప్రత్యేక చికిత్సలే రిజర్వేషనులు.

కొద్దికాలంలోనే ఈ రోగం నయమౌతుందనీ, ఈ ప్రత్యేక శ్రద్ధ ఎంతో కాలం కొనసాగనక్కరలేదనీ రాజ్యాంగ నిర్మాతలు భావించారు. అయితే, వాళ్ళ ఆశ నిరాశే అయింది.

ఈ వ్యాధి నిర్మూలన కోసం నకిలీ మందులు తయారుచెయ్యబడ్డాయి. కల్తీ ఆహారం వడ్డించబడుతున్నది. వ్యాధి నయంకావడానికి బదులు ముదిరిపోతూ వుంది. రోగి వ్యాధి కుటుంబాని కంతకూ సోకే ప్రమాదం ఏర్పడింది. అందుకు ఒక నిదర్శనం అంబేద్కరు మతం మార్చడమే.

అంతటి ప్రమాదం ఎందుకు ఏర్పడింది? రిజర్వేషనుల అమలు విషయంలో, దళితులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం విషయంలో నిజాయతీ లేక పోవడమే అందుకు కారణం.

రాజకీయ పార్టీలను నడిపే సవర్ణ కామందులు తమకు లోబడి వుండే నోరు లేని దళితులనే ఎన్నికలలో రిజర్వు స్థానాలకు అభ్యర్థులుగా నిలిపి, తమ కులాధిక్యతతో గెలిపిస్తారు. ఆ విధంగా గెలిచిన దళితజన ప్రతినిధులు నోరులేని వాళ్ళవుతారు. అట్టి వాళ్లు మంత్రులైనా, మరే పదవులను అధిష్ఠించినా, దళిత జనాభ్యుదయానికి ఎలాంటి కృషీ చెయ్యలేరు.

దళిత జనాభ్యుదయ ప్రణాళికను అమలుపరిచే అధికారులు కూడా ఎక్కువగా

సవర్ణ కుల తత్వ ప్రభావం కలవాళ్లే కనుక, అట్టి ప్రణాళికలు తిన్నగా అమలు జరగవు.

"ఉద్యోగాలన్నీ హరిజనులకే, కోటాను కోట్ల ధనమంతా హరిజనులకే" అనే ప్రచారం ఎంత గొప్పగా జరుగుతున్నదో, అంత చప్పగా వుంది దాని ఆచరణ. ఆ ప్రచారం వల్ల హరిజనులకు ఎంతో అపకారం జరుగుతూ వుంది. ఇతర కులాలవాళ్లలో హరిజనులపట్ల అసూయ, ద్వేషం పెరుగుతూ ఉంది. అంతా వాళ్ళకేనా అనే క్రోధం పెరుగుతూ వుంది. వాస్తవానికి జరుగుతున్న అభివృద్ధి ఏమీ లేదు. ఎక్కడి గొంగళి అక్కడే పడివుంది!

ఈ విషమ పరిస్థితిని అంబేద్కరీయులు ఎదుర్కొని, ప్రజలలో వాస్తవమైన అవగాహనను కలిగించి, దళిత కులాల అభివృద్ధికి నిజమైన కృషి జరిగే వరకూ రిజర్వేషనులు కొనసాగేటట్టు చూడవలసి వుంది.

రిజర్వేషనులను నిజాయితీతో అమలుజరపాలి. పబ్లికు ప్రైవేటు రంగాలన్నింటికీ వర్తింపజెయ్యాలి. రిజర్వేషనులు రద్దయినతర్వాత ఇప్పుడున్న నిష్పత్తిలోనే, అంత కంటే ఎక్కువగా కూడా, హరిజన ప్రతి నిధులు ఎన్నుకోబడగల స్థాయికి సమాజం ఎదగ వలసి వుంది.

అగ్రకులాల అభ్యర్థులతో హరిజన అభ్యర్థులు వివిధ రంగాల ఉద్యోగాల కోసం, అధికార పదవుల కోసం పోటీ పడగల స్థాయికీ వారి స్థితిగతులు మెరుగు పడాలి. అంత వరకూ రిజర్వేషనులు కొనసాగక తప్పదు. ఈ విషయంలో అంబేద్కరీయులు ప్రత్యేక శ్రద్ధాళువులై కృషి చెయ్యవలసి వుంది.

ఇలా ఎంతైనా చెప్పవచ్చు. సమస్యలకు అంతం వుండదు. స్థానిక సమస్యలు తక్షణ పరిష్కారాన్ని కోరుతూ వుంటై. వాటన్నిటినీ ఎక్కడికక్కడే తగు విధంగా పరిష్కరించుకొంటూ వుండాలి.

(12) ఏ సమస్యల పరిష్కారానికైనా ముఖ్యంగా సహకార సామరస్య పద్ధతులనే అవలంబించాలి. అన్ని కులాలూ ఒకే జాతికి చెందినవాళ్ళనే సత్యాన్ని మరిచి పోకూడదు. స్నేహం, ప్రేమ, దయ, కరుణ, ఓర్పు, త్యాగం వంటి మానవత్వ గుణాలనే పరిష్కార సాధనాలుగా వాడుకోవాలి.

ఇక్కడ మరొక వాస్తవం గుర్తించ వలసి వుంది. భీమ సేవా దళాలు

రాజకీయాల జోలికి పోకూడదు. పార్టీ పక్షపాతాలకు దూరంగా వుండాలి. ఏ పార్టీ, ఏ కులం, ఏ మతం అనే భేద దృష్టిని ప్రదర్శించకూడదు. మనకు కావలసింది దళిత జనోద్ధరణ, కుల నిర్మూలన, జాతి సమైక్యం.

రాజకీయాలు అసలు వద్దని కాదు. అందుకు వేరే వ్యవస్థ అవసరం.

రిపబ్లికను పార్టీ అంబేద్కరు ఆశించిన మార్గానికి విరుద్ధంగా నడుస్తున్నదీ నాడు. ఆ పార్టీ సర్వ జనాశ్రయ సంస్థగా రూపొందాలనేది అంబేద్కరు ఆశయం. అది పూర్తిగా విస్మరించబడింది.

ఆయన మరికొంతకాలం బ్రతికి వుంటే, లోహియా వంటి వారితో కలిసి ఒక బలమైన జాతీయ సోషలిష్టు పార్టీగా దానిని విస్తరింపజేసేవాడే.

ఇప్పుడది సంకుచితమైన ఒక కుల పార్టీగా దిగజారిపోయిందనవచ్చు. దానిని పునరుద్ధరించడానికి, జాతీయ స్థాయిలో సంఘటిత పరచడానికి అంబేద్కరీయ రాజకీయ నాయకులు పూనుకోవచ్చు. కులమత వర్గ భేదాలకు అతీతంగా మాత్రం దాని పునర్నిర్మాణం జరగాలి. రాజకీయ పార్టీలను, సేవా దళాలను వేరు వేరుగా వుంచవలసి వుంది.

(13) షెడ్యూల్డు కులాల ఫెడరేషనును అంబేద్కరు ఎందుకు రద్దు చేసినట్టు? అది కుల పార్టీగా వున్నదనే కదా ! కులం పేరుతో వుండే ఏ పార్టీ గాని సర్వజనీన పార్టీ కాలేదు కదా! జాతీయ స్థాయిలోగాని, రాష్ట్రస్థాయిలో గాని ఏదైనా ఒక పార్టీ రాజ్యాధికారాన్ని చేబట్టాలంటే అది ప్రజలందరకూ చెందిన పార్టీ అయివుండాలి. ఏదో ఒక కులానికి పరిమితం కాగూడదు.

అంబేద్కరు లక్ష్యం రాజ్యాధికారం దళిత కులాలకు, బడుగు వర్గాలకు రావాలనేది.

అందుకే ఆయన కులపార్టీగా వున్న ఫెడరేషనును రద్దు చేసి పేద పీడిత దళిత ప్రజలందరూ చేరడానికి వీలైన రిపబ్లికను పార్టీని నెలకొల్పాడు.

అయితే, ఇప్పుడు జరుగుతున్న దేమిటి?

రిపబ్లికను పార్టీ ఒక కులం వాళ్ల చేతిలోనే వుండి పోయింది. ఆ కులం వాళ్ళ వోట్ల మీదనే ఆధారపడింది. దళితులకు రిజర్వుచేయబడిన నియోజక వర్గాలలో మాత్రమే పోటీకి సాహసిస్తున్నది. అక్కడైనా దళిత కులాల మెజారిటీ వోట్లు ఇతర

పార్టీల అభ్యర్థులకే పోతున్నై. ఆ పార్టీ ఎక్కడా స్వయంగా గెలవలేకపోతున్నది. ఎలానూ గెలవలేకపోతున్నది. కాబట్టి, జనరల్ నియోజకవర్గాలలో పోటీకి నిలబడి తన స్థాయిని పెంచుకోవచ్చు కదా! ఆ పనీ చెయ్యడం లేదు. ఎంత దుస్సహ దుస్థితి!

## ఎన్నికల పద్ధతి మారాలి

(14) భారతదేశంలో ప్రజాస్వామికం నిలవాలంటే ఎన్నికలు న్యాయంగా, సక్రమంగా, ప్రజాభిప్రాయాన్ని ప్రకటించేవిగా జరగవలసివుంది. అందుకు ఎన్నికలు జరిపే ప్రస్తుత పద్ధతిలో పూర్తి మార్పును తీసుకు రావలసి వుంది.

ఇప్పుడున్న పద్ధతి పేదలకు, విద్యావంతులకు, నీతిమంతులకు, మేధావులకు అందుబాటులో లేదు. పెద్ద పెద్ద ధనవంతులు మాత్రమే అభ్యర్థులుగా నిలబడగలుగు తున్నారు. ధనబలాన్నీ, దౌర్జన్య భయాన్నీ ప్రయోగించి, వోట్లను పోగుచేసుకొని, అధికారాన్ని వశం చేసుకొని, మరింత ధనాన్ని మూటగట్టుకొంటున్నారు ధనస్వాములు. ఐదేళ్ళ కొకసారి ధనాన్ని వెదజల్లడం. ఐదేళ్ళ పాటు ఇతోధికంగా ధనాన్ని పోగుచేసుకోవడం తప్ప వాళ్ళకు మరొక పని లేదు. ప్రజల సమస్యలుగాని, జాతి శ్రేయస్సుగాని, దేశం అభివృద్ధిగాని వాళ్ళకు పట్టడం లేదు.

ఈ దుస్థితి తొలగాలంటే ఎన్నికల కార్యక్రమంలో పూర్తి మార్పును తీసుకు రావలసి వుంది.

(1) ఎన్నికల కార్యక్రమాన్ని పూర్తిగా ఎన్నికల కమీషనే నిర్వహించాలి. రాజకీయ పార్టీలకు ఎన్నికల నిర్వహణలో ఏ దశలోనూ సంబంధం వుండకూడదు.

(2) అభ్యర్థులకు కనీస అర్హతలను నిర్ణయించాలి. అట్టి అర్హతలకు లోబడి మాత్రమే రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ఎంపిక చేసుకోవాలి.

(3) ఆ విధంగా రాజకీయ పార్టీలు పంపిన అభ్యర్థుల యొక్క, స్వతంత్ర అభ్యర్థుల యొక్క అర్హతలను పరిశీలించిన మీదట కమీషను ఆయా ఎన్నికలలో, ఆయా నియోజక వర్గాలకు, అభ్యర్థుల జాబితాను ఖరారు చేసి ప్రకటించాలి. అప్పుడది ఫైనల్ జాబితా అవుతుంది.

(4) కమీషను అభ్యర్థుల జాబితాను ప్రకటించి, వాళ్ళకు తగు ఎన్నికల చిహ్నాలను కేటాయించాలి. అభ్యర్థులూ, పార్టీలూ అందజేసిన అర్హతలను, ఎన్నికల

ప్రణాళికలను కర పత్రాలుగా కమిషనే ముద్రించి, తన యంత్రాంగం ద్వారా నియోజక వర్గాలలో ప్రతి వోటరుకూ అందేటట్టు చూడాలి. వాటి ఆధారంగానే వోటర్లు అభ్యర్థులు యోగ్యతా యోగ్యతలను బట్టి ఎవరిని ఎన్నుకోవాలో నిర్ణయించు కుంటారు.

(5) పోలింగు రోజున వోటర్ల లిస్టులో వోటరు పేరుకు సంబంధించిన వివరాలను పార్టీలు ఇచ్చే ప్రస్తుత పద్ధతిని రద్దుచేయాలి. అట్టి వివరాలు గల స్లిప్పులను పోలింగుకు ఒక రోజు ముందుగానే ప్రతి వోటరుకూ కమీషనే తమ సిబ్బంది ద్వారా అందజేయాలి.

ఎన్నికల నిర్వహణలో ఇట్టి మార్పులు తీసుకురావటం వల్ల పార్టీలూ, వ్యక్తులూ పెట్టే ఎన్నికల ఖర్చు పూర్తిగా తగ్గిపోతుంది. ఇండిపెండెంటు అభ్యర్థులు అసలు ఖర్చే పెట్టక్కరలేదు. డిపాజిట్ కోసమూ, కరపత్రాలు ముద్రణ కోసమూ, వాటిని వోటర్లకు అందజేయడం మొదలైన పనులకోసమూ కొంత నిర్ణీత మొత్తాన్ని కమీషనుకు చెల్లించడం తప్ప అభ్యర్థులకూ, పార్టీలకూ మరొక ఖర్చేదీ వుండదు. శ్రమ అంత కంటే వుండదు. ఊరేగింపులు, నినాదాలు కొట్లాటాలు వగైరా గొడవలకు ఆస్కారమే ఉండదు. అన్ని అర్హతలూ వుండి, ధనం మాత్రమే తక్కువైన మేధావులు, ధనం తప్ప మరెట్టి జ్ఞాన సంపదా లేని దొరబాబుతో విజయవంతంగా పోటీచెయ్యగల అవకాశం ఈ మార్పుల వల్ల ఏర్పడుతుంది. నిజమైన ప్రజాసేవకులు, దేశ భక్తులు రాజకీయ రంగంలోకి రావడం సాధ్యమవుతుంది. సమాజంలో ఈనాటి రాజకీయాలు సృష్టిస్తున్న కాలుష్య మంతా దానంతట అదే నిర్మూలమైపోతుంది.

ఇలాంటి మార్పులకు భూస్వాములూ, ధన స్వాములూ అంగీకరించరు. దళిత బడుగు వర్గాలకు చెందిప అంబేద్కరీయులే అందుకు కృషి చెయ్యా వలసి వుంది. సాధించవలసి వుంది.

## నాయకత్వమూ, సాంస్కృతిక వికాసమూ

(15) ఈ నాడు దళితులకు నాయకత్వం లేదు. అంబేద్కరు పోయిన తర్వాత, దేశంలో దళితులకు తమ కష్టాలను గురించి చెప్పుకొనే దిక్కూ, వినే దిక్కూ అడిగే దిక్కూ కూడా లేకుండా పోయింది.

ఫస్టు క్లాసుల్లో పాసయ్యే తెలివైన వాళ్లు ఉద్యోగాల్లో చేరి, తమ పొట్టలు

తాము నింపుకొంటున్నారు. దళిత ప్రజల మంచి చెడ్డలను గురించి వాళ్లు పట్టించుకోవడం లేదు. ఆలోచించడం లేదు.

రాజకీయ సాంఘిక రంగాలలో ఏవో పార్టీల తరపున పదవులలోకి వచ్చే వాళ్లుసైతం ఆయా పార్టీలపెద్దలకు కట్టుబానిసలుగా పడివుంటున్నారు. వాళ్లకు కూడా ఉదరపోషణమే పరమార్థంగా వుంటున్నది. తాము ఎవరికి ప్రాతినిధ్యం వహిస్తున్నారో గుర్తులేక ప్రవర్తిస్తున్నారు. దళితుల నుంచి ఒక బలమైన నాయకత్వం రూపొందితే తప్ప, పరిస్థితులు చక్కబడేటట్టు లేవు.

కాగా, దళిత జనులు తమ నుంచి ఒక మంచి నాయకత్వాన్ని రూపొందించుకోవలసిన అవసరం ఉంది. ప్రజల హితం కోసం శ్రమిస్తూ వుండే ఒక త్యాగబుద్ధి గల తెలివైన యువకుణ్ని ఎంచుకొని, వివిధ విషయాలలో అతనికి ప్రాధాన్యం ఇస్తూ, అతనిని ముందుంచుకొని కార్యక్రమాలను నిర్వహించడం ప్రారంభిస్తే, ఒక ఉత్తమ నాయకత్వం దానంతట అదే రూపు దిద్దుకొంటుంది.

ఈ విషయంతో అంబేడ్కరీయులు గొప్ప విజ్ఞతనూ, క్రమబద్ధతనూ చూపవలసి ఉంది.

(16) ఏజాతికైనా ఆర్థిక సంపన్నత శరీరం వంటి దైతే, సాంస్కృతిక సంబుద్ధత మనస్సు వంటిది. శరీరం ఎంత లావుగా వున్నా, మనోధారుధ్యం లేకపోతే ఎందుకూ పనికి రాదు.

రాజకీయాధికారం భోగభాగ్యాల కోసమే. భోగభాగ్యాలు ఆర్థిక సమృద్ధి తోడివి. ఏ జాతికైనా ఆర్థిక రాజకీయ సంపన్నత సుస్థిరంగా వుండాలంటే అందుకు సాంస్కృతిక కవచం అతి ముఖ్యం. సాంస్కృతిక పుష్టిలేని జాతికి వ్యక్తిత్వం వుండదు. సొంత మనుగడ వుండదు.

సంస్కృతి అంటే సంగీత సాహిత్య నృత్య నాటక శిల్పకళాది విద్యలు తెలిసి వుండడం, ప్రదర్శించగలగడం.

ఏ మతంలో పుట్టినా, ఏ కాలంలో పుట్టినా, మేధావులైన వాళ్ళంతా మతాతీక కాలాతీత వ్యక్తులే. అట్టి మేధావుల రచనలు, పూర్వ సాహిత్యాలు బాగా చదవాలి. గతం తెలియకుండా వర్తమానాన్ని పాలించలేం. భవిష్యత్తును నిర్మించలేం. అన్నిటికీ భాష ముఖ్యం. మంచి భాషను అలవరచుకోవడానికై పూర్వ సాహిత్యాలు చదవాలి.

దళిత, బడుగు వర్గాలలో అనువంశికంగా ఎంతో సాహిత్యమూ. ఎన్నో కళలూ ఇలువేల్పులుగా వస్తున్నై. వాటన్నిటినీ సముద్ధరించడానికీ, సంస్కృతిని వికసింప జేయడానికి అంబేద్కరీయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. భాషా సాహిత్యాలలో నిష్ణాతులు కావాలి.

అందుకు ట్రస్టులను, సొసైటీలను, సమాజాలను ఏర్పరచుకొని, తమతమ ఆదాయాల నుంచి కొంత శాతాన్ని ప్రత్యేకించడం ద్వారా అట్టి సంస్థలను పోషించు కోవాలి. సార్వజనిక స్థాయికి తమను తాము పెంచుకోవాలి.

(17) సవర్ణ కులాల వాళ్లు తమ కులాల పేర్లను బాహాటంగా ప్రకటించు కొంటూ గర్వపడుతుండడం మనం చూస్తూనే వున్నాం. దళితులు మాత్రం ఎందుకు చెప్పుకో గూడదు? తప్పకుండా చెప్పుకోవాలి.

కులాలన్నీ ఒకే స్థాయికి వస్తే తప్ప కుల నిర్మూలన సాధ్యం కాదన్న సత్యాన్ని గుర్తించాలి. క్రింది మట్టమూ, మీది మట్టమూ కలిసి సమమట్టమైనప్పుడే అభ్యుదయ నావ సాఫీగా పురోగమించ గలుగుతుంది.

(18) ఆర్థిక సాంఘిక విద్యా రాజకీయ రంగాలలో అభివృద్ధిని సాధించి, దళితులు సవర్ణ కులాల స్థాయికి ఎదిగినప్పటికీ కూడ కులనిర్మూలన జరగదు.

కుల నిర్మూలన జరగాలంటే కులాంతర వివాహాలు అసంఖ్యాకంగా జరగాలి. కొద్ది కాలంలోనే కుల వ్యవస్థ తుడిచిపెట్టుకుపోవాలంటే కులం మార్పిడి చట్టం రావాలి. అట్టి చట్టాన్ని పార్లమెంటు చెయ్యవలసి వుంది. అందుకు అంబేద్కరీయులు తీవ్రంగా కృషి చెయ్యవలసి ఉంది.

## జాతీయ సోషలిస్టు పార్టీ

(19) దళితులకు రిజర్వేషను లివ్వడం వల్ల ఉద్యోగాదులలో సామర్థ్యం దెబ్బ తింటున్నదన్న ప్రచారంలో రవ్వంతకూడ నిజంలేదు. అది పచ్చిమోసపు ప్రచారం. దానిని అంబేద్కరీయులు తీవ్రంగా ప్రతిఘటించ వలసి వుంది. ఈనాడు ఇతరుల కంటే తాముసమర్థులమన్న వాస్తవాన్ని ప్రచురపరచుకో వలసి వుంది.

తమ సామర్థ్యాన్ని ఇతోధికంగా పెంచుకోవడానికి సర్వ విధాలా ప్రయత్నించ వలసి వుంది.

(20) భారత రిపబ్లికు అవతరించి, దళితులకు రిజర్వేషనులు కల్పించి

ఇప్పటికి (1985 నాటికి) ముప్ఫై అయిదేళ్లయినై. పార్లమెంటుకు, అసెంబ్లీలకు ఇప్పటి వరకు ఎన్నిసార్లు ఎన్నికలు జరిగాయో లెక్క కట్టండి.

ఈ అన్ని ఎన్నికలలోను, ఏ పార్టీ కాని, జనరల్ సీటుకు దళితకులపు అభ్యర్థిని నిలబెట్టిన సందర్భా లెన్ని?

1967లో కాబోలు అప్పటి మాజీ ముఖ్యమంత్రి, తాజా కేంద్ర పరిశ్రమల మంత్రి దామోదరం సంజీవయ్య గారు కర్నూలు జనరల్ సీటుకు నిలబడితే, గెలవ నిచ్చారా? కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిపాలై వున్నాడన్న సానుభూతి, మానవత్వం కూడా లేకుండా ఓడించి పారేశారు కాదా?

రిజర్వేషను పద్ధతి శాశ్వతంగా వుంటుందా? అది రద్దయిన తర్వాత, ఎంత మంది దళితులు పార్లమెంటుకూ, అసెంబ్లీలకూ ఎన్నిక కాగల్గుతారు?

తమ జనాభాకు తగిన శాతంలో తమ ప్రతినిధులు ఎన్నిక కావలసి వుంది. అందుకు తగిన సాంఘిక పరివర్తన జరిగే వరకు రిజర్వేషనులు కొనసాగేటట్టు దళితులు జాగ్రత్త పడాలి.

రిజర్వేషనులు రద్దయిన తరువాత తగినంత మంది దళిత కులాల ప్రతినిధులు శాసన సభలకు ఎన్నిక కాగలరో, లేదో తెలుసుకోవడం కోసం ఈ లోపలనే ప్రయత్నాలు జరగాలి. జనరల్ నియోజక వర్గాల నుంచి దళిత కులాల విద్యావంతు లను వివిధ పార్టీలు నిలపడం, గెలిపించడం జరగాలి.

అందుకు అనుకూలంగా సవర్ణ కులాల దృక్పథంలో మార్పు రాకపోతే దేశంలో వుండే అన్ని కులాలకు కూడ కులప్రాతినిధ్యాలు ఏర్పాటు చేయవలసి వుంది. ఆయా కులాల జనాభాను బట్టి బ్రాహ్మల కిన్ని సీట్లు, రెడ్లకిన్ని సీట్లు, హరిజనుల కిన్ని సీట్లు, కావుల కిన్ని సీట్లు అంటూ కుల ప్రాతిపదికపై, రిజర్వేషనులను అమలుపరచ వలసి వుంటుంది. జాతీయ సమైక్యానికి ఇది ఎంత విషతుల్యమో సుస్పష్టమే. సవర్ణ కులాల వాళ్లు భారత జాతిని ఇట్టి దుస్థితికి దిగజార్చరనే నా విశ్వాసం.

రిజర్వేషనులు రద్దయే నాటికి దళిత బడుగు కులాల ప్రతినిధులు వివిధ శాసన సభలలోనూ బహు సంఖ్యలో వుంటారని కూడ నేను విశ్వసిస్తున్నాను.

(21) అంబేద్కరు ఆకస్మికమరణానికి ఎంతగానో దుఃఖిస్తూ డాక్టర్ రామ్మనోహర్ లోహియా 1.7.1957న ఒక లేఖలో ఇలా అంటాడు :

"It had always been my ambition to draw him (Dr. Ambedkar) in to our fold, not only organizationally but also in full ideological sense, and that moment seemed to be approaching. But death came early."

"Dr. Ambedkar was to me a great man in Indian politics and apart from Gandhiji, as great as the greatest of caste Hindus. This fact had always given me solace and confidence that the caste system of Hinduism could one day be destroyed."

"I wish that the Scheduled Castes of India were persuaded to make a rational estimate of the last 40 years of Indian politics. I wish they continue to have the symbol of Dr. Ambedkar for homage and imitation, Dr. Ambedkar with his independence but without his bitterness, Dr. Ambedkar who would act so as to be a leader of all India and not Harijans only".

**(Rammanohar Lohia, THE CASTE SYSTEM)**

అంబేద్కరు షెడ్యూల్డు కులాల ఫెడరేషన్‌ను రద్దుచేసి, భారత రిపబ్లికన్ పార్టీని ఏర్పాటు చేస్తున్న తరుణంలో (1956, సెప్టెంబరు 30) రాజకీయంగా అంబేద్కరును తమతో కలుపుకోవాలనీ, దళిత బడుగు వర్గాల ప్రాబల్యంతో ఒక పటిష్ఠమైన జాతీయ సోషలిస్టు పార్టీని నిర్మించాలనీ లోహియా ఎంతగానో ప్రయత్నించాడు. వారిద్దరి మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను పరిశీలిస్తే, అంబేద్కరు కూడ అందుకు అనుకూలంగానే వున్నట్టు కనిపిస్తుంది. అంబేద్కరు మరి కొంత కాలం జీవించి వున్నట్లైతే, ఆ విధమైన, ఒక నిజమైన అఖిల భారత పార్టీ ఏర్పడి వుండేది.

అయితే, ఎప్పటికైనా అట్టి నిర్మాణం జరగవలసే వుంటుందన్న సత్యాన్ని అంబేద్కరీయులు గుర్తించవలసి వుంది. రిపబ్లికన్ పార్టీని అట్టి సారజనిక స్థాయికి పెంచలేక పోతే, అట్టి మరొక పార్టీని అంబేద్కరీయ దృక్పథానికి తగిన రీతిలో నిర్మించవలసి వుంది.

## 15. మనది నైతిక పోరాటం

పోరాట విధానంలో మార్క్సిజానికి, అంబేద్కరిజానికీ తేడా లేనట్టే కనిపించ వచ్చు. మానవ హక్కుల సాధన కోసం నిరంతర పోరాటం తప్పదనడంలో ఈ రెండు ఇజాలూ ఏకీభవిస్తే. అయితే, పోరాట పద్ధతిలోనూ, మానవతా వికాస అవకాశంలోనూ రెండింటికీ తేడా వుంది.

సొంత ఆస్తి పద్ధతిని రద్దుచేసే విషయంలో ఎంత వరకూ సొంత ఆస్తి వుండాలి, ఏ పరిమితి వెలుపల సొంత ఆస్తి వుండకూడదు, అనే ప్రశ్నలకు మార్క్సిజంలో స్పష్టమైన జవాబులున్నట్టు లేదు. మార్క్సిజాన్ని అమలు జరుపుతున్న దేశాలలో అంత అస్పష్టతకు అదే కారణం.

వ్యక్తిగతావరణలో కూడ సొంత ఆస్తిని నిషేధిస్తే, వ్యక్తికి మానవ ప్రజ్ఞా వికాసానికి ప్రోత్సాహం వుండదు. సామాజిక స్థాయిలో మాత్రమే సంపద జాతీయ చేయబడాలి. అంబేద్కరిజంలోని ప్రత్యేకత ఇదే.

సొంత ఆస్తి నిషేధాన్నీ, సమ సమాజ నిర్మాణాన్నీ బౌద్ధమతం ద్వారా కూడ సాధించవచ్చుననీ, అయితే బౌద్ధమతం అహింసా మార్గావలంబి కనుక, మార్క్సిజం కంటే బౌద్ధ మతమే వరణీయ మనీ అంబేద్కరు భావం. ఆదరణ కష్టమైనా, ఫలితాలు సాధించడంలో ఆలస్యమైనా, బుద్ధుని అహింసా మార్గమే శ్రేష్ఠమైనట్టిదంటాడాయన.

మానవులలో మానసికంగా మార్పు రావలసివుంది. అట్టి మార్పు అహింసాత్మకంగా, స్నేహ పూర్వకంగా, పరస్పర రావగాహనతో వచ్చినప్పుడే అభ్యున్నతి శాశ్వతమైనట్టిదిగా వుంటుంది.

అయితే, సొంత ఆస్తి విషయంలో బుద్ధుడి సంస్కరణ కూడా పరిమితమైనట్టిదే. ఒక్క భిక్షువులకు మాత్రమే సొంత ఆస్తులుండ కూడదని నిషేధించాడు బుద్ధుడు. భిక్షువులు ఎంతమంది వుంటారు? తక్కిన సమాజం మాటేమిటి? పైగా, మహారాజు లను, మహా ధనికులను భిక్షు సంఘానికి వెలుపలనే వుంచేసి ఆశీర్వదించి ప్రోత్సహిం చాడు బుద్ధుడు. అంబేద్కరిజానికి అది విరుద్ధం.

సొంత ఆస్తి నిషేధం, సర్వమానవ సమానత్వం, కుల వర్గ భేదరాహిత్యం ఒక్క భిక్షు సంఘానికే పరిమితమై వుండ కూడదు. యావత్సమాజానికీ వర్తింప జేయబడాలి.

కార్మిక ప్రభుత్వాలు ఏర్పడి, సంపద అంతా జాతీయం చేయబడిన తర్వాత, ఆ పైని చేయవలసిందేమిటో మార్క్సిజం వివరించినట్టు లేదు.

దుఃఖ నివారణకు కోరికలు చంపుకోవాలనుకున్నాడు బుద్ధుడు. కోరికలను చంపడానికి వందల కొలది కఠిన నిబంధనలను విధించాడు. బుద్ధుణ్ని మినహాయిస్తే, ఆ నిబంధనలన్నిటినీ పాటించినవాడు మరొక డెవడైనా వున్నాడా అనేది సందేహాస్పదం.

అయినా, సహజ జీవన ధర్మాలకు విరుద్ధమైన ఆ నిబంధనలన్నీ ఎందుకు? అసహజమైన నిబంధనలకు సహజమైన కోరికలు చస్తాయా? కోరికలను చంపుకొన్న జీవితం నిజమైన జీవితం ఎలా అవుతుంది?

**కోరికలను చంపుకోవడం అంబేద్కరిజం కాదు**
**న్యాయమైన కోరికలను తీర్చుకోవడం అంబేద్కరిజం.**
**అన్నం కావాల నేది ఒక కోరిక**
**దానిని చంపగూడదు, తీర్చాలి.**

అస్పృశ్యత పోవాలనేది ఒక కోరిక. అది వట్టినే పోతుందా? అందుకోసం పోరాడాలి కదా? అందరితో సమానంగా, సమాన గౌరవంతో బ్రతకాలన్నది ఒక కోరిక. అది పూరికనే తీరుతుందా? అందుకు ఎంతో కృషీ, పోరాటమూ చెయ్యవలసి వుంది కదా! కృషీ, పోరాటమూ లేకుండా దళితులు తమ నికృష్ట స్థితి నుంచి బయట పడగలరా? అభ్యున్నతిని అందుకోగలరా?

కాగా, బౌద్ధమత పరిధిని మించి దళితజనం నిర్వహించవలసిన కార్యక్రమం ఇంకా ఎంతో వుంది.

మానవుడు ఆనందంగా జీవించడానికి తిండీ బట్టా మాత్రమే చాలవనీ, అతనికి విశాలమైన మానసికావకాశం అవసరమనీ, అట్టి విశాల కార్యరంగం లేక పోతే వికసించడమే వుండదనీ అంబేద్కరు అభిప్రాయం. ఇది మార్క్సిజంతోనూ, బుద్ధిజం తోనూ కూడ భేదిస్తున్నట్టిది. అందుకే దీనిని అంబేద్కరిజం అన్నాను. ఈ మూడింటి మధ్యా సూక్ష్మమైన భేదాలున్నై. తక్కిన రెండు ఇజాల కంటే అంబేద్కరిజం శ్రేష్ఠమైనట్టిది.

"బ్రహ్మం సత్యం జగం మిధ్య అనే సూత్రాన్ని శంకరాచార్యుడు వేదాంతం వరకే అన్వయించి ఊరుకున్నాడు. దానిని సామాజిక వ్యవస్థకు కూడా అన్వయించి వుంటే సర్వమానవ సమానత్వం ఆనాడే నెలకొనివుండేది" అన్నాడు అంబేద్కరు.

హిందూమతంలో అంబేద్కరు ప్రధానంగా ద్వేషించింది అస్పృశ్యతనూ, అసమానతనూ మాత్రమే. తాను హిందువుగా చావనని శపథం చేసింది మొదలు ఇరవై సంవత్సరాల వరకు మతం మారకుండా ఆయన వేచివున్నది కూడ ఆ రెండు దురాచారాలను హిందూ మతం యుద్ధ ప్రాతిపదికపై నిర్మూలించుకొంటుం దన్న ఆశతోనే.

అస్పృశ్యతా నివారణ కృషి నత్త నడక నడవడం, కుల విద్వేషాలు రోజు రోజుకూ పెరిగి పోతుండడం, ఆర్థిక అసమానత్వం మరీ రాక్షసావతారం [illegible]డం ఆయనను నిరాశా నిస్పృహలలో ముంచివేసినై.

"దేశ సమస్యలకు రాజకీయాలే మొదలూ తుదీ కాకూడదు. ఏ విషయాన్నైనా అన్ని కోణాల నుంచీ క్షుణ్ణంగా పరిశీలించి, అవగాహన చేసుకొని, అప్పుడు బలహీనుల కోసం, బడుగు వర్గాల కోసం, దళిత జనోద్ధరణ కోసం పోరాడాలి." అంటూ హెచ్చరించాడు అంబేద్కరు. పరిస్థితులను బట్టి పద్ధతులను మలచుకొంటూ పోరాడాలన్నాడాయన.

## జీవిత కేంద్రం కోరికే

ఇక్కడ మనం ఒక వాస్తవాన్ని గుర్తించవలసి వుంది.

అంబేద్కరు మార్గం పోరాట మార్గం. పోరాడ కుండా ఏదీ సిద్ధించదు. అన్యాయంగానో, ఆచారపరంగానో ఒక వర్గం తోటి వాళ్ల శ్రమను దోచుకొని, వాళ్లను బలహీనులుగా, బానిసలుగా చేసుకొని, సంపదనంతా కూడబెట్టుకొని అనుభవిస్తున్నప్పుడు, ఆ వర్గం నుంచి అట్టి సంపదను ప్రజలు స్వాధీనం చేసుకోవాలంటే అది సులభ సాధ్యమా? పోరాడకుండా జరిగే పనేనా? అట్టి పోరాటాన్ని ఎప్పుడైనా బౌద్ధమతం జరిపిందా?

బౌద్ధమతం పోరాట మతం కాదు. అంబేద్కరిజం విధ్యుక్త ధర్మంగా పోరాటమే కలది.

మార్క్సిజం కూడా పోరాట మతమే. అయితే, అది రెండు వర్గాల మధ్య పోరాటం. అక్కడ అహింసా పద్ధతి పనిచెయ్యదు. పెద్దపులి పేరంటాలకు పెట్టదు. దాని పంజాలోని సంపదను లాగుకొని తక్కిన బడుగు జీవులకు సమానంగా అందజేయవలసి నట్టిదది.

ధనిక వర్గం, పెట్టుబడిదారీ యాజమాన్యం పెద్దపులి వంటిది. దాని ముందు సత్యాహింసలు పని చెయ్యవు. అందుకే, తన వర్గ పోరాటంలో హింసను నిషేధించ లేదు మార్క్సు. అంబేద్కరు పోరాటం అందుకు భిన్నమైనట్టిది.

విజయకాంక్షతో రెండు వర్గాల మధ్య జరిపే రక్తపోరాటం కాదు

అంబేద్కరుది. ఒకే రక్తజాతిలో ఒక వర్గంపై జరుగుతున్న హింసను తొలగించడం కోసం మానవత జరిపే ధర్మ పోరాటం అది.

అన్న తమ్ముణ్ని వెలిబెట్టి అమానుషంగా హింసిస్తున్నాడు. హింసించబడుతున్నవాడు తన తమ్ముడే అనే వాస్తవం అన్నకు తెలుసునో లేదో. తెలియకపోతే తెలియజెప్పవచ్చు. సాక్ష్యాధారాలతో నిరూపించవచ్చు. పెద్దలముందు పెట్టి న్యాయాన్ని పొందవచ్చు. ధిక్కరించి సమానహక్కులు సాధించుకోవచ్చు. తన తమ్ముడని తెలిసే అతణ్ని అన్న స్వార్థంతో పీడిస్తూ వుంటే, న్యాయ ధర్మ హేతు వాదాలను తిరస్కరిస్తూ వుంటే, అప్పుడు దండోపాయం, హింసాత్మక పోరాటం అవసరమౌతుంది.

సవర్ణ కులాలపై అవర్ణ కులాలు, స్పృశ్య కులాలపై అస్పృశ్య కులాలు సమైక్యం కోసం, సాంఘిక న్యాయం కోసం జరిపే పోరాటం వర్గపోరాటం వంటిది కాదు.

కనుక, మానవాభ్యుదయ విప్లవానికి జ్యోతి అంబేద్కరు. సమాజంలోని మానవ కల్పితమైన అధర్మాలనూ, అన్యాయాలనూ తొలగించి, దుఃఖాన్ని నివారించి, విశ్వ మానవ సంక్షేమాన్ని సాధించడం అంబేద్కరు ధ్యేయం. ఆయన కృషి అంతా, ఆయన పోరాటం అంతా అందుకొరకే. ఆయన మతం మారడం కూడ అందులోని ఒక భాగమే.

పాతపద్ధతి ఆచారవ్యవహారాలతో ముసలి పెద్దల బూజుపట్టిన పెత్తనాల క్రింద అలసిపోయిన సమాజం మార్పు కోరినప్పుడు, అట్టి మార్పుకు నాయకత్వం వహించిన వాడే, ప్రాతను విజయవంతంగా ఎదిరించిన వాడే క్రొత్తమలుపుకు, నూతన వ్యవస్థకు మూలపురుషుడౌతాడు. అట్టి ధీరుణ్ణే యుగ కర్త అనో, ప్రవక్త అనో అంటాం... .

అయితే ఆ విధంగా మారిన వ్యవస్థ కూడా ఏదో ఒక నాటికి పాతబడి పోగలదనీ, సమాజ ప్రగతి మళ్లీ మరొక మలుపు కోరుతుందనీ విస్మరించకూడదు.

ఈ అన్నిటినీ గమనంలోకి తీసికొని చూచినప్పుడు, మానవ జాతి పురోగమనం అలసి ఆగిపోయిన దశలో, అది ఏదో ఒక క్రొత్తమలుపును కోరుతున్న తరుణంలో అంబేద్కరు ఎలా ముందుకు దూకాడో, జాతికి ఎలా మార్గదర్శకుడయ్యాడో చరిత్రే విస్పష్టం చేస్తూ వుంది.

చరిత్రే ఒక గొప్ప వ్యక్తిని సృష్టిస్తుందా, ఒక గొప్ప వ్యక్తే చరిత్రను సృష్టిస్తాడా అనే ప్రశ్నకు జవాబు అంబేద్కరే. చరిత్ర మార్పును కోరుతున్నప్పుడు అట్టి మార్పుకు నాయకత్వం వహించి సాధించిన దీక్షా ధీరుడే యుగకర్త అవుతాడు.

ఈ యుగాన్ని అంబేద్కరు యుగం అంటున్నాను అందుకే.

దళిత ప్రజలు తామెందుకు బ్రతుకుతున్నారో, మానవులుగా తమ హక్కు లేమిటో, తెలుసుకోలేనంతటి అజ్ఞానంలో తరతరాలుగా అణచివుంచబడిన వాళ్లు కనుక, అంబేద్కరు ఎంత ప్రయత్నించినా వేగిరం చైతన్యవంతులు కాలేకపోయారు. అన్ని కులాలను సమదృష్టితో చూచే విదేశీ ప్రభుత్వం వుండగానే తమకు కావలసిన హక్కుల్ని సాధించుకోలేక పోయారు.

సవర్ణులు ఎంత అహంకారులో అవర్ణులు అంత అజ్ఞానులు. గాంధీకి, అంబేద్కర్‌కి లక్ష్యాలలో తేడాలేదు. హరిజనోద్ధరణ కోసం గాంధీ కృషి చేసినవాడే. హైందవ సమైక్యం కోసం, బలమైన జాతీయత కోసం అంబేద్కరూ దీక్ష వహించిన వాడే.

జైనమతం, బౌద్ధమతం పుట్టి వేల సంవత్సరాలయింది కదా, ఎంత మంది దళితులు ఆ మతాలలో చేరారు ?

క్రైస్తవ మతం, ఇస్లాం మతం మన దేశానికి వచ్చి కూడా వందల సంవత్సరాలు గడిచాయి. ఆ రెండు మతాలవాళ్లూ ఈ దేశంలో రారాజులై పరిపాలించారు. తమ తమ మతాలలో దళితులను చేర్చుకోడానికి ఎంతో ప్రయత్నించారు. ఎన్నో ఆశలు చూపారు. అయితే ఏం జరిగింది? ఎంత మంది దళితులు మతాంతరులయ్యారు?

అస్పృశ్యతకు, కులతత్వానికి, దారిద్ర్యానికి, సాంఘిక హైన్యదైన్యాలకు మతాంతరీకరణ తగిన చికిత్స కాదనేది స్పష్టపడుతూనే ఉంది, మహామేధావి అయిన అంబేద్కరుకు ఈ వాస్తవం తెలియనిది కాదు. ఉన్న చోటనే ఉంచేసే మత్తుమందు మతం. సాంఘిక న్యాయాన్నీ, రాజకీయ అధికారాన్నీ సాధించడానికి చేయవలసింది పోరాటం.

దేశమంతా, ప్రతి గ్రామంలోనూ మెజారిటీ కులంగా అలముకొని వున్న దళితులు ఇతర కులాలతో పాటు మెజారిటీ వ్యవస్థలో కలసిపోవలసి ఉంది.

ఇతర మైనారిటీ వర్గాలవంటివాళ్లు కాదు దళితులు. వీళ్లు మెజారిటీ వర్గం వాళ్లు. ఇబ్బందులుంటే పోరాడి తీర్చుకోవలసిన వాళ్లు.

మొత్తం దేశం మీద, సమస్త భారతీయ సంస్కృతి మీద అనువంశికమైన అధికారం కలవాళ్లు దళితులు. తమ అధికారాన్ని వదులుకోలేరు. అజ్ఞానం వల్ల అట్టి అధికారాన్ని వదులుకోడానికి వాళ్లలో ఎవరైనా సిద్ధపడితే, మెజారిటీ సమాజం సహించదు. కాలం అంగీకరించదు.

# 16. బౌద్ధమూ - హైందవమూ

హిందూ మతాన్నీ, బౌద్ధమతాన్నీ నిశితంగా పరిశీలించి పోల్చిచూచినప్పుడు, బౌద్ధం హైదవంనుంచి పుట్టుకవచ్చిన ఒక శాఖ మాత్రమే అన్న వాస్తవం స్పష్ట పడుతుంది.

గౌతముడు సంసారాన్ని వదిలేసి సన్యసించిపోవడానికి కారణాలెన్నైనా వుండవచ్చు. వ్యాధి, వృద్ధాప్యం, మృత్యువు వంటి సహజపీడల నుంచీ, పరస్పరద్వేషం, స్పర్థ, హింస, యుద్ధం, వధ వంటి స్వార్థోద్రేకాల నుంచీ మానవజాతిని కాపాడాలనే తహతహ, అందుకు ఒక మార్గాన్ని కనుగొనాలనే తపన గౌతముడి మహాభినిష్క్రమణకు ప్రధాన హేతువుగా కనిపిస్తుంది.

తన లక్ష్యసాధన కోసం గౌతముడు అనేక మంది హైందవ సాధకుల వద్ద శిష్యరికం నెరపి, యోగనిష్ఠాదు లభ్యసించి, ఏదీ సంతృప్తిని కలిగించక, చివరకు ఒక రావిచెట్టు నీడకు చేరి, అక్కడ మహా ధ్యానంలో నిమగ్నమయినాడు.

మానవుణ్ని సంసార విషవలయం నుంచి సముద్ధరించడానికి ఇంతవరకూ చెప్పబడివున్న పద్ధతులను ఆధారంగా చేసుకొని తన చింతన, ధ్యానం, తపస్సు కొనసాగాయి. దాని ఫలితంగా ఆయనకు జ్ఞానోదయ మయింది.

ఇదీ మనకు చరిత్ర చెపుతున్న గౌతముడు బుద్ధుడైన వికాస క్రమం.

ఆయనకు జ్ఞానోదయమైంది. అయితే ఏమిటి ఆ జ్ఞానోదయం ? (1) లోకంలో దుఃఖ మున్నదని తెలియడం (2) దుఃఖానికి కారణం కోరిక అని తెలియడం (3) దుఃఖాన్ని తొలగించుకోవాలంటే కోరికను తొలగించుకోవాలని తెలియడం.

ఈ మూడూ అంతకు ముందునుంచీ అందరికీ తెలిసిన సత్యాలే. వేద కాలం నుంచీ చింతనాపరుడైన ప్రతి రుషీ చెప్పినట్టివే. ఇందులో బుద్ధుడు కొత్తగా కనిపెట్టిన దేమీ లేదు.

ఇందులో కోరికను తొలగించుకోవడమనేది ప్రధానాంశం. లోకంలో ఏమతం, ఏ ప్రవక్త ఎన్ని నీతులు చెప్పినా, ఎన్ని నిషేధాలు విధించినా, ఎన్ని నిర్భంధాలు సూచించినా కోరికను చంపుకోవడం కోసమే. ఇందుకు బుద్ధుడు సూచించిన మార్గం కూడ అంతటి కఠినమైనట్టిదే. సులభతర మేమీ కాదు. పరిశీలించండి.

(1) త్రిశరణాలూ, బుద్ధ వందనాలూ బుద్ధుడు నెలకొల్పిన సంఘానికీ, ప్రతిపాదించిన ధర్మానికీ, సాక్షాత్తు బుద్ధుడికీ శరణాగతి చెప్తుతున్నట్టివి. శరణాగతి అంటే ఆత్మార్పణం. దీనినే హిందూమతం ప్రపత్తి అంటుంది. మరొక ఆలోచన లేకుండా భగవంతుడికి భక్తుడు తనను తాను సమర్పించుకోవడం భక్తికి పరాకాష్ఠ. ఇక్కడ విశేషమేమిటంటే, హిందూమతంలోని భగవంతుని స్థానంలో బౌద్ధమతం మానవమాత్రుడైన బుద్ధుణ్ని నిలుపుతున్నది.

బుద్ధుడికి దేవుడు లేడు. బౌద్ధులకు బుద్ధుడే దేవుడయాడు.

(2) బుద్ధుడు ప్రజల కిచ్చిన ప్రాథమిక నీతి సూత్రాలు పంచశీలాలు. వ్యభిచారం చెయ్యను, అసత్యం చెప్పను, ప్రాణహింస చెయ్యను, దొంగతనం చెయ్యను, సురాపానం చెయ్యను అనబడే అయిదూ.

బౌద్ధమతాన్ని సీక్వరించే వాళ్లు ఈ ఐదు నిషేధాలను తప్పకుండా పాటిస్తామని శపథం చెయ్యవలసి వుంది.

ఈ ఐదూ కేవలం సాంఘికస్థిరత్వం కోసం ప్రతి పెద్దమనిషీ చెప్పేవే. ప్రతి సమాజమూ మొత్తం మీద అనుసరించేవే. వీటిని చెప్పడంలో కొత్తతనంగాని, గొప్పతనంగాని ఏమీ లేదు. వీటి అమలు సాధారణంగా ధర్మనిష్ఠకోసం కాక, ప్రతి క్రియా భయంవల్లనే జరుగుతూ వుంటుంది. ఇవి బలవంతుల చేతా, ధనవంతుల చేతా అతిక్రమించబడుతూనే వున్నై. ప్రపంచంలో రక్షక దళాలకు, న్యాయస్థానాలకు జీవనాధారాలు ఇవే. ఈ విషయంలో బౌద్ధం ప్రత్యేకత ఏమీ లేదు.

(3) అష్టాంగ మార్గం : మానవ జీవితాన్ని క్రమబద్ధం చెయ్యడానికి అష్టాంగ మార్గాన్ని బోధించాడు బుద్ధుడు. ఈ అష్టాంగాలు ఇవి : సమమైన దృష్టి, సమమైన సంకల్పం, సమమైన హక్కు, సమమైన జీవనం, సమమైన ప్రయత్నం, సమమైన జాగ్రత్త, సమమైన ధ్యానం. ఇవి కూడా నీతి బోధలే. క్రొత్తేమీ లేదు. అంతకుముందు

నుంచీ చెప్పబడుతూ వస్తున్నట్టివే. హిందూ మతంలోని యోగాంగాలు ఎనిమిదింటి తోనూ వీటిని పోల్చి చూడవచ్చు.

(4) దశ విధ పారమితులు : మానవుడు సజ్జనుడిగా బ్రతకడానికి ఈ పది నిబంధనలను సూచించాడు బుద్ధుడు, వేళతప్పి భుజించను, అసభ్యకరంగా ప్రవర్తించను, అవినీతి పనులు చెయ్యను, అలంకరణలు చేసుకోను, భోగాలజోలికి పోను, వెండి బంగారాలపట్ల కోరిక కలిగివుండను, దాన ధర్మాలు చేస్తాను, శాంతి సహన గుణాలు కలిగి వుంటాను, జీవులపట్ల కరుణ ప్రదర్శిస్తాను, చరాచరాలపట్ల మైత్రి పాటిస్తాను అనేవి.

ఈ పారమితులు ఒక్కొక్కచోట ఒక్కొక్కరకంగా చెప్పబడ్డాయి. ఎలా చెప్పినా ఇవన్నీ కూడా వట్టి నీతులూ, ఉపదేశాలూ మాత్రమే. పరిమితి అన్నా పారమితి అన్నా అర్థం ఒకటే. హద్దు అని.

ఇవికాక, బౌద్ధ సంఘంలోని శ్రమణ, పరివ్రజ, ఉపసంపద, భిక్షు, ఉపాధ్యాయ మొదలైన వర్గాలకు బుద్ధుడు విధించిన నియమ నిబంధనలు ఇంకా 250 వరకూ వున్నై. ఈ అన్నింటిలోనూ అవే నియమ నిబంధనలు పునరావృతమవుతూ వుంటై. ఇవన్నీ కూడ కొద్దిపాటి భాషా పద భేదాలతో హిందూమతం నుంచి తెచ్చుకొన్నట్టివే.

బుద్ధుడు భిక్షువులకు విధించిన ప్రత్యేక నియమ నిబంధనల క్రింద బ్రహ్మచర్యం పాటిస్తానని, దొంగతరం చెయ్యనని, గొప్పలు చెప్పుకోనని, జీవ హింస చెయ్యనని, సొంత ఆస్తిని కలిగివుండనని శపథం చెయ్యవలసి వుంది.

ఏ భిక్షువైనా అంగవస్త్రం, ఉత్తరీయం, అంగీమాత్రమే కలిగి వుండాలి. ఇవి కేవలం శరీరాన్ని ఎండ, చలి, వానల నుండి కాపాడుకోవడం కోసమే. ఒక భిక్షాపాత్ర, ఒక మంగలి కత్తి, ఒక సూది, ఒక నీళ్ళ పిడత మాత్రమే కలిగివుండాలి. పేదరికాన్ని మాత్రమే అనుభవిస్తానని శపథం చెయ్యాలి. తిండికోసం భిక్ష మెత్తుకోవాలి. భిక్షాటనమే జీవనాధారంగా వుండాలి. ఒక్క పూట మాత్రమే తినాలి. సంఘం కోసం విహారం లాంటిదేదీ లేనిచోట చెట్టుక్రింద మాత్రమే నివసించాలి.

ఈ నియమ నిబంధనలలో దేనిని అతిక్రమించినా అట్టి భిక్షువు శిక్షార్హుడౌ తాడు. సంఘం నుంచి బహిష్కరింపబడతాడు. ఇవన్నీ కాక, భిక్షువు మరొక 26 + 92 + 75 నియమాలను కూడ పాటించవలసి వున్నదని అంబేద్కరు వ్రాసిన

"బుద్ధుడూ అతడి ధర్మమూ" అనే గ్రంథంలో చెప్పబడి వుంది.

ఇవన్నీ కూడ హిందూ మతంలోని బ్రహ్మచర్యాది ఆశ్రమాలకు, వివిధ సాధకులకు, రాజయోగులకు. సన్యాసులకు, బ్రాహ్మణులకు విధించబడిన నియమ నిబంధనలే.

ఈ నియమ నిబంధనలన్నిటికీ హిందూమతంలో విశిష్ఠమైన, నిర్దిష్ఠమైన ప్రయోజనాలున్నై. అందులో అగ్రగణ్యమైంది మోక్షం. బౌద్ధమతంలో కష్టానికి తగిన ఫలితాన్ని బుద్ధుడు చూపడం లేదు. మోక్షాన్నే నిర్వాణం అన్నాడు బుద్ధుడు. అదేమిటో స్పష్ట పరచలేదు. బహుశా అందుకు కారణం, తనకు కూడా సరైన అవగాహన లేకపోవడమే కావచ్చు.

ఆత్మ లేదన్నాడు బుద్ధుడు. పునర్జన్మ వున్నదన్నాడు. అందుకు ఆయన చేసిన తర్కం, చూపిన పోలికలు తృప్తికరంగా లేవు. హిందూమత బోధలకంటే, తన బోధలే ఎక్కువ విశిష్టమైనవిగా చూపడం కోసం ఆయన మరీ తొందర పడ్డాడనిపిస్తుంది. ఆధ్యాత్మిక గురువుగా, మానవజీవిత మార్గదర్శిగా ఆయన విఫలుడైంది అందుకే కావచ్చు.

ఇక, వ్యక్తిగా చూస్తే మాత్రం ప్రపంచ మానవులలో అత్యున్నతుడైన మానవుడు బుద్ధుడు, ఆయన వ్యక్తిత్వం, త్యాగం, వర్చస్సు, శీలం, నియమ నిష్ఠలు, పరోపకార పారీణత, మానవ కారుణ్యం, సత్యవ్రతం, ప్రజ్ఞానం, త్రికరణ శుద్ధి, జన సమ్మోహన శక్తి అన్నీ అత్యున్నతమైనట్టివే.

అంతటి ఉన్నత స్థాయి ఆచార్యత్వం కూడ మానవ జాతిలో హృదయ పరివర్తనను గాని, సాంఘిక విప్లవాన్నిగాని, సర్వసమానత్వాన్నిగాని సాధించలేక పోవడానికి కారణం సరైన జీవిత పరమార్థాన్ని చూపడంలో ఆయన విఫలుడు కావడమే. ఆధ్యాత్మిక పారదర్శకత లోపించడమే.

అంబేద్కరు "బుద్ధుడూ అతడి ధర్మమూ" చదువుతున్నప్పుడు బుద్ధుడిలోని ఆ లోపం సర్వత్రా మనకు కనిపిస్తుంది. అంతటి అంబేద్కరు కూడ అన్ని అంశాల లోనూ బుద్ధుణ్ని సమర్థించ లేకపోయాడు.

బుద్ధుడిని గురించి, బౌద్ధమతం గురించీ నేనింతగా చెప్పడానికి కారణం బౌద్ధమతంలోని గొప్పతనం బుద్ధుడి పర్సనాలిటీకి సంబంధించినట్టిదనీ, ఇతర

మతాలలో లేని విశిష్టత ఏదీ బౌద్ధమతంలో లేదనీ స్పష్టం చేయడానికే. అన్ని మతాలవలెనే బౌద్ధం కూడా ఆచరణలో విఫలమైనట్టిదే.

ప్రతి మతమూ జీవనదికి కట్టిన ఒక ఆనకట్టే.
వరదనీటి విడుదలకు అవకాశం ఎంతగా వుంటే
అంతగా వుంటుంది ప్రయోజనం దాని నిలవ నీటికి;
కట్ట ఎత్తు పెంచేకొలదీ కరకట్టలు కొట్టుకు పోతై
నీరు పొంగి పారేకొలదీ ఏళ్లూ ఊళ్లూ ఏకమౌతై.

ఏ మతమైనా ఆధ్యాత్మిక మైనట్టిదే,
అది రాజకీయాలలోకి చొరబడరాదు,
దానికి సాంఘికంగా ప్రత్యేక హక్కులుండ కూడదు.
అన్యాయాన్నీ, అసమత్వాన్నీ నిర్మూలించేదే అంబేద్కరిజం,
జీవిత పూర్ణ వికాసానికి ధ్రువతారే అంబేద్కరిజం.

# 17. బుద్ధుడి కంటె గొప్పవాడు

**నీతులు మూడు రకాలు**
**ప్రకృతి వైరుధ్యాల నుంచి రక్షించేవి,**
**సంఘ సహ జీవితానికి తప్పనివి,**
**వ్యక్తిత్వ వికాసాన్ని నిరోధించేవి;**
**నేను నిరసించేది నిరోధక నీతిని.**

బౌద్ధమతం గురించీ, బుద్ధుడి గురించీ ఇంతగా చెప్పుకోవడానికి కారణం, అంబేద్కరు బౌద్ధమతాన్ని స్వీకరించడమే.

ప్రపంచంలో ఎవరైనా బుద్ధుణ్ని కీర్తిస్తున్నారంటే, అందుకు కారణం ఆయన జ్ఞానతేజమే. బుద్ధుణ్ని పూజిస్తున్నారంటే, ఆయన విగ్రహాన్నే. అంబేద్కరు కూడ బుద్ధుడికేసి ఆకర్షింపబడ్డాడంటే అందుకు కారణం బుద్ధుడిలోని త్యాగమూ, కారుణ్యమూ, ప్రజ్ఞానమూ, సాంఘిక నిమ్నోన్నత భేద నిరాకరణమూ, సర్వమానవ సమానత్వ ప్రతి పాదనమూ.

ఈ సద్గుణాలు ఇతర మతాలలో లేవని కాదు. అయితే, చెప్పడం వరకే

కాక తాను స్వయంగా ఆచరించి చూపినవాడు బుద్ధుడు. తాను నిర్మించిన భిక్షు సంఘంలో అస్పృశ్యతకూ, కుల భేదాలకూ తావివ్వలే దాయన. అదే అంబేద్కరును ఆకర్షించి నట్టిది.

అయితే, బుద్ధుడుగాని, ఆయన పరివారంగాని, భిక్షుసంఘం గాని బౌద్ధ ధర్మాలనూ, సూత్రాలనూ తమకు తాము అనుసరించి వుండవచ్చునే తప్ప, వాటిని మొత్తం ప్రజలచేత ఆచరింప చెయ్యడానికి క్రియాశీలకమైన ప్రయత్నమేది జరిగినట్టు లేదు.

ఆనాటికే అస్పృశ్యత వుంది. కులాలు, వున్నై. బుద్ధుడు వాటిని తాను పాటించ లేదు నిజమే. అయితే, వాటిని నిర్మూలించడానికి ఎట్టి కార్యక్రమాన్నీ చేపట్టలేదు. తన పరిధిలో ఉద్యమాలను నడపలేదు. తన పరిధిలోకి వచ్చిన వాళ్ళకు నీతి బోధలు చేశాడు. అంత మాత్రమే.

ఆయన పరిధిలోకి వచ్చిన వాళ్ళలో. శిష్యరికం చేసిన వాళ్ళలో, ఆశీర్వాదం పొందిన వాళ్ళలో అత్యధికులు రాజ వంశీయులూ, వ్యాపార ప్రముఖులూ, బ్రాహ్మణులూ మొదలైన అగ్రవర్ణాలవాళ్ళే. దళిత బడుగు కులాలకు చెందిన వాళ్లు నామ మాత్రం.

మొత్తం మీద ఇక్కడ నేను చెప్పవచ్చిందేమిటంటే, భారతీయ సమాజం నుంచి అంటరాని తనాన్ని తొలగించడానికి బుద్ధుడు చేసిన ప్రత్యక్ష సేవ ఏదీలేదు. సార్వత్రిక మానవ దుఃఖ నిర్మూలన కోసం ఆయన చెప్పిన సూత్రాలూ, నీతి నియమాలూ, అష్టాంగ మార్గాలూ వంటి వేవీ కూడ సామాన్య జనానికి ఆచరణ సాధ్యమైనట్టివి కావు. అందులో అధిక భాగం ఎంతటి సర్వసంగ పరిత్యాగులకు కూడ అసాధ్యాలే. అందులోనూ సత్యవ్రతం, అహింసావ్రతం వంటివి నూటికి నూరుపాళ్లు దుస్సాధ్యాలు.

ఇదంతా పాతిక వందల సంవత్సరాల నాటి మాట. ఇన్ని వందల సంవత్సరాలు గానూ బౌద్ధ ధర్మాలూ, బౌద్ధ విగ్రహాలూ ఉన్నతోన్నత పీఠాలపై పూజించబడుతూ వస్తున్నాయే తప్ప, సామాన్య మానవ జీవితాన్ని దుఃఖ రహితం చెయ్యడానికి ఏ మాత్రమూ పనికిరాలేదు.

ఈ దృష్టితో మనం అంబేద్కరు వ్యక్తిత్వాన్నీ, త్యాగాన్నీ, ప్రబోధాలనూ, నడిపిన ఉద్యమాలనూ, సాధించిన ఫలితాలనూ పరిశీలించి చూస్తే బుద్ధుడి కంటే

అంబేడ్కరు ఎంతటి అధికాధిక సమున్నతుడో స్పష్టమౌతుంది.

అంబేడ్కరు వ్రాసిన "బుద్ధుడూ అతడి ధర్మమూ" అనే గ్రంథాన్ని చదివి, అందులోని బుద్ధ చరిత్రతో ధనంజయ కీర్ వ్రాసిన అంబేడ్కరు జీవిత చరిత్రను పోల్చి చూస్తే, ఈ సత్యం మనకు గోచరిస్తుంది. అందుకే ఇక్కడ తత్సంబంధమైన వివరాలను పేర్కొనడం లేదు. ఈ రచనలో ఇంత వరకూ ఇచ్చిన వివరాలు అందుకు సరిపోతై కూడ.

## క్షీరాన్నంలో చచ్చిన ఈగ

హిందూ మతం ఒక క్షీరాన్న కలశం. హిందూ సంఘంలోని కులభేదాలు కుక్కలు. అంటరానితనం అనేది ఆ కలశంలో పడి చచ్చిన ఒక ఈగ.

కాలుష్యం నుంచీ, కుక్కల కాట్లాటలనుంచీ సదరు పరమాన్న కలశాన్ని ఉద్ధరించడం ఎలా ?

అదే అంబేడ్కరు చేసిన నిరంతర చింతన. అందుకే ఆయన చేసిన అకుంఠిత తపస్సంతా. ఆయన మతం మార్పిడి కూడ అందుకోసం ఆయన చేసిన చివరి యత్నం. హిందూ మతాన్ని నిష్కలుషమూ, నిష్కంటకమూ, పునఃపవిత్రమూ, పునరావాస్యమూ చెయ్యడం కోసం వైరభూతాలపై ఆయన ప్రయోగించిన అంతిమాస్త్రం మతం మార్పిడి.

అహింసా జ్యోతి బుద్ధుడు గాని, కార్మిక జ్యోతి కారల్ మార్క్స్‌గాని దళిత జనోద్ధరణ కోసం చేసిందేమీ లేదన్నాను కదా!

ఒకవేళ ఏదైనా వున్నందనుకుంటే, దానిని అంబేడ్కరు చేసిన దేనితో పోల్చి చూడండి.

ప్రభుత్వ శాసనం ద్వారా అస్పృశ్యతను నేరంగా ప్రకటింప జేసినవాడు అంబేడ్కరు. అస్పృశ్యత పాటించిన వాళ్లను శిక్షార్హులుగా చేసినవాడు అంబేడ్కరు. దళిత జనానికి పరిపాలనా యంత్రాంగంలో భాగం సంపాదించి పెట్టిన వాడు అంబేడ్కరు. సంయుక్త నియోజక పద్ధతికి ఒప్పుకొని, అవర్ణ సవర్ణ భేద భావం తొలగిపోవడానికి దోహదం చేసినవాడు అంబేడ్కరు.

ఆర్థిక రాజకీయ రంగాలలోనూ, విద్యాభ్యాసంలోనూ, అధికార పదవులలోనూ, శాసన సభలలోనూ, మంత్రివర్గాలలోనూ కూడ క్రిందనుంచి పైదాకా

జనాభాకు తగిన నిష్పత్తిలో దళితులకు రాజ్యాంగ చట్టరీత్యా అవకాశాలూ, హక్కులూ కల్పించిన వాడు అంబేద్కరు. అమాయకపు గొర్రెల్లా బ్రతక వద్దనీ, సింహ పౌరుషంతో జీవించమనీ ఉద్బోధించినవాడు అంబేద్కరు. వివిధ సిద్ధాంతాలు సమన్వయం ద్వారా హిందూ మతం ఏకముఖం కావాలని, కుల వ్యవస్థా నిర్మూలనం ద్వారా హిందూజాతి శక్తివంతం కావాలని కూడ ఉపదేశించినాడు అంబేద్కరు.

ఇన్ని విధాలుగా భారతజాతి బహు ముఖాభ్యుదయం కోసం, మానవుడి స్వేచ్ఛా వికాసంకోసం సమగ్రమైన కృషి చేసినవాడు అంబేద్కరు. అంతటి అంబేద్కరుతో తదితర ప్రవక్తలను పోల్చడం ఎలా? ఎందుకు?

అంబేద్కరు బౌద్ధమతంలో చేరి వుండవచ్చు. ఆయన అలా ఎందుకు చేశాడో మనం పూర్తిగా గ్రహించవలసి వుంది. ఆయన లక్ష్యం మతం మాత్రమేనా? నిర్వాణం కోసం అందులో చేరాడా? కానే కాదు.

అంబేద్కరుకు బౌద్ధమతం ఒక గడ్డి పరకలా దొరికింది. దానిని తీసుకొని మంత్రించి బ్రహ్మాస్త్రంలా వదిలాడాయన. హిందూ మతంలోని కులతంత్ర కాకాసురుడికి అది బుద్ధి చెప్పగలదని ఆయన ఉద్దేశ్యం.

కాగా, అంబేద్కరు బౌద్ధమతంలో చేరినంత మాత్రాన అంబేద్కరుకంటే బుద్ధుడే గొప్పవాడని అనుకోకూడదు. అంబేద్కరును ఉపేక్షించి బుద్ధపూజకు పాల్పడకూడదు.

చారిత్రక వాస్తవాలను గుర్తిస్తే, హరిజన సమస్యను రాజకీయం చేసి, హరిజన సేవా సంఘాలను నెలకొల్పి, జాతీయ నిర్మాణ కార్యక్రమంలో అస్పృశ్యతా నిర్మూలననూ, హరిజనోద్ధరణనూ ప్రధానాంశాలుగా చేర్చ గలిగిన గాంధీ కంటే కూడ దళితులకు బుద్ధుడు చేసిందేమీ లేదు.

"కాంగ్రెసూ, గాంధీజీ దళితుల కేం చేసినట్టు"? అంటూ అంబేద్కరు వేసిన ప్రశ్న సమకాలీన సాంఘిక రాజకీయ పోరాటంలో దళితవర్గ నాయకుడిగా ఆయన చేసిన సవాల్. పరస్పర సమరావేశంలో ప్రత్యర్థి నాయకులు తీవ్రంగా నిందించుకోవడం సహజమే. కృష్ణుడూ, అర్జునుడూ పరస్పరం ఎంత ఘోరంగా తిట్టుకున్నారో గయోపాఖ్యానం ద్వారా మనకు తెలుసు. అటువంటి సవాళ్లు ఆ పోరాటకాలంలో అంబేద్కరు ఎన్నెన్నో విసిరి వున్నాడు. అవే లేకపోతే ఈ మాత్రం అభివృద్ధి కూడా దళిత వర్గాలకు లభించి వుండేది కాదు.

అగ్రనాయకులు పరస్పరం చేసుకునే నిందలను మరీ సీరియస్‌గా తీసుకకో

కూడదు. రాజకీయ రణరంగంలో మిత్రులు శత్రులూ, శత్రులు మిత్రులూ అవుతూ వుండడం సహజం.

అందుకే అంటున్నాను. అంబేడ్కరు దళిత జన జ్యోతి అని.

## 18. ఆనాడే చేసి వుంటే

**మనది పేదదేశం అన్నాడు నాయకుడు**
***ఎందులో పేద? అడిగాడు కృషీవలుడు***
**బుద్ధిలో మాత్రమే పేద అన్నాడు కవి !**
**మన అంగడిలో అన్నీ వున్నై**
***లేనిది అందరూ కలిసి బ్రతకాలన్న బుద్ధి ఒక్కటే!***

అంటరానితనం ఒక హిందూ సమాజంలోనే వుంది. అంటరానితనాన్ని నిర్మూలించాలనేది అంబేడ్కరు మొదటి ధ్యేయం.

అంటరాని తనాన్ని నిర్మూలిస్తే ఏమవుతుంది? అవర్ణులకూ, సవర్ణులకూ మధ్య కృత్రిమంగా కట్టబడిన అడ్డుగోడలు తొలగిపోతై. అప్పుడు హిందువు లంతా ఏకస్థాయికి వస్తారు. సవర్ణులలో వుండే కులాల సంఖ్యతో అవర్ణులలో వుండే కులాల సంఖ్య కూడా కలుస్తుంది.

అవర్ణులలో, అంటే అస్పృశ్యులలో చాలా కులాలున్నై. అస్పృశ్యత పోతే ఈ కులాలన్నీ హిందూ కులాలే అవుతై. బావులు, చెరువులు, గుడులు, బడులు, వాడలు, అవసర సేవలు మొదలైన వన్నీ అన్ని కులాల అందుబాటులోకి వస్తై. అస్పృశ్యత పోవాలన్నప్పుడు, అంబేడ్కరు ఆశించిన ఫలితం ఇదీ.

అందుకోసం ఆయన పోరాటాలు జరిపాడు. చెరువునీళ్ళకోసం, దేవాలయ, ప్రవేశం కోసం యుద్ధాలు చేశాడు. సత్యాగ్రహాలు నిర్వహించాడు. ఎన్నో సభలూ, సమావేశాలూ జరిపి దళిత కులాలను చైతన్యవంతుల్ని చేశాడు. సంఘటిత పరిచాడు.

ఆనాడే కనుక దేశంలోని దళితులంతా, అంటరాని కులాల వాళ్లంతా, నీచ వృత్తులు చేస్తూ దళితుల కంటే హీనంగా బ్రతుకుతున్న బడుగుకులాల వాళ్ళంతా అంబేడ్కరు నాయకత్వాన్ని శిరసా వహించి ఒక్కసారిగా తమ హైన్యదైన్య దాస్యాలను విదల్చి పారేయడానికి తిరుగుబాటు చేసివుంటే, అప్పుడే వీళ్లు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను

సాధించుకో గలిగేవాళ్లు. దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం రాకముందే అస్పృశ్యత రూపు మాసిపోయి వుండేది. బ్రిటీషు వాళ్ళు రాజ్యాన్ని వీళ్ళకే అప్పగించి పోయి వుండేవాళ్లు. అంబేద్కరే భారతాధ్యక్షుడో, భారత ప్రధానో అయి వుండేవాడు కూడ.

అయితే, అలా ఎందుకు జరగలేదు? అలా జరగదు. తర తరాల జాడ్య మౌఢ్యాలు, దాస్య దైన్యాలు ఒక్కసారిగా ఎలా పోతై ? పోయే వైతే అంత దీర్ఘకాలం ఎలా పీడిస్తాయ్?

ఈ వాస్తవం అంబేద్కరుకు తెలుసు. అందుకే, "చైతన్యవంతులు కండి, సంఘటితులు కండి, సమరం సాగించండి." అంటూ ఉద్బోధించాడాయన.

ఒక లక్ష్యాన్ని చూపాడు. దాన్ని సాధించడానికి ఎలా పోరాడాలో స్వయంగా పోరాడి చూపాడు. అందుకు ఎలాంటి సాధన సంపత్తి కావాలో ఉపన్యాసాల ద్వారా, రచనల ద్వారా, మహాసభల ద్వారా వివరించి చెప్పాడు.

అస్పృశ్యత తొలగినంత మాత్రంచేత పేదరికం తొలగిపోదు. మురికి బ్రతుకులు మారవు. అస్పృశ్యత పోతే దళిత కులాలు బడుగు (వెనకబడిన) కులాలుగా మారుతై అంతే.

కుల (వర్ణ) వ్యవస్థ వేదసమ్మతం కాదని నేను నాగ్రంథాలన్నిటా నిరూపించి వున్నాను. కుల వ్యవస్థ స్మృతుల కాలంలో పుట్టినట్టిది. అంతకుముందు లేదు. అంతకు ముందే వున్నట్టు ఎవరైనా నిదర్శనలు చూపితే, అవన్నీ ప్రక్షిప్తాలే అయివుంటై. తరువాత వాళ్లెవళ్ళో వాటిని కల్పించి వుంటారు.

వేద పురాణాల నిండా ప్రక్షిప్తాలు నింపబడి వున్నాయని అంబేద్కరే అనేక సందర్భాలలో చెప్పాడు.

**శపథ లక్షణం**

కుల వ్యవస్థ వేద విరుద్ధమైనట్టిది. దానిని తొలగించడం వేదమతాన్ని సముద్ధరించడమే అవుతుంది. అందుకే అస్పృతను తొలగించి, కులవ్యవస్థను రద్దుచేసి, స్వచ్ఛమైన భారత జాతిగా వికసించమంటూ హిందువులకు బోధించాడు అంబేద్కరు. తన కుల నిర్మూలన గ్రంథం ద్వారా అందుకు తగిన ప్రణాళికను కూడా ఇచ్చాడు.

అది అనాడే అమలు జరిగి వుంటే, మతం మార్చే అవసరం అంబేద్కరుకు కలిగి వుండేది కాదు.

నేను కవిని గనుక, సాహిత్యపరమైన ఒక పోలిక నా ఊహకు తడుతూవుంది.

మహాభారత యుద్ధంలో, పద్మవ్యూహ సందర్భంలో, అర్జునుడు లేని సమయంలో అభిమన్యుడికి సహాయంగా వెళ్ళబోతున్న భీమాదులను సైంధవుడు అడ్డగించాడు. వ్యూహంలో చొరబడ్డ అభిమన్యుణ్ని ఒంటరిగా పట్టుకొని కౌరవయోధులంతా కలిసి చంపేశారు.

ఆ తర్వాత ఆ విషయం తెలిసిన అర్జునుడు దుఃఖ ఆగ్రహ ఆవేశాలతో ఒక శపథం చేశాడు. ప్రొద్దుగూకేలోగా సైంధవుణ్ణి చంపుతాననీ, అలా చంపకపోతే, అస్త్రసన్యాసం చేసి అగ్నిలో దూకుతాననీ ఆ శపథం, అది తెలుసుకొన్న కౌరవ యోధులు, కౌరవ సైన్యాలు మొత్తం సైంధవుడికి రక్షణ కల్పించడం జరిగింది. అర్జునుడి శపథం నెరవేరే ఆశ సన్నగిల్లింది.

అర్జునుని శపథం నెరవేర లేదనుకోండి. అప్పుడేమయ్యేది? అతీతశక్తి సంపన్నుడైన కృష్ణుడు బాసటగా వున్నాడు కనుక అర్జునుడి శపథం ఐంద్రజాలిక పద్ధతిలో నెరవేర గలిగింది. అర్జునుడు అస్త్రసన్యాసం చెయ్యనక్కర లేకపోయింది.

ఏ శపథానికైనా రెండు భాగాలుంటై. (1) షరతు (2) షరతు నెరవేరకపోతే అనుభవించే శిక్ష. అర్జునుడి శపథంలో సైంధవుణ్ణి చంపుతా ననేది షరతు. అది నెరవేరకపోతే అస్త్రసన్యాసం చెయ్యడం అనేది అతడు అనుభవించే శిక్ష.

అర్జునుడి ప్రతిజ్ఞతో అంబేద్కరు ప్రతిజ్ఞను పోల్చి చూడండి. అందులో (1) తాను ఆశించినంత త్వరిత గమనంతో అంటరాని తనం నిర్మూలించబడక పోతే (2) తాను హిందూ మతాన్నే వదిలేస్తాడు. ఇది అంబేద్కరు ప్రతిజ్ఞలోని అంతర్యం.

దేశానికి స్వాతంత్ర్యం రాగానే భారత ప్రభుత్వం పూనా ఒడంబడిక అమలుకు పూనుకొని వుంటే, ఒక ఐదు పది సంవత్సరాలలోనైనా అస్పృశ్యత నిర్మూలమైపోయే చాయలు కనిపించి వుంటే అంబేద్కరు మతం మారే అవసరమే లేకపోయేది కదా!

అంబేద్కరు హేతువాది. భక్తుడు కాదు, మతపరంగా ఆలోచించే స్వభావం కాదాయనది. తనకు కావలసింది స్వర్గమో, మోక్షమో, దైవసాన్నిధ్యమో కాదు. తాను హిందువుగా చావనన్నాడంటే అందుకు కారణం హిందూమతంపై తనకు గల ఆగ్రహమే. ఆగ్రహ మెందుకంటే, దళితుల్ని వెలిపెట్టి అణగద్రొక్కుతున్నందుకు.

అస్పృశ్యతను రూపుమాపేసి దళితులకి సాంఘిక న్యాయాన్ని సమకూర్చగల ఉత్తమ ఉదాత్త నాయకత్వం ఆనాడు దేశానికి లభించివుండి వుంటే, అంబేద్కరు షరతు నెరవేరి వుండేది. అప్పుడు మతం మారే ప్రశ్నే వచ్చేది కాదు.

ఇది ఇక్కడ మనం గుర్తించవలసిన వాస్తవం.

## 19. ఇన్ఫీరియారిటీ ఎందుకు?

*అవిద్య, అజ్ఞానం, పేదరికం, పిరికితనం*
*ఇవి ప్రజల నుంచి ఎన్నటికీ తొలగించ బడవు;*
*అవి నిజంగా తొలగిపోతే*
*పులులకు ఆపైని గొర్రెలు దొరకవు!*

సవర్ణులూ, దళితులూ కూడ ఒకే జాతికి చెందిన వాళ్ళనీ, ప్రస్తుతం నుంచి వెనక్కి చూస్తే గతంలోని మతంగ, ధర్మవ్యాధ, వ్యాస, వాల్మీకి, అరుంధతి, అదృశ్యంతి, అంజన వంటి వారంతా ఈనాటి దళిత కులాలవారి పూర్వీకులుగానే కన్పిస్తారనీ నేను చెబితే, సవర్ణపండితు లెవరూ కాదనడం లేదు. పూర్వ సాహిత్యంలో కాదనడానికి ఏం లేదు. ఔననడానికి ఉదాహరణలెన్నైనా వున్నై.

అయితే, నేను చెప్పే వాస్తవాన్ని దళితులు, ముఖ్యంగా దళిత విద్యావంతులు నమ్మడం లేదు. ఎందుకని?

సవర్ణ పండితులకు వాస్తవం తెలిసినా, దానిని వీలైనంత మరుగునవుంచడానికే ప్రయత్నిస్తారు. ఎందుకంటే ఈనాటి వాళ్ళ దురాచారాలకు నేను చెప్పే సనాతన వాస్తవాలు విరుద్ధం కనుక.

పండితులనలా వదిలేస్తే, తదితర భూస్వామిక వర్గాలకు ఇలాంటి పూర్వ విషయాలేవీ తెలియవు. తెలిసినా, వాళ్ళ ప్రత్యేక ప్రయోజనాలకు ఈ సనాతన వాస్తవాలు భంగకరాలుగా కనిపిస్తై. తోటి ప్రజల శ్రమను దోచుకొంటూ, వాళ్ళ ఆస్తులను కలుపుకొంటూ, యజమానులై భోగభాగ్యాలను అనుభవిస్తున్న భూస్వామిక మనస్తత్వం తమ తరతరాల ప్రాబల్యాన్ని వదలుకోవడానికి అంగీకరించదు.

మరి, దళిత విద్యావంతులెందుకు నన్ను నమ్మడం లేదు? ఇది చాలా ప్రధానమైన అంశం కదా! దీనిని గురించి వాళ్ళెందుకు తీవ్రంగా ఆలోచించడం లేదు?

ఈ ప్రశ్నకు నా ఊహ కందుతున్న జవాబు ఒక్కటే. అది దళితులు అనుభవించిన, అనుభవిస్తున్న తరతరాల కట్టు బానిసతనం.

తామెవళ్ళో తమకే గుర్తుండనంత క్రూరంగా వాళ్ళకు బ్రెయిన్ వాష్ చెయ్యబడింది. తమ వారసత్వం నుంచి, సంస్కృతి నుంచి వాళ్ళు బహు అమానుషంగా దూరం చెయ్యబడ్డారు. "వేదవ్యాసుడు నీ కులం వాడేరా" అని నేనంటే, "అయ్యబాబోయ్! కాదు, కాదు" అంటూ అదిరిపోయి బెదిరి పోయే దయనీయ స్థితికి దళితులు దిగజార్చి వెయ్యబడ్డారు.

దళితులలో చదువుకొన్న వాళ్ళకు, విద్యావంతులకు, ఇంతో అంతో కవిత్వం కూడ చెప్పగలిగిన వాళ్ళకు కూడ తమ గత చరిత్రను గురించిన, తమ అనువంశిక వైభవాలను గురించిన అవగాహన ఈనాటికీ లేదు. అందుకు కారణం వాళ్ళను పట్టుకొని ఇంకా వదలకుండావున్న ఈ మధ్యకాలపు బానిసత్వదుర్వాసనలే.

ఏది ఏమైనా, అంబేద్కరు చెప్పిన దళితజన సిద్ధాంతమూ, నేను చెబుతున్న ఆర్ష వారసత్వ సిద్ధాంతమూ కలిసి భాసించే ఏక సమైక్య భారత జాతి సిద్ధాంతాన్ని మొత్తం ప్రజలలో, అవర్ణ సవర్ణ ప్రజలందరిలోనూ దృఢతరమైన ప్రచారం చెయ్యవలిసి వుంది.

అట్టి ప్రచారంతో సిసలైన అవగాహన ఉభయత్రా కలిగినప్పుడు, ఈ దేశంలో ఈ హైందవ జాతిలో అంటరాని తనానికి, కులభేదాలకు స్థానమే వుండబోదు. అట్టి ఏకజాతి సిద్ధాంతం ప్రజల అవగాహనలోకి చేరనంత వరకూ ఈ సమస్యలు సమూలంగా పరిష్కారం కాబోవు.

## ౨౦. ఆంజనేయుడు ఏ కులం వాడు?

*మానవ సమాజం ఒక మహా మర్కటం*
*తలకూ, తోకకూ మిన్నూ, మన్నూ అంత దూరం;*
*తల గ్రహాలచుట్టూ ప్రదక్షిణాలు చేస్తుంటే*
*తోక విగ్రహాల చుట్టూ ప్రాణాచారం పడుతోంది!*

ఈ మధ్యనే (1984 అక్టోబరు నెలలో) హైదరాబాదు నగర సమీపంలోని ఒక గ్రామంలో జరిగిన ఒక విషాద సంఘటనను ఇక్కడ ఉదాహరిస్తున్నాను. పరిశీలించండి:

సవర్ణుల కొంపల మధ్య అదొక ఆంజనేయుడి గుడి. అనా దేదో హిందువుల పండగ. ఆ ఊరి దళితులు కూడా ఆ పండగను చేసుకొనే హిందువులే.

మహమ్మదీయుల ఖడ్గవాదాన్నీ, క్రైస్తవీయుల కారుణ్య వాదాన్నీ కూడ ధిక్కరించి, ఆ నిరుపేద దళితులు తర తరాలుగా తమ పరిధిలో తాము వైదిక దేవతా మూర్తులను ఆరాధిస్తున్న వాళ్లు. స్వచ్ఛమైన వైదిక (హైందవ) సంస్కృతికి సజీవ దృష్టాంతాలుగా జీవిస్తున్నవాళ్లు.

ఆనాటి వరకూ వాళ్లు ఏనాడూ ఆ ఆంజనేయుడి గుడిలోకి వెళ్ళిన వాళ్ళు కాదు, వెళదా మనుకొన్న వాళ్ళూ కాదు.

అంటరానితనం చట్టరీత్యా తొలగించ బడిందనీ, ఏకులంవాళ్లైనా, ఏ హిందూ దేవాలయంలోకైనా నిరాటంకంగా వెళ్ళవచ్చుననీ తెలుసుకొని, అక్కడి దళితులు ఆ గుడిలోకి వెళ్ళడానికి ప్రయత్నించారు. ఫలితంగా సవర్ణుల చేత అడ్డగించబడ్డారు, కొట్టబడ్డారు. వాళ్ళ దౌర్జన్యాలకు గురై తమ గుడిసెలనూ, ఆస్తి పాస్తులనూ పోగొట్టుకున్నారు.

ఇదొక చిన్న సంఘటనే అయినా, పరిశీలించవలసిన ఒక ముఖ్యాంశం ఇందులో వుంది.

అసలు, ఆంజనేయుడు ఎవరు? బ్రాహ్మణుడా? రెడ్డా? గౌడా? ఆంజనేయుడెవరు? ఆయన అంజన కొడుకు. అంజన ఎవరు? కేసరి అనే అతడి భార్య. లేక అహల్య అనే ఆమె కూతురు. ఏ కథ ప్రకారమైనా ఆమె దళిత కులానికి చెందినట్టిది. హరిజన వనిత. ఆమె కొడుకు ఆంజనేయుడు, ఆంజనేయుడు హరిజనుడు కాదా?

ఒక సవర్ణ రాజుకు భక్తుడైనంత మాత్రం చేత ఆంజనేయుడు సవర్ణుడౌతాడా? ఒక హరిజనుణ్ణి సవర్ణులు సొంతం చేసుకుని, తమ గ్రామం మధ్యలో గుడికట్టి పూజించుకొంటున్నంత మాత్రం చేత తక్కిన దళితులనుంచి అతడు ఎలా భిన్నుడు?

ఈ పౌరాణిక వాస్తవం అక్కడి సవర్ణులకూ తెలియదు. దళితులకూ తెలియదు. తెలిసి వుంటే, ఆనాడు అక్కడ జరిగిన ఘోరం జరిగి వుండేది కాదు.

సవర్ణులు దళితులను నిషేధించేవాళ్ళు కాదు. దళితులు అంత సులభంగా లొంగిపోయేవాళ్ళు కాదు.

ఆంజనేయుడు తమవాడనే అవగాహన దళితులలో వుంటే ఒక్కొక్క దళితుడూ ఒక్కొక్క ఆంజనేయుడి బలంతో నిలబడగలిగేవాళ్లు. "మా ఆంజనేయుణ్ణి మాకు వదిలెయ్యండి" అనైనా అడగ గలిగేవాళ్లు.

వాల్మీకీ, వ్యాసుడూ హరిజనులే అంటున్నాను నేను. వాళ్ళ గ్రంథాలలోనే అందుకు నిదర్శనాలున్నై. కాదనడానికి ఏమీ లేవు.

అయితే వాల్మీకీ, వ్యాసుడూ వ్రాసిన, సంకలనం చేసిన రామాయణాన్నీ, వేదాలనూ, పురాణాలనూ, ఉపనిషత్తులనూ భారత భాగవతాలనూ, భగవద్గీతనూ కూడ సవర్ణులు స్వాధీనం చేసుకుని ఆ ఋషుల వంశీయులైన హరిజనుల్ని అంటరాని బానిసలుగా అణిచిపారేశారు. ఇదేం న్యాయం అని అడుగుతున్నాను నేను.

చదువుకోవడం నిషేధించబడ్డ శూద్రులకుగాని, వేద సంస్కృతినే మరిచి పోయిన ద్విజులకుగాని, అసలు మానవ సమాజానికే దూరంగా వుంచబడిన దళితులకుగాని ఈ వాస్తవాలు తెలియనే తెలియవు. తెలిసిన నాడు ఈ భేదాలన్నీ తొలగిపోవా? తెలిసికూడా సవర్ణులు దిగిరావడానికి నిరాకరిస్తే, దళితులు తమ హక్కులకై నిలిచి పోరాడరా?

ఇదంతా పాతపురాణ మని ఎవరైనా కొట్టిపారేస్తే, అట్టివాళ్లు బుద్ధిపూర్వకంగానే వంచనకు పాల్పడుతున్నారని అనుకోక తప్పదు.

ఎందుకంటే, ఈ భారత జాతిని నిష్కలుషం చేసి, సమైక్య పరచి, సముజ్వల భవిష్యత్తుకు నడిపించగలగేది ఈ పాతపురాణ జ్ఞానమే.

అంబేద్కరిష్టు దృక్పథంతో ఆయా సందర్భాలకు అనుగుణమైన వ్యూహాలను పన్నుకొంటూ స్నేహపూర్వకంగా ఆయా సమస్యలను పరిష్కరించుకోడానికి ఎంతైనా ఉపయోగపడగల జ్ఞానం ఇది.

దళితులు తమ ఇన్ ఫిరియారిటీని వదులుకోవాలి. తమ వారసత్వపు గొప్పతనాన్ని గుర్తించాలి. తదితరులంతా సనాతన వాస్తవాలను స్పష్టంగా అర్థంచేసుకోవాలి.

## 21. అంబేడ్కరు ప్రత్యేక ప్రతిజ్ఞలు

గణ తంత్రాలు, రాజరికాలు, ప్రజాస్వామ్యాలు
ఎప్పుడు ఎక్కడ ఏ పేరుతో పిలువబడినా

## అవన్నీ తోడేళ్ళనుంచి గొర్రెల్ని రక్షించడానికి పెద్దపులులు చేబట్టిన పెత్తనాలే!

అంబేద్కరు తన జీవితంలో చిట్ట చివరి చర్యగా 14-10-1956న బౌద్ధ మతంలోకి మారాడు.

మతం మార్పిడి కార్యక్రమంలో చేయవలసిన ప్రమాణాలు ముగిసిన తరువాత, ఆయన అదనంగా 22 ప్రతిజ్ఞలనుచేసి, తమతోపాటు మతం మారిన వారందరిచేత కూడా చేయించాడు.

ఆ 22 ప్రత్యేక ప్రతిజ్ఞలూ క్లుప్తంగా ఇవి.

(1) నేను బ్రహ్మ విష్ణు మహేశ్వరులను దేవుళ్ళుగా భావించను (2) రాముణ్నీ, కృష్ణుణ్నీ దేవుళ్ళుగా పూజించను (3) గౌరీ, గణపతీ మొదలైన హిందూ మతంలోని దేవతలను అర్చించను (4)దేవుడి అవతారాలను విశ్వసించను (5) బుద్ధుడు విష్ణువు యొక్క అవతారమనే దుష్ట ప్రచారాన్ని నమ్మను (6) శ్రాద్ధ కర్మలు నిర్వహించను (7) బౌద్ధ ధర్మానికి అపచారం కలిగించే పనులు చేయను. (8) ఏ కార్యాన్నీ బ్రాహ్మలచేత జరిపించను (9) లోకంలోని మానవులందర్నీ సమానంగా చూస్తాను (10) బుద్ధుడి అష్టాంగ మార్గం అవలంబిస్తాను. (11) బుద్ధుడు బోధించిన పది పరిమితులకు లోబడి వుంటాను (12) సమానత్వ స్థాపనకై ప్రయత్నిస్తాను (13) జీవహింస చేయను (14) దొంగతనం చేయను (15) అబద్ధం చెప్పను (16) వ్యభిచారం చేయను (17) మద్యపానం చేయను. (18) జ్ఞానం, శీలం, కరుణ అనే బౌద్ధధర్మ నావ ద్వారా ఈ జీవితమనే నదిని తరిస్తాను (19) మానవుల మధ్య అసమానతలను సృష్టించి తోడి మానవులకు ఎంతో అపచారం చేసిన హిందూ మతాన్ని వదిలి బౌద్ధధర్మాన్ని స్వీకరిస్తున్నాను (20) బౌద్ధధర్మమే సత్యమైన ధర్మమని విశ్వసిస్తున్నాను (21) ఇప్పటి నుంచి నూతన జీవితంలో ప్రవేశిస్తున్నాను (22) ఇప్పటి నుంచి బౌద్ధ ధర్మానుసారంగా నడుచు కుంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.

ఈ ప్రత్యేక ప్రతిజ్ఞలను అవగాహన చేసుకోవడం కోసం ఇక్కడ కొన్ని వివరణలు తెలుసుకోవలసి వుంది.

హిందూ మతంలో నిర్గుణోపాసన, సగుణోపాసన అనే రెండు భాగాలున్నై. నిర్గుణోపాసన అంటే నామ రూప గుణ భావాతీతమైన ఏకేశ్వర పరమాత్మను

ఆరాధించడం. అయితే, అదెలా సాధ్యం? ఏకాగ్రమైన భక్తిజ్ఞాన వైరాగ్యాల ద్వారా సాధ్యమే అన్నారు వేదాంతులు.

ఇక, రెండోది సగుణోపాసన. నామ రూప గుణ భావాతీతమైన పరమాత్మను ఆరాధించడం. ఏదో ఒక ప్రతీక **(Symbol)** లేకుండా సాధ్యం కాదన్నారు లౌకికులు.

ఊహకే అందని దానిని ఊహించడం ఎలా? అందుకే తమ తమ ఊహలకు అనుగుణమైన ప్రతీకలకు రూపొందించుకొని, వాటిద్వారా ఈశ్వరోపాసనకు పూను కొన్నారు వీళ్లు. అలా రూపకల్పన చేయబడిన భావాలే దేవతలూ, ఉపదేవతలూ, అవతారమూర్తులూ.

హిందూ మతంలో ఈ వేదాంత లౌకిక మార్గాలు రెండింటికీ ప్రాధాన్యం వుంది. అయితే, వేదాంత మార్గం కష్టసాధ్యం కనుక, సామాన్య ప్రజలలో లౌకిక మార్గమే ఎక్కువ ప్రాచుర్యం పొందింది.

లౌకికమైన ఈ సగుణోపాసనను హిందువులు చెప్పి చేస్తున్నారు. తక్కిన మతాల వాళ్లు చెప్పకుండా చేస్తున్నారు.

విగ్రహాన్ని ఆరాధించడం, ఆ విగ్రహం ఊహా కల్పిత దేవతదైనా, ప్రవక్తదైనా, మనిషిదైనా, మరే ప్రాణిదైనా సరే, విగ్రహారాధనే అవుతుంది కదా?

విగ్రహారాధన ఎలాంటిదైనా సరే, ఇహ పర సంబంధమైన కొన్ని ప్రయోజనా లను తీర్చగలదేమోగాని, మోక్షాన్ని ఇవ్వజాలదని అద్వైత వేదాంతులంటారు.

అద్వైత వేదాంత గురువైన శంకరాచార్యుడికి అంబేద్కరు ప్రతిపాదించిన ప్రతిజ్ఞలతోనూ ఏకీభావం వుంది. ఈ ప్రతిజ్ఞలలో అంబేద్కరు దేనిని నిషేధించాడో, శంకరాచార్యుడు కూడా దానినే నిషేధించాడు.

ఇక్కడ మనం మరొక వాస్తవాన్ని గుర్తించాలి. బుద్ధుడు చెప్పిన పంచశీలాలూ, అష్టాంగ మార్గాలూ, దశవిధ పారమితులూ మొత్తం 23 లో విధించబడిన నియమ నిష్ఠానీతి నిర్బంధాలలో ఏ ఒక్కటైనా, ప్రతిపెద్దమనిషీ చెబుతున్నట్టివి కావా? ప్రతీమతంలోనూ, మన నీతి శతకాల నిండా ఇవి లేవా? అమలు జరగని, ఆచరణ సాధ్యంకాని నియమ నిష్ఠలను విధించడంవల్ల ఏమిటి ప్రయోజనం?

13 నుంచి 17 వరకూ ప్రతిజ్ఞలు పంచశీలాలే.

8వ ప్రతిజ్ఞలో బ్రాహ్మణుడంటే ఈ కాలపు పుట్టుబ్రాహ్మణుడనే అంబేద్కరు

ఉద్దేశ్యం. బ్రాహ్మణ కులంలో పుట్టి, జన్మ మాత్ర కారణం చేత బ్రాహ్మణ నామంతో చెలామణీ అవుతున్నవాడు అని అర్థం.

వేద వేదాంత యుగాలలో బ్రహ్మజ్ఞానం కలవాడినే బ్రాహ్మణుడనేవాళ్లు. అతడెవరైనా కావచ్చు, బ్రహ్మ జ్ఞానం కలిగి వుంటే బ్రాహ్మణుడు. ఆ కాలం నాటి బ్రాహ్మణులకు, ఈ కాలంనాటి బ్రాహ్మణ కులం వాళ్ళకు సంబంధం ఏ మాత్రమూ లేదు. ఈ వాస్తవాన్ని అంబేద్కరిస్టులు స్పష్టంగా అర్థం చేసుకోవలసి వుంది.

## 22. ఎవడు బ్రాహ్మణుడు?

*మానవుల మధ్య సహజీవనం అంటే*
*గూండాలకు సాధువు తల వంచడ మేనా?*
*జాతీయ సమైక్యం అంటే*
*మైనారిటీ పల్లకీని మెజారిటీ మొయ్యడ మేనా?*
*సెక్యూలరిజం అంటే*
*ప్రతి దేవుడుకీ సెక్యూరిటీ గార్డును నియమించడ మేనా?*

వ్యాసుడూ, వాల్మీకి మొదలైన పూర్వ రచయితలు అంతా మామూలు బ్రాహ్మణులే అనే అపోహ ఒకటుంది.

ఈ అపోహ ఈనాడు పుట్టుకతో బ్రాహ్మణులుగా చలామణీ అవుతున్న వాళ్ళలో ఎంత గాఢంగా వుందో బ్రాహ్మణేతరులలోనూ, దళితులలోనూ, విద్యా వంతులలోనూ కూడా అంతే ఘోరంగా వుంది.

వ్యాస వాల్మీకులు పుట్టిన వేదకాలంలో కులవ్యవస్థ ఈనాడున్నట్టు లేదు. ఈ వాస్తవాన్ని నా గ్రంథాలలో అనేక చోట్ల సోదాహరణంగా స్పష్టపరిచి వున్నాను.

బ్రహ్మ వేరు, బ్రహ్మం వేరు. బ్రహ్మ అంటే త్రిమూర్తులలో ఒకడు. అతడికి రూప గుణాలున్నై. బ్రహ్మం అంటే దైవం. అదొక పరమశక్తి. అది స్త్రీ కాదు, పురుషుడూ కాదు. అసలు ఆ శబ్దం కూడ నపుంసకలింగ శబ్దమే.

ఏ శక్తి నుంచి వెలుగూ, జీవమూ కూడా పుడుతున్నాయో, ఈ సమస్త విశ్వమూ ఏ శక్తిలో పుట్టి లయించి పోతున్నదో అట్టి మూలశక్తే, అట్టి పరమ దైవమే బ్రహ్మం అంటే.

అట్టి బ్రహ్మం గురించిన జ్ఞానం కలవాడు బ్రాహ్మణుడు.

అట్టి జ్ఞానం ఆర్జించుకోవలసి నట్టిది. పుట్టుకతో వచ్చేది కాదు.

బ్రాహ్మణులకు పుట్టినవాళ్ళు బ్రాహ్మణులనడం శాస్త్రీయం కాదు. పూర్వం ఎవడైనా, ఎక్కడ పుట్టినా, ఏరకంగా పుట్టినా బ్రహ్మ జ్ఞానం పొందిన ప్రతి వాడూ బ్రాహ్మణుడే అయ్యే వాడు.

వ్యాస వాల్మీకులు తమ గ్రంథాలలో బ్రాహ్మణ శబ్దం వాడితే, బ్రాహ్మణులను పూజించాలని చెబితే, ఆ బ్రాహ్మణులు బ్రహ్మజ్ఞానులైన వాళ్ళు మాత్రమే. ఈనాడు మనం చూస్తున్న పుట్టు బ్రాహ్మణులు కాదు.

బుద్ధుడు తన భిక్షు సంఘానికి విధించిన కఠిన నిబంధనల కంటె కూడ, కఠినాతి కఠినమైన నియమ నిబంధనలకు లోబడి జీవించిన వాళ్ళే ఆనాడు బ్రాహ్మణులంటే. ప్రాచీన సాహిత్యాన్ని పరిశీలించే ప్రతి ఒక్కరూ గుర్తించే పరమ వాస్తవ మిది.

చెట్టుపేరు చెప్పి కాయలమ్ముకొంటున్నది, ఈనాటి బ్రాహ్మణ కుల వ్యవస్థ. బ్రాహ్మణ శబ్దాన్ని దుర్వినియోగ పరుస్తున్నది కూడా.

బ్రాహ్మణుడంటే ఏకులానికీ చెందినవాడుకాదు. కులాతీతుడైన పరమజ్ఞానిగా వుండవలసిన వాడు.

హిందూ మతం వేరు, బ్రాహ్మణ మతం వేరు అని అంబేద్కరు చెప్పిన మాటను స్పష్టంగా అర్థం చేసుకోవలసి వుంది. హిందూ అనే పదం వేదసమ్మతం కాకపోయినా, అది విదేశీయులైన అప్రాచ్యులు పెట్టిన పేరే అయినా, ఈనాడు అది వైదిక సంప్రదాయానికి వారసత్వం వహిస్తున్న ఒకానొక వ్యవస్థకు సంకేతంగా ప్రచారంలోకి వచ్చింది. దీనినే హిందూమతం అంటున్నాం. ఈ హిందూమతానికీ, కులాచార దుష్టమైన నేటి బ్రాహ్మణ మతానికీ సంబంధం లేదు.

అందుకే బ్రాహ్మణ మతాన్ని తొలగించి, అంటే కుల వ్యవస్థను తొలగించి, హిందూమతాన్ని నిష్కళంకం చెయ్యాలన్నాడు అంబేద్కరు. అందుకు తగిన మంచి ప్రతిపాదనను కూడా చేసి వున్నాడు. అందరూ ప్రశాంతంగా పరిశీలించవలసిన అంశమిది.

బౌద్ధులంటే, హైందవ సమాజంలో ఒక భాగం అనేదే అంబేద్కరు భావం.

దళితులు హిందూ సమాజంలో సమానహోదాలో, సమాన గౌరవమర్యాదలతో బ్రతకాలన్నదే అంబేద్కరు ఆశయం. మూఢాచారాలను అవలంబిస్తూ కులభేదాన్నీ, అంటరానితనాన్నీ పాటించే సవర్ణులను నయాన్నో భయాన్నో ఒక సక్రమ మార్గానికి తీసురావాలనేదే ఆయన ఆకాంక్ష. వాళ్ళతో విరోధం పెట్టుకోవడం, విడిపోవడం ఆయన ఉద్దేశం కాదు.

## 23. సెక్యూలరిజం అంటే ఏమిటి?

*శాంతి ప్రియులైన గొర్రెల మందలు*
*ఎన్ని కోట్లుండి ఏం లాభం?*
*ఒక్క నక్కకు సరితూగ లేవు,*
*ఒక్క తోడేలును కాదన లేవు,*
*ఒక్క పులి పంటి కిందకు రావు.*
*శాంతి ప్రియత్వం పిరికితనానికి మరో పేరైతే*
*అది నా జాతికి వద్దు, వద్దు, వద్దు!*

సెక్యూలరిజమంటే ఇప్పుడు మన దేశంలో అనుసరించబడుతున్నట్టి దేనా? దీనికి మరొక స్వరూప మేదైనా వున్నాదా? జాతి శ్రేయస్సు దృష్ట్యా ఇంతకంటె ఉత్తమంగా దీనిని అమలు జరపడానికి వీలున్నదా? మనం అనుసరిస్తున్న ప్రస్తుత విధానం ఈ ముప్ఫై అయిదు సంవత్సరాలలోనూ మన కిచ్చిన అనుభవం ఏమిటి? ఉపకరిస్తున్నట్టిదా? అపకరిస్తున్నట్టిదా?

ఈ విధమైన ప్రశ్నలు వేసుకొని లోతుగా చర్చించ వలసిన అవసరం ఎంతో వుంది. అయితే దీనిని గురించి పట్టించుకొంటున్న వాళ్లే లేరు.

మత ప్రాతిపదికపై దేశ విభజన జరగడం ప్రపంచలోనే ఒక అపూర్వ అసాధారణ సంఘటన. మతాన్ని బట్టి జాతిని నిర్ణయించడం కూడ అసంబద్ధమైన ట్టిదే, అసహజమైనట్టిదే.

ఒకే కుటుంబంలో కల ముగ్గురు అన్నదమ్ములు తల్లిదండ్రుల నుంచి విడిపోయి, తమ తమ అభిరుచులకు అనుగుణంగా, ఒకడు ఇస్లాంలో కలవవచ్చు. మరొకడు క్రైస్తవుడు కావచ్చు. ఇంకొకడు బౌద్ధుడుగా మారవచ్చు. ఈ ముగ్గురు

అన్నదమ్ములూ వేరు వేరు మతాలవాళ్ళౌతారే తప్ప, వేరు వేరు జాతులవాళ్లు కారు కదా!

ఈ వాస్తవాన్ని గుర్తించకుండా, దేశ విభజన తర్వాత స్వతంత్ర భారత్‌లో, సెక్యూలరిజం అనబడుతున్న విధానాన్ని మనం చాల అసహజంగా అనుసరించడం సాగించామని నా ఉద్దేశ్యం.

ప్రపంచంలో కొద్దిపాటి చిన్న చిన్న మత దేశాలు తప్ప, పేరున్న పెద్ద దేశాలన్నీ ఒక విధమైన సెక్యులర్ దేశాలే. అక్కడ దేశ, జాతి, మత ప్రమేయం లేకుండ, ఆయా దేశీయ నియమ నిబంధనలకు లోబడి, ఏ మానవుడైనా సరే పౌరసత్వాన్ని పొందవచ్చు. మత స్వేచ్ఛను అనుభవించవచ్చు. అదే నిజమైన సెక్యూలరిజం.

మన దేశంలో అనుసరించబడుతున్న సెక్యూలరిజం అందుకు భిన్నంగా వుంది. ప్రతి దేశమూ ఒక జాతికి సంబంధించి వుంటుంది. జాతి అంటే ఒకే భాష, ఒకే సంస్కృతి కలిగిన ప్రజ. అట్టి ప్రజ మెజారిటీగావున్న ఒక సమాజమే దేవం. అట్టి జాతి భారతదేశంలో ఎవరు? మనం ప్రస్తుతం అనుసరిస్తున్న సెక్యూలరిజం మెజారిటీ జాతికి అనుకూలంగా వున్నదా?

ఈనాడు దేశాన్ని పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యలన్నీ మౌలికంగా ఈ విషయ విధానం నుంచి ఉద్భవించినట్టివే అనేది నా ఉద్దేశ్యం. అందుకే మన సెక్యులరు విధానాన్ని సరైన పద్ధతిలో పునరాలోచించవలసి వున్నదంటున్నాను.

మతాలు వేరైనా జాతి ఒక్కటే. అందువల్ల మతాలను మైనారిటీలుగా గుర్తించకూడదు.

ఈ దేశంలో మైనారిటీలుగా గుర్తించ బడవలసినట్టివి భాషా రాష్ట్రాల్లోని అన్య భాషావర్గాలు. మత వర్గాలు కావు. మతవర్గాలు మైనారిటీలు కాజాలవు. కాగూడదు. కుటుంబం హిందువులై వున్నప్పుడు, కుటుంబంలోని ముగ్గురు అన్నదమ్ములు మూడు మతాలను స్వీకరించినంత మాత్రంచేత వాళ్ళు మైనారిటీలెలా అవుతారు?

మతాలను మైనారిటీలుగా గుర్తించ కూడదు.

అంతేగాక, ఏ మైనారిటీ వర్గానికి కూడ మెజారిటీ శ్రేయస్సుకు భంగకరమైన ప్రత్యేక హక్కులను, శాసనాలను అనుమతించకూడదు. పార్లమెంటు ఆమోదించే

అన్ని శాసనాలు కూడ ప్రతిపౌరుడికి విధిగా వర్తించి తీరాలి. ఈ విధమైన దృష్టిలో మన అంతరంగిక విధానాలను పునరాలోచించు కోవలసి వుంది.

అంబేద్కరు కనుక మరికొంత కాలం బ్రతికి వుండి వుంటే, లోహియా ఆశించినట్టు మొత్తం భారతజాతి కంతకూ నాయకత్వం స్వీకరించి వుండేవాడు. తన ఆలోచనలకు, లక్ష్యాలకు అనుకూలమైన, ఆధునికమైన అని అభ్యుదయ జాతీయ పక్షాలను కలుపుకొని, దేశానికి ఒక బలమైన నాయకత్వాన్ని అందించి వుండేవాడు. జాతి రక్తంలో తర తరాలుగా పేరుకుపోయిన పిరికితనాన్నీ, దైన్యాన్నీ, దాస్యగుణాన్నీ తొలగించి వేసి, ఒక శౌర్య ధైర్య పౌరుషాలుగల అగ్రరాజ్యంగా దేశాన్ని తీర్చిదిద్దేవాడు. అట్టి అదృష్టానికి దేశం నోచుకోలేదు. అందుకే కుల మత వర్గ భిన్న భావాలు లేకుండ అంబేద్కరీయ దృక్పథంగల భారతీయులంతా ఏకమై ఒక ఉన్నత ఉత్తమ స్థాయిలో దేశాన్ని నడిపించవలసి వున్నదంటున్నాను.

## 24. కొన్ని కొన్ని ప్రశ్నలు

పరిష్కరించలేని సమస్యలతో చచ్చేకంటే
అవి సమస్యలే కావనుకొని బ్రతకడం మేలు;
వెలుగుకు నీడ సమస్య కాదు,
నీడకు హేతువు నీవే !

ఇప్పుడు మనం కొన్ని ప్రశ్నలకు జవాబులు చెప్పుకోవలసి వుంది.

(1) అంబేద్కరు హిందూ మతంలోనే ఎందుకు వుండలేక పోయాడు?

(2) ఆయన నిరీక్షించిన 20 సంవత్సరాలలోనూ సవర్ణ హిందువుల వైఖరిలో ఆశించినంత మార్పు వచ్చి వున్నట్లైతే, ఆయన హిందువుగానే కొనసాగి వుండే వాడా?

(3) భారత దేశంలో క్రైస్తవం, ఇస్లాం వంటి మతాలింకా వుండగా ఆయన బౌద్ధాన్నే ఎందుకు స్వీకరించినట్టు?

(4) అసలు మత మనేదే ఎందుకు? మతం లేకుండా మానవుడు జీవించలేడా? శాంతి భద్రతలకు, అభ్యుదయానికి, సహజీవనానికి, పరస్పర సహకారానికీ మతం అవసరమా?

(5) బౌద్ధ మతంలో ఆయనకు పూర్ణ సంతృప్తి లభించిందా?

మొదటి ప్రశ్నకు జవాబు ఇప్పటికే చెప్పబడింది. హిందూ మతంలో మానవ సమానత్వం లేదు. కులాల పేరుతో మానవ మానవ సమాజం ముక్కలు ముక్కలుగా విడగొట్టివేయబడింది. ఆ ముక్కలు తిరిగి అతుక్కునే అవకాశమే లేకుండా చేయబడింది. పైగా ప్రపంచంలో ఎక్కడాలేని అంటరానితనం అనే అమానుష మూఢాచారం హిందూ మతంలో ప్రవేశపెట్టబడింది. మతం పేరుతో దేవుడికి కూడా జందెం తగిలించబడింది. అతగాడి సర్వజనీన జగత్పితృత్వానికే కళంకం తేబడింది.

ఇన్ని విధాలుగా మానవత్వాన్ని వదిలేసి హిందూ సమాజం క్రూరమృగత్వానికి దిగజారిపోవడం వల్ల, నిజమైన మానవుడెవడూ అట్టి సమాజంలో కొనసాగడం సాధ్యం కాదని అంబేద్కరు భావించాడు.

అంటరానితనమూ, కులతత్వమూసామాజికమైనవైతే, శాసనాల ద్వారా వాటిని సంస్కరించవచ్చు. హిందూసమాజంలో ఇవి రెండూ మతానికి ముడిపెట్టబడి వున్నై. వాటిని నిర్మూలించాలంటే మతాన్నే నిర్మూలించవలసిన దుర్గతి ఏర్పడింది. మతాన్ని నిర్మూలించేటంతటి తీవ్రయత్నం చేసేకంటే. మతాన్నే వదిలేసి పోవడం మంచిది కాదా! అదీ అంబేద్కరు నిర్ణయం.

అయితే – బాల్య వివాహాలు, సతీ సహగమనం, విధవావివాహనిషేధం, స్త్రీ శూద్ర విద్యా నిషేధం వంటివన్నీ కూడ మతానికి ముడిపెట్టబడినట్టివే కదా! మతం జోలికి పోకుండానే వాటన్నింటినీ సంస్కరించడం జరగలేదా? దేవాలయ ప్రవేశం కూడ ఈనాడు గతాచారమే అయింది. అస్పృశ్యత కూడా చాలావరకు పోయినట్టే. దీని నంతటినీ కూడ శాసనాల ద్వారా సాధించగలిగినప్పుడు కులవ్యవస్థను మాత్రం ఎందుకు నిర్మూలించలేము? నిర్మూలించగలం మనస్ఫూర్తిగా ప్రయత్నిస్తే. కులం మార్పిడి చట్టం వంటిది చెయ్యగలిగితే

యజ్ఞోపవీతం(జందెం) కూడ మతంతో ముడిపడినట్టిది కాదనే నాఉద్దేశ్యం. యజ్ఞోపవీతం అనేది ఒక్కయజ్ఞకర్మకు సంబంధించిన చిహ్నమే కాని, మతానికి సంబంధించినట్టిది కాదు. జందాలు తీసివేయమన్న బ్రహ్మ సమాజకులు కాని, అందరూ జందాలు వేసుకోవాలన్న ఆర్యసమాజకులు కాని వైదిక మతాన్ని పునరుద్ధరించినవాళ్లే తప్ప వదిలేసినవాళ్లు కాదు. అందువల్ల హిందూ మతంలోని

భారతీయతనూ, వైదిక తత్త్వాన్నీ అలానే వుంచి కులవ్యవస్థను శాసనాలద్వారా నిర్మూలించవచ్చు.

మరి, ఇంతవరకు అట్టి ప్రయత్నం ఎందుకు జరగలేదంటే, నిజాయితీ లోపించినందువల్లనే అని నా ఉద్దేశ్యం. వేదికలెక్కి జాతీయ సమైక్యం కోసం ఉపన్యాసాలిస్తాం, వేదికలుదిగి కుల మత భేదాలను రెచ్చగొడతాం. చీలదీసి పాలించడం అనే దుర్నీతిని కొంచెం వదులుకుంటే కుల నిర్మూలనా, మత సామరస్యమూ, జాతీయ సమైక్యమూ సులభసాధ్యాలవుతై.

## కులవ్యవస్థ మతం కాదు

(2) రెండవ ప్రశ్నకు జవాబు కూడ స్పష్టంగా కన్పిస్తున్నట్టిదే. అంటరాని తనాన్నీ, కరుడుగట్టిన కులవ్యవస్థనూ తొలగిస్తే హిందూమతం అన్ని మతాల కంటె గొప్ప మతమే అన్న ఉద్దేశం అంబేద్కరుకుంది.

ఆదినుంచీ ఆయన జరిపిన పోరాటాలనూ, చేసిన ఉద్బోధాలనూ, వ్రాసిన ఉద్గ్రంథాలనూ పరిశీలిస్తే ఈ వాస్తవం స్పష్టపడుతుంది. పూనా ఒడంబడికపై ఆయన సంతకం చేయడం కూడా అదే సదాశయంతో. ఆ ఒడంబడిక నిరాదరించబడడంతో ఆయనకు నిరాశ కలిగింది. అయినా ఇరవై ఏళ్లపాటు ఆయన నిరీక్షించి వున్నాడంటే, ఏమాత్రమైనా అభివృద్ధి కనిపించగలదేమో ననే.

స్వతంత్ర భారత్‌లో అధికారంలోకి వచ్చిన అగ్రకుల నాయకులు పదవీ వ్యామోహంలో పడిపోయి, ఎవరి కులాన్ని వారు ఉద్ధరించుకోవాలనే తాపత్రయంలో మునిగిపోయి, దళిత ప్రజలను మరిచిపోవడంవల్లనే అంబేద్కరు ఇంక నిరీక్షించి లాభంలేదని అనుకోవలసి వచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆ పదేండ్లలోనూ సవర్ణుల వైఖరిలో ఏమాత్రం చెప్పకోదగిన మార్పువచ్చి వున్నా, అంబేద్కరు హిందూమతంలోనే కొనసాగేవాడు. మతం మార్చే సమయంలో ఆయన చేసిన వ్యాఖ్యలను, వెల్లడించిన బాధను నిశితంగా పరిశీలించి చూస్తే ఈ విషయం స్పష్టపడుతుంది.

(3) ఒక మూడవ ప్రశ్నకు జవాబుకూడ స్పష్టమైనట్టిదే. దేశంలో ఎన్నో మతాలున్నై. అందులో అంబేద్కరు పరిశీలించ వలసినట్టివి నాలుగైదు. అందులో క్రైస్తవమూ, ఇస్లామూ భారతభూమిలో పుట్టినట్టివి కావు, అవి ఈ దేశానికి వలస

వచ్చినట్టివి. విదేశీ స్వభావం కలిగినట్టివి.

ప్రతి దేశానికి, ప్రతి జాతికీ ఒక విశిష్టమైన స్వభావం వుంటుంది. సాంఘికమైన లోపాలను మినహాయించి, మతాన్ని పరిశీలించి చూస్తే హిందూమతానికి తనదైన ఒక జీవలక్షణం వుంది. దానికి విదేశీయ మతాచార సంప్రదాయాలు విరుద్ధమైన వైనప్పుడు, ఘర్షణ ఏర్పడి తీరుతుంది.

అదీ కాక, హిందూమతం ఇతరమతాలను తనలో ఇముడ్చుకోగలిగినంతటి విశాలమైనట్టిది. విదేశాల నుంచి వలస వచ్చిన మతాలు హిందూ మతంతో సహజీవనం చెయ్యగలిగి కూడా లేవు.

సాంఘికమైన ఎన్ని ఇబ్బందులు పడుతున్నా, ఎన్ని క్రూర హింసలకు గురిఅవుతున్నా దళిత ప్రజలు స్వచ్ఛమైన భారతీయులు, భూమి పుత్రులు, స్వభావంలో, సంప్రదాయాలలో, మతాచార వ్యవహారాలలో సిసలైన హిందువులు, అట్టి వాళ్లకు తద్విరుద్ధస్వభావం గల ఏ మతాన్ని అంటకట్టినా, అట్టి చర్య ధర్మం కాజాల దన్న యోచన అంబేడ్కరు కుంది.

ఏనాటికైనా అస్పృశ్యతా, కులవ్యవస్థా నిర్మూలించబడక తప్పదనీ, దళితకులాలూ సవర్ణకులాలూ కలిసిపోయి సమైక్య జాతి ఏర్పడడం కూడ తప్పదనీ అంబేడ్కరుకు తెలుసు. దళితులను, హిందువుల నుంచి పూర్తిగా వేరు చేయాలన్న ఉద్దేశం అంబేడ్కరుకు లేదు. అందుకే ఆయన బౌద్ధాన్ని స్వీకరించాడు.

ప్రతి రాయిలోనూ, ప్రతి వాయిలోనూ, ప్రతి జీవిలోనూ దేవుణ్ని చూడ గలిగిన ఆధ్యాత్మిక దృక్పథం హిందూ మతానిది. తక్కిన మతాలు చాలవరకు కత్తిలో మాత్రమే దైవాన్ని చూస్తున్నట్టివి. సత్యం, అహింస, వాత్సల్యం, కరుణ, సౌజన్యం, పరోపకారం వంటి సద్గుణ శీలాలకు ప్రాధాన్యం ఇచ్చే అంబేడ్కరు బౌద్ధం వైపుకు తప్ప, మరొక మతం వైపుకు ఎలా మొగ్గగలడు?

**మత మనేది ఎందుకు ?**

(4) అసలు మత మనేదే ఎందుకు? మతం మూఢ విశ్వాసాల గతం అని అంబేడ్కరుకు తెలియదా? మనకు కావలసింది సాంఘిక విముక్తీ, సాంఘిక న్యాయమూ, సాంఘిక సమానత్వమూ కదా! వాటిని సాధించడానికి మతం ఎందుకు?

ఏదో ఒక మతానికి చెందడం ఎందుకు? మతంతో సంబంధంలేని ఒక పోరాట పక్షంగానే దళితజనం కొనసాగవచ్చు కదా! హేతు దృక్పథానికి ప్రాధాన్యం ఇచ్చే అంబేద్కరు మత ధోరణిలో ఎందుకు పడ్డట్టు?

ఇది చాల గొప్ప ప్రశ్న.

అంబేద్కరిజానికి మత ప్రమేయం వుండకూడదనేది నా దృక్పథం. ఏ వ్యక్తి ఏ మతానికి చెందినా, అంబేద్కరు లక్ష్యాన్ని ఆమోదించి దాని సిద్ధికోసం పోరాడాలనుకొన్నవాడు ఏమతం వాడైనా అంబేద్కరిష్టు కావచ్చు.

అంబేద్కరుకు మతమూ, దేవుడూ, భక్తీ, మోక్షమూ వంటి ఆధ్యాత్మిక విషయాలేవీ ప్రధానం కాదు. ఆయన మతం మారింది కేవలం దళిత జనోద్ధరణ కోసమే.

అంబేద్కరు బౌద్ధాన్ని స్వీకరించడంలో ఒక దెబ్బకు రెండు పిట్టల్ని కొట్టగలిగాడు. హిందూ మతానికి గుణపాఠం నేర్పడం ఒకటి, హిందూ సమాజం నుంచి దూరం కాకుండా దళితుల్ని కాపాడడం మరొకటి. ఒక్క బౌద్ధమతావలంబనం వల్ల మాత్రమే లభించగల సత్ఫలితాలు ఈ రెండూ.

(5) ఇక ఐదవ ప్రశ్న చాల విశాలమైనటిది. బౌద్ధమతంలో అంబేద్కరు పూర్ణ సంతృప్తిని పొందగలిగాడా? ఈ ప్రశ్నకు జవాబుగా గ్రంథాలకు గ్రంథాలే వ్రాయవచ్చు. నేను మాత్రం ఒక్క మాటలో చెబుతున్నానను, "పొందలేదు" అని.

బౌద్ధమతం కూడ ఆయనకు పూర్ణ సంతృప్తిని కలిగించలేదు. అందుకే దానిని తమ కనుకూలంగా మలుచుకోవడానికి ప్రయత్నించాడు. అట్టి ప్రయత్న ఫలితమే "బుద్ధుడూ అతడి ధర్మమూ" అనే ఆంగ్ల గ్రంథం. ఆ గ్రంథాన్ని నిశితంగా పరిశీలించి చూస్తే అందులోని చాల విషయాలు ఆయనకు పూర్ణ తృప్తిని ఇవ్వలేనట్టు కనిపిస్తుంది. అంబేద్కరుకు సహజ సిద్ధమైన హేతువాదానికి బుద్ధుని ఆచార నియమాలూ, ఆధ్యాత్మిక భావాలూ నిలవగలిగి లేవు.

ఆయన మరికొంతకాలం జీవించి వుంటే, తనదైన ఒక క్రొత్త జీవిత విధానానికి, ఒకకొత్త నిజానికి రూపం ఇవ్వ గలిగేవాడు. ఆ బాధ్యత ఇప్పుడు మేధావులైన అంబేద్కరీయులపైన పడింది.

**వాది బలమా? వాద బలమా?**

తనకు తాను ప్రవాస శిక్ష (ఎక్సైల్) ను విధించుకొని, భరద్వాజుని వద్ద పరివ్రాజక దీక్షను పొంది, కపిలవస్తు నుంచి మగధ రాజధానియైన రాజగృహాని కెళ్లిన గౌతముణ్ని మన అంబేద్కరు వర్ణించిన తీరు ఎంత అద్భుతంగా వున్నదో "బుద్ధుడూ అతడి ధర్మమూ" గ్రంధంలో చూడవచ్చు.

నున్నటి బోడితలతో, కాషాయ వస్త్రంతో, చేతిలో భిక్షాపాత్రతో రాజగృహం వీధుల్లో భిక్షువుగా ప్రత్యక్షమైన గౌతముణ్ని చూచి అక్కడి పౌరులు ఎంతగా ఆశ్చర్యపడ్డారో, సమ్మోహితులయ్యారో అంబేద్కరు మాటలోనే చూడండి.

"Having seen his personality and dignity and splendid beauty surpassing all other men, the people of that region are astonished at Him wearing the Cloths of Sanyasi. And seeing Him he who was going elsewhere stood still, and he who was standing there followed Him on the way, he who was walking gently and gravely ran quickly, and he who was sitting atonce sprang up. His eye brows, His forehead, His mouth, His body, His hand, His feet, or His gait........ Whatever part of Him any one beheld, that at once rivetted his gaze."

సిద్దార్థ గౌతముడు ఎంతటి మోహనరూపుడో, తొలిచూపులోనే ప్రజలను ఎంతగా సమ్మోహపరచిన సమగ్ర సుందరాకారుడో పై వర్ణన తెలుపుతూ వుంది.

ఆయన సన్యసించిన తొలిదశలోనే ప్రజల్ని అంతగా సమ్మోహపరిస్తే, ఎంతో కఠిన నిష్ఠా పరత్వంతో యోగసిద్ధుడూ, మహాబుద్ధుడూ అయిన తర్వాత ఆయన రూపమూ, సమ్మోహనశక్తి ఇంకా ఎన్నిరెట్లు పెరిగివుంటుందో ఊహించవచ్చు.

బుద్ధుడు అంతటి విజయాన్ని సాధించడానికి కారణం ఆయనలో గల త్యాగమూ, రూపమూ, అభిజాత్యమూ మాత్రమే ననీ, సిద్ధాంత బలం కానే కాదనీ, ఆయన బోధించిన నీతి నియమ నిష్ఠాదులు అంతకు ముందు అనేకులు బోధించినట్టివే ననీ, వాటిలో ప్రత్యేకత ఏమీ లేదనీ నేనంటున్న దందుకే.

నీతి నియమాలతో, సుఖ సంపదలతో జీవితాన్ని సంపూర్ణంగా అనుభవించడమే మానవ జన్మకు పరమార్ధమని గౌతముడికి బింబిసారుడు చేసిన ప్రబోధమే నాటికీ, నేటికీ, ఏ నాటికి కూడ సత్య సమ్మతమైనట్టిది. ఆయనకు

గౌతముడు చెప్పిన సమాధానాలు కేవలం వైరాగ్య పరమైనట్టివే. ఆచరణ యోగ్యమైనట్టివి కావు. సహజధర్మాలు కావు.

సాంఘికమైన సమానత్వాన్నీ, ఔదార్యాన్నీ కొంతవరకు ప్రదర్శించినా, బుద్ధుడు శాసించిన నియమ నిష్ఠలు ఒక మహోన్నత స్వర్ణ సింహాసనం మీదే వుండి పోవడానికీ, ఆధ్యాత్మిక పారదర్శకత్వంలో ఆయన పూర్తిగా విఫలం కావడానికి అదే కారణం.

సహజసిద్ధమైన మానవ జీవితాన్ని క్రమబద్ధంగా నడిపించడానికి బదులు దాని సహజత్వాన్ని కుంటుపరిచే, కృశింపజేసే, నిర్బంధించే, నిషేధించే శాసనాలను ప్రజలపై రుద్దజూసే ఎలాంటి ప్రాభవమైనా సరే ఆరాధించబడవచ్చునేమో కాని, ఆచరణలోకి రావడ మంటూ వుండదు.

ఈ సత్యాన్ని క్షుణ్ణంగా గుర్తించిన వాడు అంబేద్కరు.

అందుకే ఆయన మతం మారుస్త మతం కోసం కాదు, దళిత ప్రజ సర్వతోముఖాభివృద్ధి కోసమూ, భారతజాతి సమగ్ర సమైక్యం కోసమూ మాత్రమే అని నేననడం.

## 25. సర్వ మానవ సమతా తత్వం

**నీ కెవడో ఏదో చెయ్యలేదని విమర్శించకు**<br>
**నీ వెవడి కైనా మేలు చెయ్యడానికి యత్నించు;**<br>
**ఇతరుల నుంచి ఆశించేవాడు భిక్షువు**<br>
**ఇతరుల కిచ్చేవాడు దైవం.**

అంబేద్కరు బౌద్ధమతంలోకి మారాడు కనుక దళితులంతా మతం మార్చాల నడం హేతుబద్ధమైన వాదం కాదు.

మతం అనేది వ్యక్తిగతం. ఎవరి మనస్తత్వాన్నిబట్టి వారు ఆయా మతాలను అనుసరించవచ్చు. మతం ఆధ్యాత్మిక ప్రయోజనం కలిగినట్టిది. సాంఘిక ప్రయో జనాల స్థాయికి దానిని దిగజార్చ గూడదు.

దళితుల సాంఘిక దుస్థితి తొలగిపోవడ మే మతం మార్పిడి యొక్క ప్రయోజన మనుకుంటే, అట్టి యత్నం ఆచరణ సాధ్యమైనట్టిదీ కాదు, సత్ఫలితాలను ఇవ్వగలిగినట్టిదీ కాదు. ఎందుకంటే -

(1) ఇదివరకే నేను చెప్పినట్టు, దళితజనులు ఒక్కుమ్మడిగా మతం మార్చే మనస్తత్వం కలవాళ్లు కాదు.

(2) ఏ కారణం చేతనైనా అలా మారడమే జరిగితే, అట్టి మార్పు ఈ మొత్తం కులాలను మైనారిటీలుగా మార్చేస్తుంది. దానివల్ల జాతీయ స్థాయిలో ప్రయోజనాలకంటే, ప్రమాదాలే ఎక్కువవుతాయి. హిందూ మతంలోని ఆరాధన స్వేచ్ఛకూ, ప్రజ్ఞా వికాసానికీ, సాంస్కృతిక వినోదాలకూ, ఆధ్యాత్మిక తత్త్వ జిజ్ఞాసకూ అలవాటుపడిన దళిత కులాల ప్రజలు వైవిధ్యంలేని ఏక ధోరణి దాస్యానికి కట్టుబడి వుండలేరు.

(3) అస్పృశ్యతను తొలగించి కులవ్యవస్థను నిర్మూలించడం అంబేద్కరు ప్రధాన లక్ష్యం. అట్టి లక్ష్యాన్ని సాధించడం ఇతరులకు వీలు కాదు. ఈ లక్ష్యసాధనకు నడుంకట్టి నిలబడిపోరాడాలంటే హిందూమతంలో వుండే పోరాడాలి.

హిందువు కానివాడు హిందూమతాన్ని, దానిలోని చెడుగును విమర్శించడానికి గాని, తిరస్కరించడానికి గాని, సంస్కరించడానికి గాని అర్హుడు కాజాలడు : అది తన సొంత మతమైనప్పుడే దానిలోని లోపాలను సరిదిద్దడానికి అతడు ప్రయత్నించ గలుగుతాడు, పోరాడ గలుగుతాడు, పరాయిమతం వాడికి అట్టి హక్కుండదు.

(4) భారతజాతికీ, భారత సంస్కృతికీ భారతీయ కళలకూ, భారతీయ వేదాంతాలకూ మూలపురుషులూ, మూలరుషులూ అయిన మతంగ ధర్మవ్యాధ వ్యాస వాల్మీకాదు లందరూ హరిజనులే (ఈనాటి దళితకులాలకు చెందినవాళ్లే) అనే వాస్తవాన్ని గుర్తించి గర్వపడుతున్న, అట్టి ఔన్నత్యానికి తిరిగి ఎదగడం కోసం తీవ్రంగా కృషి చేస్తున్న అనేకమంది దళితకులాల విద్యావంతులూ, కళాకారులూ, మేధావులూ తమ వారసత్వపు జన్మహక్కులను వదులుకోడానికి అంగీకరించరు.

ఇంతకాలమూ పోరాడుకొంటూ వచ్చాం. అంటరానితనం చాలవరకు పోయినట్టే. కులవ్యవస్థకూడా తగ్గుముఖం పట్టింది. మరికొంతకాలం పోరాడితే సంపూర్ణ లక్ష్యసిద్ధి చేకూరడం తథ్యం.

ఇక్కడొక వాస్తవాన్ని గుర్తించవలసి వుంది. ఈనాడు ఎక్కడైనా అంటరానితనం పాటించబడుతున్నదంటే, అఘాయిత్యాలు జరపడుతున్నాయంటే అందుకు ప్రధాన కారణాలు ఆర్థిక పెత్తాందారీ తనమూ, రాజకీయ అధికారదాహమూ మాత్రమే. మత విశ్వాసాలు కాదు. అందుకే అంబేద్కరిజాన్ని మతంతో ముడి పెట్టవద్దంటున్నాను.

## 26. పునశ్చరణాలు

**కత్తికి ఎప్పుడూ పదును పెడుతూనే వుండు**

**కత్తి అరిగినా పదును తరగ కూడదు,**

**తుప్పు పట్టి పోవడం కంటే కత్తి**

**అరిగిపోయి పోవడం ఉత్తమం.**

అంబేద్కరిజం గురించి నేను ప్రతిపాదిస్తున్న ప్రధానాంశాలను ఇక్కడ మళ్లీ ఒకసారి జ్ఞాపకం చేస్తున్నాను.

1. అంబేద్కరిజానికి కులమతాలతో సంబంధం వుండకూడదు.

2. మత మనేది మరణానంతర స్థితిగతులకు సంబంధించినట్టిది. దేవుడు, స్వర్గం, మోక్షం వంటి ఆధ్యాత్మిక ప్రయోజనాలకోసం ఎవరైనా మతం మారితే మారవచ్చు. అలా మారినవాళ్లు కూడ ఆర్థిక, సాంఘిక, రాజకీయ విషయాలలో అంబేద్కరు మార్గంతో ఏకీభవిస్తే అంబేద్కరిష్టులే అవుతారు.

3. అంబేద్కరు మతం మారడానికి కారణం ఒక్కటే. ఆ కారణం మూడు భాగాలు (1) తాను హిందూమతంలో పుట్టడం (2) హిందూమతంలో అమానుషమైన కులవ్యవస్థ, అంటరానితనం పాతుకుపోయి వుండడం. (3) ఆ రెండు దురాచారాలను, ముఖ్యంగా అంటరానితనాన్ని (పూనా ఒడంబడిక ద్వారా తనకు వాగ్దానం చేసికూడ) రద్దు చేసుకోడానికి సవర్ణ హిందువులు సిద్ధంగా లేకపోవడం. అంబేద్కరు శపథానికీ, దాని అమలుకూ ఇదొక్కటే కారణం. ఇది పూర్తిగా సాంఘికమైనట్టిదీ, దళితులకు సంబంధించినట్టిదీ అనే వాస్తవం సుస్పష్టమే.

4. అంబేద్కరిజం నిర్దేశించే ప్రధాన లక్ష్యం అస్పృశ్యతా నివారణ. రెండో లక్ష్యం కులవ్యవస్థా నిర్మూలన. మూడో లక్ష్యం భారత జాతీయ సమైక్యత. నాలుగో లక్ష్యం సమస్త మానవులకూ సమానంగా ఒకే న్యాయం, ఒకే ధర్మం, ఒకే అవకాశం, ఒకే జీవిత స్వేచ్ఛ.

5. అంబేద్కరిజం విశ్వవిశాలమైన, సార్వజనికమైన, భారతీయమైన, ఉపనిషద్వేదాంత ప్రోక్తమైన, ఆత్మ సంబుద్ధ శోభితమైన, ప్రజ్ఞాన వైభవ సంపన్నమైన ఒక సమజీవన మార్గం. ఈనాటి ఆధునిక భాషలో చెప్పాలంటే. అది ఒక భారత సోషలిజం.

6. అంబేద్కరిజం బుద్ధిజం కంటే గాఢమైనట్టిది, గంభీరమైనట్టిది. మార్క్సిజం కంటే విశాలతరమైనట్టిది. ప్రగతిశీల మైనట్టిది. మానవ సహజ వికాసానికి ప్రపంచంలోని ఏ ఇజం కంటే కూడా అంబేద్కరిజం ఉన్నతోన్నతమైనట్టిది, ఉత్తమోత్తమమైనట్టిది.

7. ఇంతటి ఉన్నతోన్నత, ఉత్తమోత్తమ మానవ జీవిత మార్గాన్ని ప్రతిపాదిస్తున్న అంబేద్కరిజం సమస్త భారతీయులకూ, సర్వ ప్రపంచ మానవులకూ కూడ ఆమోదయోగ్యమూ, ఆచరణ సాధ్యమూ అనే నే నను కొంటున్నాను.

అయితే, స్వార్థపరులూ స్వప్రయోజకులూ అయిన ఉన్నత వర్గాలు సమాజం మీద తమ పట్టును వదులుకోడానికీ, కనీసం సడలించడానికీ కూడ అంగీకరించరు. అందుకే, మార్క్సిజాన్ని అమలుపరచడానికి కార్మిక వర్గం ఎలా పూనుకోవలసి వచ్చిందో, అలానే అంబేద్కరిజాన్ని అమలు పరచడానికి దళిత బడుగు బలహీన వర్గాలు పూనుకోవలసి ఉంది.

8. బుద్ధుడు పుట్టి పాతిక వందల సంవత్సరాలు దాటింది. మార్క్సుపుట్టి వందేళ్లు దాటింది. ఆ కాలాలు పాతబడిపోయాయి. మానవుడు సాధించిన వేల సంవత్సరాల అభివృద్ధి ఒకెత్తు, ఈ అర్ధ శతాబ్దంలోనూ సాధించిన అభ్యుదయం ఒక ఎత్తు. గత శత సహస్రాధిక శతాబ్దాల అభివృద్ధికంటే ఈ ఏభై యేళ్ల అభ్యుదయం వైజ్ఞానికంగా ఎన్నెన్నో రెట్లు గొప్పది. కాగా, అన్ని ఇజాల కంటే అంబేద్కరిజం అత్యాధునిక మైనట్టిది.

9. భూస్వాములు, ధనికవర్గాలు, సవర్ణ హిందువులు కూడ గతంలో వున్నంత అజ్ఞానంలో ఈనాడు లేరు. జ్ఞానంలో విజ్ఞానంలో మానవతలో సర్వమానవ

సమానతలో విశ్వశ్రేయో దృక్పథంలో ఈనాటి యువకులు ఎంతో అభ్యుదయాన్ని సాధించగలిగారు. అజ్ఞానాంధకారం, మూర్ఖపట్టుదల, కర్మసిద్ధాంత విశ్వాసం, స్వర్గ నరక భయ విభ్రాంతులు పూర్వం వున్నంత గాఢంగా ఈనాడు లేవు.

10. ఈ వాస్తవాన్ని మనం గుర్తించవలసి వుంది. సర్వమానవ సమానత్వాన్ని అభీష్టించే మార్పిజాన్ని సాధించడానికి ఒక్క కార్మిక వర్గమే పోరాడవలసి వుండేది. ఈనాడు అలాంటి సంకుచిత పరిస్థితిలేదు. అభ్యుదయ మనస్తత్వం గల యువకులు, మేధావులు అన్ని వర్గాల నుంచీ ముందుకు వస్తున్నారు. ఇది కాల గమనంలో వస్తున్న వికాసం.

11. అంబేద్కరు హరిజన నాయకుడే కాదు, దళిత వర్గ నాయకుడే కాదు, భారత జాతీయ నాయకుడే కాదు, విశ్వజనీన నాయకుడు. ఆయన పోరాటాన్ని, ఆలోచనని, ఆదర్శాన్ని నిశితంగా పరిశీలించిన మీదట ఆయన గురించి నేను ఏర్పరచుకొన్న నిర్ణయమిది. అందుకే అంబేద్కరిజానికి ఒక విశ్వజనీన రూపం ఇచ్చాను. మేధావులు పరిశీలించగలరు.

**అంబేడ్కరీయా**

(12) అంబేద్కరు లాంటి నాయకుడు, అంతటి సమున్నత సాంఘిక స్పృహ కలిగిన వ్యక్తి ఈ శతాబ్దంలోనే, మొత్తం ప్రపంచంలోనే మరొకడు లేడని నా ఉద్దేశం. మన దేశంలో కూడా సమైక్య భారతజాతి సముద్భవాన్ని ఇంతగా అభిలషించిన నాయకుడు మరొకడు లేడని కూడా నా ఉద్దేశం. అందువల్ల అంబేద్కరును "నవభారతజాతిపితగా" నా అంబేద్కరు సుప్రభాతకావ్యంలో పేర్కొని వున్నాను. మొత్తం భారతజాతిపై ఆయన ప్రభావం ఎంత అద్భుతంగా పనిచేస్తున్నదో గమనించిన మీదట, నేనిప్పుడంటున్నాను – మన ఈ భారతదేశాన్ని "అంబేడ్కరీయా" అని పిలవడం సముచితం అని.

(13) ఈ దేశంలోనూ, ఇతర దేశాలలోనూ కూడ దళితుల్ని అమెరికా నీగ్రోలతోనూ, దక్షిణాఫ్రికా నల్లజాతులతోనూ పోల్చడం పరిపాటి అయింది. అలా

పోల్చడం అజ్ఞానంతోనో, వంచనతోనో కూడినట్టిది. భారతదేశంలోని దళితులకూ, తెల్లవాళ్ళ అమానుషత్వం క్రింద నలిగిపోతున్న నల్లజాతులకూ సంబంధమే లేదు.

నల్ల తెల్ల జాతుల సమస్య రెండు విభిన్న జాతుల మధ్యవుండే జాతి విభేద సమస్య. భారతదేశంలోని దళితుల సమస్య ఒకే జాతిలోని దాయాదుల మధ్య ఆరని అగ్నిహోత్రంలా మండిపోతున్న సమస్య. బలవంతులైన అన్నలు అబలులూ, అమాయకులూ అయిన తమ్ముళ్ళను మోసగించి అణచిపెట్టి, వెలివేసి వెట్టిచాకిరీ చేయించుకుంటున్న సమస్య. ఇవి వేరు వేరు సమస్యలు. కాదని ఎవళ్ళైనా అంటే, అట్టివాళ్లు దళితులను బుద్ధిపూర్వకంగా తప్పుదారిని పట్టిస్తున్నారనే గుర్తించాలి. అంబేద్కరు చెప్పిన దళితజన (బ్రోకెన్ పీపుల్) సిద్ధాంతంలో ఇంతటి అర్థం వుంది.

ఆయన చెప్పిన ప్రతి మాటను, ప్రతి వాక్యాన్ని, ప్రతి భావాన్ని కూడ ఇంత నిశితంగా పరిశీలించవలసి వుంది.

(14) కేవలం "అంబేద్కరో" అని అరవడంవల్ల ఫలితమేమీ వుండదు.

అంబేద్కరుపట్ల నిజంగానే భక్తి గౌరవాలు కలవాళ్లు చెయ్యవలసిన పని ఒకే ఒకటుంది. అస్పృశ్యతా నివారణ, దారిద్ర్య నిర్మూలన, హరిజనోద్ధారణ వంటి సేవలు ఈనాడు ప్రతీ రాజకీయ వృత్తి కారుడూ చేస్తున్నట్టివే. రాజకీయ వృత్తికారులకు అంబేద్కరును పొగడడం, ఆయన జయంతి వర్ధంతులలో పాల్గొనడం, ఆయన విగ్రహాలకు (సాంఘిక సంక్షేమంవారి ఖర్చుతో) పూలమాలలు వెయ్యడం- ఇలాంటివి వోట్ల వ్యాపార రహస్యాలై పోయినై. నేను చెప్పేది వీటిని గురించి కాదు.

అంబేద్కరు పట్ల భక్తి గౌరవాలు కల నిజమైన అంబేద్కరీయుడు చెయ్యవలసినపని ఒకేఒకటి వుంది. అది ఇది అంబేద్కరువలె మాతృభాషలో గాని, ఇంగ్లీషులోగాని, సంస్కృతంలోగాని, స్పష్టంగా, తప్పులు లేకుండా ఒక పాతిక పంక్తులు ఏ విషయం మీద నైనా సరే వ్రాయగలగడం.

(15) అంబేద్కరు గొప్పతనం ఆయన ఆర్జించిన పాండిత్యంలోనూ, అంతటి పాండిత్యాన్నీ, హోదానూ, ఒక సాంఘిక సమస్య పరిష్కారానికి ధారబొయ్యడంలోనూ,

తన సమస్తాన్నీ దేశం కోసం త్యాగం చెయ్యడంలోనూ వుంది. అందులో నూరోవంతు పాండిత్యమైనా, లక్షవంతు క్రియాశీలత అయినా లేని హరిజన ధనికులకు, అధికారులకు, మేధావుల మనుకొంటున్న వాళ్ళకు ఆయన పేరెత్తే అర్హత కూడా లేదని నా ఉద్దేశ్యం.

చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకోవడం కాదు. ఆ చెట్టును నిజంగా పోషించి, విస్తరింపజేసి, సిసలైన కాయలనే ప్రజల కందివ్వాలి. అదొక్కటే నిజమైన అంబేద్కరీయత.

(16) కేంద్రం బాగా వుండాలన్నాడు అంబేద్కరు. కేంద్రంలో బలమైన ప్రభుత్వం లేకపోతే జాతి సమైక్యమూ, దేశ సమగ్రాభ్యుదయమూ సాధ్యంకావు. కేంద్రంలో ఒక పార్టీ ప్రభుత్వమూ, రాష్ట్రాలలో వివిధ పార్టీల ప్రభుత్వాలూ వుంటే వుండవచ్చు. అయితే, కేంద్రంతో విరోధించే రాష్ట్రాలుండడం మంచిదికాదు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కూడ ఒకే పార్టీ అధికారంలో వుండాలని అభిలషించడం అసంగతమేమీ కాదు. అలా వుండడంలో ఇతోధికమైన సత్ఫలితం వుండగలదు కూడా.

(17) దేశంలో త్రిభాషా విధానమే ఉత్తమమైనట్టిది. హిందీ, ఇంగ్లీషు మాతృభాష, ఈ మూడూ అవసరమైనట్టివే. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇంగ్లీషును వదులుకోవడం మంచిదికాదు. ఈనాడు ఇంగ్లీషు ఏ దేశానికీ కూడ విదేశీభాషగా లేదు. ప్రతి దేశానికీ అది మాతృభాషలాగే మన్నన పొందుతున్నది. దానిని మనం విస్తరింపజేసుకోవాలే తప్ప వదులుకోకూడదు.

(18) స్త్రీలకు మన వైదిక సంప్రదాయంలో ఇవ్వబడినంత స్వేచ్ఛ ప్రపంచంలో మరెక్కడా ఇవ్వబడినట్టులేదు. విద్యా విజ్ఞాన రంగాలలోనూ, తదితర అన్ని రంగాలలోనూ కూడ పురుషులతో సమానమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను స్త్రీలు అనుభవించిన కాలం అది. స్త్రీలను పరదాలలోనూ, బురఖాలలోనూ వుంచడం భారతీయ సంప్రదాయం కాదు.

జాతిని సాంకర్యంనుంచి రక్షించుకోవాలనుకొనే సంకుచిత మనస్కులైన పురుష స్మృతికర్తలు, శాసనకర్తలు స్త్రీలస్వేచ్ఛను అరికట్టి మానవ వికాసాన్ని నిరోధిస్తూ వచ్చారు. వివిధజాతుల కలయిక వల్లనే మానవజాతి బలవత్తరమౌతుందనీ, తన చుట్టూ మడికట్టుకొని కూర్చునే జాతి బలహీన పడిపోతుందనీ విజ్ఞాన శాస్త్రం రుజువు చేస్తున్నది కదా! ఈనాటి వైజ్ఞానిక సత్యాన్ని ఆనాటి వేదరుషులే ప్రతిపాదించి వున్నారనీ, ఆనాడు ఆవిధంగా వివిధ కులాల తెగల కలయిక అనుమతించబడి వుండకపోతే మన భారతీయ సంస్కృతికి మూలపురుషులూ, ఆదర్శపురుషులూ అయిన మహనీయులెంతో మంది అసలు పుట్టేవుండేవాళ్ళు కాదనీ మనం గుర్తించవలసి వుంది.

మూఢ విశ్వాసాలను మానుకొని, మూఢాచారాల నుండి బైటపడి, భారతీయ సంప్రదాయానికి అనుకూలమైన శాసనాలద్వారా స్త్రీలకు సంపూర్ణస్వేచ్ఛను కలిగించాలి. అన్నీ రంగాలలోనూ స్త్రీలకు ప్రాధాన్యం ఇవ్వాలి. కులాంతర వివాహాలను ప్రత్యేక శ్రద్ధతో ప్రోత్సహించాలి.

(19) చిన్న చిన్న గ్రామాలను రద్దుచేసి పట్టణాభివృద్ధిని ప్రోత్సహించాలి. చదువుకొన్న ప్రతివాడూ, ప్రాజ్ఞుడైన ప్రతివాడూ, ప్రవీణుడైన ప్రతివాడూ, ఉద్యోగియైన వాడూ, ఉద్యోగం కావలసినవాడూ కూడ పల్లెలనుంచి పట్టణాలకు తరలిపోతూనే వున్నారు. అది సహజమే కూడ. అట్టి సహజత్వాన్ని శాసనబద్ధం చేసి పట్టణీకరణను ప్రోత్సహిస్తే, ఈనాడు భారత జాతిని పట్టి పీడిస్తున్న అనేక భ్రమల నుంచీ, బాధలనుంచీ అచిరకాలంలోనే బయపడవచ్చు.

(20) ఏనాటికైనా భూమిని జాతీయం చెయ్యడం తప్పదనీ, ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉమ్మడి వ్యవసాయం ఒక్కటే జాతి ఆహార సమస్యకు పరిష్కారమార్గమనీ మనం మరచిపోకూడదు.

భూమి వ్యక్తిగత ఆస్తిగా వున్నంత కాలం పొగాకు, కేసరిపప్పు వంటి విషపూరితమైన, ధనవంతులకు ప్రాణప్రదమైన పంటలను నియంత్రించడం కష్టమే

అవుతుంది. భూమి జాతీయం అయినప్పుడే జాతి శ్రేయస్సు ఫలిస్తుంది.

(21) భూమి గరిష్ట పరిమితిని నిర్ణయించడం, మిగులు భూమిని పేదలకు పంచిపెట్టడం వంటివి కేవల రాజకీయ చర్యలు. అట్టి చర్యలను వామ పక్షాలు సమర్ధించడం కూడా రాజకీయమే. వోట్ల రాజకీయం. బహు సూక్ష్మంగా పరిశీలించ వలసిన సమస్య ఇది.

(22) ఇళ్లులేని వాళ్ళకు ఇళ్లు, పనిలేనివాళ్లకు పని, చదువులేనివాళ్లకు చదువు, ఆరోగ్యం లేనివాళ్లకు వైద్యం, భిక్షకులకు చిన్నతరహా పరిశ్రమలు, వృద్ధులకు విశ్రాంతి వసతి గృహాలు - ఇలాంటి కనీసావసరాలను ఉచితంగా కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వంపై వుంది.

(23) గృహ నిర్మాణాల విషయంలో, హరిజనులకు గృహాలు గ్రామాలకు వెలపలకాదు, అవకాశం వుంటే గ్రామాల మధ్యలోనూ, లేకపోతే గ్రామాలకు చేర్చి నిర్మించవలసి వుంది.

హరిజనులకు గృహాలు కట్టేటప్పుడు కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఒంటి గది ఇళ్లు పనికిరావు. ఇటుకలతో కడితే, వంటగదీ అవీ కాక, రెండుగదులూ, ఒక హాలూ అయినా వుండి తీరాలి. కోళ్ళనో, పశులనో పెంచుకోవడానికి తగినంత ఆవరణ వుండాలి. అప్పుడే వాళ్ళకు తగు వసతి సమకూర్చినట్టు అవుతుంది.

ఒంటి గది ఇళ్లుకట్టి, భార్యాభర్తలు ముసలి తల్లిదండ్రులతోనూ, ఎదిగిన బిడ్డలతోనూ ఒకే గదిలో కాపురం చెయ్యాలనడం క్రూరమూ, అమానుషమూ.

(24) ఒక్క మానవుడికే కాదు, సృష్టిలోని ప్రతి జీవికీ కొన్ని సహజవాంఛ లుంటై. వాటిలో కొన్ని కళలుగా మన్నించబడితే, కొన్ని ఉద్రేకాలుగా గుర్తించబడితే, మరికొన్ని బలహీనతలుగా నిరసించబడ్డాయి. మద్యపానం, ధూమపానం, కామం, జూదం, కట్నకానుకలు వంటి బలహీనతలను నిషేధించడానికి అనేక దేశాలు ప్రయత్నం చేసి విఫలమైన సంగతులు అందరికీ తెలిసినవే. బలహీనతలను నియంత్రించాలి. అంటే తగిన శాసనాల ద్వారా కంట్రోలు చెయ్యాలి. అంతే తప్ప

నిరోధించకూడదు. అణచిపెట్టే కొలదీ బహుముఖాలుగా విజృంభించే సహజశక్తులు ఈ బలహీనతలుగా పిలవబడే మానవ వాంఛలు.

(25) వ్యవసాయ కూలీలను సంఘటిత పరచడం అత్యవసరంగా చేపట్ట బడాలి. ప్రభుత్వం ప్రత్యేక అధికారుల ద్వారా ఈ పని చెయ్యాలి వ్యవసాయ కూలీలు సంఘటితులు కాబడి, క్రమబద్ధమైన ఆదాయాలు ఇవ్వబడి, సలక్షణమైన జీవితాలు గడిపే పరిస్థితులేర్పడకుండా ఏజాతీ ఆధునిక మానవ జాతిగా పరిగణించ బడదు.

(26) మన దేశంలో రమారమి రెండుకోట్ల మంది బాలకార్మికులున్నట్టు ఈమధ్యనే ఒక ప్రపంచ సర్వే వెల్లడించింది. ఈ బాల బాలికలచే పనిచేయించడ మనేది అంబేద్కరు వ్రాసిన రాజ్యాంగానికీ, దాని ననుసరించి చేయబడిన అనేక శాసనాలకూ పూర్తిగా విరుద్ధం.

తమ జన్మ హక్కు అయిన విద్యకు దూరం చేయబడి, పసి ప్రాయంలోనే శారీరక శ్రమతో కూడిన కట్టు బానిసత్వానికి గురిచెయ్యబడుతున్న ఈ బాలకార్మికు లంతా ఎవరైవుంటారు? దళిత బడుగు వర్గాలకు చెందిన వాళ్లే అయివుంటారు. చట్టాలు నిషేధించినా ఈ అమానుషత్వం ఎందుకు కొనసాగుతున్నది? అడిగే దిక్కులేక, పోరాడే శక్తిలేక, బ్రతికే గత్యంతరం లేక ఈ దీనావస్థ నుంచి ఈ దళిత బడుగు బీద వర్గాలను సత్వరంగా సముద్ధరించవలసి వుంది.

బాల బాలికలను కార్మికులుగా నియమించడాన్ని పూర్తిగా రద్దుచెయ్యడం ఒక్కటే చాలదు. నిర్బంధ ప్రాథమిక విద్యను నిజాయతీతో అమలుజరపాలి.

(27) బాలబాలికలు విద్యను ముగించుకొని విద్యాలయాలనుంచి బైటపడే వరకు పార్టీ రాజకీయాలజోలికి పోకుండా జాగ్రత్త వహించాలి. విద్యాలయాలలో విద్యార్థులు పార్టీ రాజకీయ ప్రభావాలకు లోనుకావడాన్ని, పార్టీలు కట్టడాన్ని ఎన్నికలు ప్రచారాన్ని అనుమతించకూడదు. విద్యార్థులకు విద్యార్జనే ప్రధాన లక్ష్యం కావలసి వుంది. రాజకీయ పార్టీలు తమ తమ స్వార్థాలకు ఆందోళన సాధనాలుగా విద్యార్థులను వాడుకోవడాన్ని నిషేధించాలి.

(28) చట్టాలు తమంతట తాము ఏపనీ చెయ్యలేవు. సమాజాన్ని సంస్కరించలేవు. వాటిని మానవులే అమలు జరపవలసి వుంది. అమలు పరిచే మానవులు అవినీతిపరులూ, అసమర్థులూ, కులతంత్ర వాదులూ, కుత్సితులూ అయినప్పుడు అట్టి చట్టాలు ఎలా అమలు జరుగుతై? అందువల్ల చట్టాలు చెయ్యడంలో కంటె వాటిని అమలు పరచడంలో ఎక్కువ శ్రద్ధ చూపవలసి వుంది. సంబంధిత అధికారులతో పాటు స్థానిక ప్రజలకు కూడ వాటి అమలులో బాధ్యత కలిగించడం మంచిది.

(29) మతం లేకుండానే మానవుడు బ్రతకవచ్చునని ఇంతకు ముందే చెప్పి వున్నారు. సౌశీల్యమే మతమని వివేకానందుడన్నాడు. ఈనాటి ఏ మతాన్ని పరిశీలించినా సౌశీల్యం ఒక్కటే కొరవడి వుంది. మానవ సమాజం సక్రమంగా నడవడంకోసం నిరోధక ప్రోత్సాహక సాధనాలుగా దైవభక్తీ, స్వర్గ నరకాలూ, పునర్జన్మ భీతీ సృష్టించబడ్డాయి. ఇప్పుడు వాటి స్థానాన్ని రాజ శాసనాలు ఆక్రమించి వున్నాయి. అందువల్ల క్రమబద్ధ సామాజిక జీవితానికీ, మానవ పురోభివృద్ధికీ మతాల అవసరం తీరిపోయిందని నా భావం.

మొత్తం మానవజాతి మతరహితం అయితే తప్ప మానవుడు సంపూర్ణ వికాసం పొందలేడు. ఇది ప్రధాన మార్గ నిర్దేశక సూత్రంగా మన ముందుండవలసి వుంది.

(30) క్షణ క్షణమూ పురోగమిస్తున్న సమాజంలో క్షణ క్షణమూ కొత్త సమస్యలు పుడుతూనే వుంటై. సమస్యలు లేని క్షణమే వుండదు. పాతసమస్యలకు వీడ్కోలిస్తూ, కొత్త సమస్యలకు స్వాగతం చెబుతూ వుండాలి మనిషి. అదే పురోగమనం.

అందుకే మనిషైన వాడు నిత్య జాగరూకుడై, నిరంతర కర్మశీలుడై వుండాలి. తీరికలేని పని, విరామం లేని విద్యార్జన, అంతిమత లేని ఆలోచన మానవుడికి ముఖ్యం. ఇదే అంబేద్కరిజానికి స్ఫూర్తీ, మూర్తీ కావలసి వుంది.

(31) భిక్షాటనను నిషేధిస్తూ చట్టాలున్నై. వాటిని అమలు పరిచే నాథుడే

లేదు. భిక్షకులలో వృద్ధులను వృద్ధమందిరాలకు, వికలాంగులను వృత్తి కేంద్రాలకు తరలించి వెయ్యగా, మిగిలే యువభిక్షగాళ్లను సమీకరించి వాళ్ళచేత ఎన్నో అభివృద్ధి పనులను చెయ్యించవచ్చు.

(32) నిర్వహించవలసిన గంగా కావేరి వంటి మహత్తర ప్రాజెక్టులూ వున్నై. ఏపనినైనా చెయ్యడానికి సిద్ధంగా వున్న కోట్ల కొలదీ నిరుద్యోగులూ వున్నారు. ఆలోచనతో కూడిన ప్రణాళికలే లేవు. ఇలాంటివే అనేక సమస్యలున్నై. అంబేద్కరీయులు గుర్తించగలరు.

(33) ఏ దేశానికైనా రాజకీయాలే ప్రధాన వృత్తిగా పరిణమించడం కంటె దౌర్భాగ్యం మరేదీ వుండదు **Politics is the last resort of a scoundral**అనేది పూర్వరుషుల సూక్తి. బ్రతకడానికి ఏ మంచిపనీ చేతకాని, ఏ వృత్తికీ పనికిరాని ఏకొద్ది మందో రాజకీయాలలో ప్రవేశిస్తూవుండే కాలం నాటిలోకోక్తి అది. ఈనాడు కూడ అది వాస్తవ సత్యమే. అయితే ఆనాడు అట్టి వాళ్లు బహు కొద్దిగా వుండేవాళ్లు, ఈనాడు అసంఖ్యాకంగా వున్నారు. ఈ దుస్థితిని తొలగించవలసి వుంది.

(34) రాజకీయా లంటే ప్రజలను దోచుకు తినడమే అనే చెడు భావాన్ని జాతి మనోవీథినుంచి తుడిచి పారెయ్యాలి. అందుకే ప్రజా ప్రతినిధులకు కనీస అర్హతలను నిర్ణయించాలని నేననడం.

విశ్వశ్రేయో మహనీయమైన, మానవతా మధురమైన సమ్యక్ సమాజ నిర్మాణాన్ని అభిలషిస్తున్నట్టిది అంబేద్కరిజం. ఇదే ఇప్పటికి అత్యాధునికం. దీనిని ఆచరణ సాధ్యం చెయ్యడానికి సమస్త కుల మత వర్గ జాతి ప్రజలంతా ముందుకు రాగలరనే నేను విశ్వసిస్తున్నాను.

మానవుడు వర్ధిల్లాలి
మానవ జాతి ఏకీభవించాలి
మానవ మనస్సు వికసించాలి
మానవాత్మ విజృంభించాలి.

......శుభం....